



www.navabhoomi.in | epaper.navabhoomi.in
RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక






Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 04 మంగళవారం | ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 140
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatnam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# వివాదాల్లో సోనియా

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై సోనియా వ్యాఖ్యల దుమారం
- రాష్ట్రపతి పదవికి ఉన్న గౌరవానికి భంగం కలిగించేలా
- సోనియా వ్యాఖ్యల చేశారని రాష్ట్రపతి భవన్ అభ్యంతరం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రపతిని బహిరంగంగా అగౌరవపరిచిందని వ్యాఖ్యానించిన ప్రధాని నరేంద్ర మోదీ

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధినేత్రి, పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
సాక్షాత్తూ దేశ రాష్ట్రపతిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడం వివాదాలకు కేంద్రబిందువు అయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇదివరకు ఇచ్చిన ప్రసంగాన్ని ఉద్దేశించి సోనయా గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతిని పేద మహిళ అంటూ వివాదానికి తెర లేపారు. అధ్యక్షురాలు తన ప్రసంగం పాఠాన్ని చివరి వరకు కొనసాగించలేకపోయారని,అలసిపోయారని అన్నారు. పూర్ అంటూ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. రాష్ట్రపతి కార్యాలయం దీన్ని ఖండించింది. రాష్ట్రపతి పదవికి ఉన్న గౌరవానికి భంగం కలిగించేలా సోనియాగాంధీ చేసిన ఈ వ్యాఖ్యల చేశారని పేర్కొంది. అట్టడుగు వర్గాలు, రైతుల ప్రతినిధి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన అభ్యంతరాలు, ఆందోళనలను వ్యక్త పరిచారని తెలిపింది. పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉన్న నిబద్ధత ఎప్పటికీ అలసిపోదు.. అని రాష్ట్రపతి కార్యాలయం వెల్లడించింది. ఈ వ్యాఖ్యల పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఘాటు విమర్శలు చేశారు. మొట్ట మొదటి గిరిజన మహిళా రాష్ట్రపతిని, ఓ సాధారణ మహిళలను ప్రత్యక్షంగా అవమానించడమేనంటూ మండిపడ్డారు. రాచరిక కుటుంబానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రపతిని బహిరంగంగా అగౌరవపరిచిందని వ్యాఖ్యానించారు.

# తెలంగాణ బిడ్డకు అరుదైన గౌరవం!

- మలేషియా వేదికగా జరిగిన మహిళల అండర్ 19 ప్రపంచకప్‌లో ఛాంపియన్‌గా నిలిచిన గొంగడి త్రిష
- ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లతో ఐసీసీ.. టోర్నీ ఆఫ్ ది టీమ్‌లో త్రిష ఎంపిక
- త్రిషతో పాటు మరో ముగ్గురికి కూడా ఛాన్స్



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

మహిళల అండర్ 19 ప్రపంచకప్ 2025 విజేత, తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు అరుదైన గౌరవం దక్కింది. మలేషియా వేదికగా జరిగిన మహిళల అండర్ 19 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఫైనల్లో సౌతాఫ్రికాను 9 వికెట్ల తేడాతో చిత్తు చేసి వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలిచింది. భారత విజయంలో గొంగడి త్రిష కీలక పాత్ర పోషించింది. సంచలన బ్యాటింగ్‌తో పాటు అసాధారణ బౌలింగ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఫైనల్లోనూ గొంగడి త్రిష(33 బంతుల్లో 8 ఫోర్లతో 44 నాటౌట్) అదరగొట్టింది. బౌలింగ్‌లోనూ 3 వికెట్లు తీసింది.
అయితే ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లతో ఐసీసీ.. టోర్నీ ఆఫ్ ది టీమ్‌ను ప్రకటించింది. ఈ జట్టులో గొంగడి త్రిషతో పాటు నలుగురు భారత ఆటగాళ్లకు చోటు దక్కింది. త్రిషతో పాటు జి కమలిని, ఆయుషి శుక్లా, వైష్ణవి శర్మ ఈ జట్టుకు ఎంపికయ్యారు. ఈ టోర్నీలో 11 వికెట్లతో హయ్యెస్ట్ వికెట్ టేకర్‌గా నిలిచిన సౌతాఫ్రికా క్రికెటర్ కైలా రేనెకేను సారథిగా ఎంపిక చేసింది.
చరిత్ర సృష్టించిన తెలుగమ్మాయి త్రిష.. టీ20 వరల్డ్ కప్ లో తొలి సెంచరీ" చరిత్ర సృష్టించిన తెలుగమ్మాయి త్రిష.. టీ20 వరల్డ్ కప్ లో తొలి సెంచరీ"
ఈ టోర్నీలో గొంగడి త్రిష 77.25 సగటుతో 309 పరుగులు చేసింది. ఇందులో ఓ అజేయ శతకం కూడా ఉంది. టోర్నీ టాపర్‌గా నిలవడమే కాకుండా.. బౌలింగ్‌లో 7 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. మరో భారత ప్లేయర్ జి కమలిని 35.75 సగటుతో 143 పరుగులు చేసింది. ఆయుషి శుక్లా 14 వికెట్లు తీయగా.. వైష్ణవి శర్మ 17 వికెట్లు పడగొట్టాడు.

**ఐసీసీ అండర్ 19 బెస్ట్ టీమ్:**
గొంగడి త్రిష, జెమ్మా బోథా, దేవినా పెర్రిన్, జి కమలిని, కావోయిమ్‌హే బ్రే, పూజ మహతో, కైలా రేనెకే, కేటీ జోన్స్, ఆయుషి శుక్లా, చమోడి ప్రబోద, వైష్ణ విశర్మ, న్హాబిసెంగ్ నిని

# గ్రూప్-1 అభ్యర్థులకు గుడ్ న్యూస్

- గ్రూప్-1 ఫలితాల విడుదలకు లైన్ క్లియర్
- గ్రూప్-1పై దాఖలైన 2 పిటిషన్లను సుప్రీం కొట్టివేత
- తెలంగాణ ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన సుప్రీం
- కేసుల అడ్డంకులు తొలగిపోవడంతో టీజీపీఎస్సీ త్వరలో గ్రూప్-1 ఫలితాలు

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** గ్రూప్-1 ఫలితాల విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్-1పై దాఖలైన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. వివిధ రకాల అభ్యంతరాలతో అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నేడు(సోమవారం) విచారణ చేపట్టిన ధర్మాసనం వాటిని కొట్టివేసింది. దీంతో ఫలితాల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు అయ్యింది. గతంలో గ్రూప్-1 నియామకాలకు సంబంధించి పలువురు అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే వారి పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కాగా, తెలంగాణ ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన సుప్రీంకోర్టు.. పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పు వెల్లడించింది. కేసుల అడ్డంకులు తొలగిపోవడంతో టీజీపీఎస్సీ త్వరలో గ్రూప్-1 ఫలితాలు విడుదల చేయనుంది. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 11 సంవత్సరాల తర్వాత మొట్టమొదటి గ్రూప్-1 నియామకాలు ఇవే కావడం విశేషం.
కాగా, తెలంగాణలో గ్రూపు-1 మెయిన్ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 27 వరకూ జరిగిన సంగతి తెలిసిందే. మొత్తం 563 పోస్టులకు గానూ 31,403 (క్రీడల కోటా కలిసి) మంది అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించారు. అయితే జీవో 29ను రద్దు చేయాలని, గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీశాయి. రాజకీయ పార్టీలు సైతం వారికి మద్దతు తెలపడంతో ఆందోళనలు తీవ్రతరం అయ్యాయి.

# కలెక్టర్ ఎదుటే తిట్ల పురాణం

- తిట్టుకొన్న మోహన్ బాబు, మనోజ్
- మోహన్ బాబు ఫిర్యాదుతో ఇద్దరిని విచారణకు పిలిపించిన జిల్లా కలెక్టర్
- వారిద్దరిని 2 గంటల పాటు విచారించిన కలెక్టర్
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎదుటే తిట్లు..వాగ్వాదం
- వచ్చే వారం మళ్లీ విచారణకు రావాలని కలెక్టర్ ఆదేశం

2



**హైదరాబాద్-నవభూమి:** మెజిస్ట్రేట్ ఎదుట మంచు మనోజ్, మంచు మోహన్ బాబు పరస్పరం దూషణలకు దిగారు. మంచు మోహన్ బాబు ఫిర్యాదుతో ఇద్దరిని జిల్లా కలెక్టర్ విచారణకు పిలిచారు.
ఆ క్రమంలో సోమవారం అంటే.. ఫిబ్రవరి 03వ తేదీ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ముందు వీరిద్దరు హాజరయ్యారు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. జిల్లా కలెక్టర్ వారిద్దరిని రెండు గంటల పాటు విచారించారు. అయితే వచ్చే వారం మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని వారిద్దరిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.
మరోవైపు తల్లిదండ్రులు, వృద్ధులు సంరక్షణ చట్టం కింద తనకు భద్రత కల్పించాలంటూ జిల్లా కలెక్టర్‌ను కోరారు. అలాగే తన ఆస్తులను సైతం కాపాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆస్తి అంతా తాను కష్ట పడి సంపాదించిందని జిల్లా కలెక్టర్‌కు మోహన్ బాబు వివరించారు. అలాంటి ఈ ఆస్తిలో ఎవరి హక్కు లేదని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే తనకు సంబంధించిన ఆస్తిలో మంచు మనోజ్ ఉన్నారని.. అతడిని అందులోనుంచి ఖాళీ చేయించాలని కోరారు.
అలాగే ఆ ఆస్తిని సైతం తనకు అప్పగించాలన్నారు. ఆ క్రమంలో మంచు మనోజ్‌కు, మోహన్ బాబుకు మధ్య కొంత వాగ్వివాదం చోటు

# తెలంగాణకు శుభవార్త చెప్పిన మోదీ

- 2025-2026 సంవత్సరానికిగాను తెలంగాణకు రికార్డు స్థాయిలో రూ.5,337 కోట్ల బడ్జెట్ కేటాయింపులు
- తెలంగాణలో వివిధ రైలు అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రూ. 41,677 పెట్టుబడులు
- తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ ఇప్పుడు 100% విద్యుద్ధీకరణ
- 7 జిల్లాల గుండా 9 స్టాప్‌లతో 5 వందే భారత్ రైళ్లు

2



**న్యూఢిల్లీ-నవభూమి:** రైల్వేలకు కేటాయింపులతో కూడిన కేంద్ర బడ్జెట్ ను 01 ఫిబ్రవరి 2025న పార్లమెంట్‌లో సమర్పించారు. ఈ సందర్భం గా కేంద్ర రైల్వే, సమాచార ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్ , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్, న్యూఢిల్లీ నుండి తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన కేటాయింపుల ముఖ్యాంశాలపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ 2025-2026 సంవత్సరానికిగాను తెలంగాణ రాష్ట్రానికి రికార్డు స్థాయిలో రూ.5,337 కోట్ల బడ్జెట్ కేటాయింపులు మంజూరు అయ్యాయని తెలియజేశారు. 2009-14 సంవత్సరాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వార్షిక సగటు బడ్జెట్ వ్యయం రూ. 886 కోట్లు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు బడ్జెట్ కేటాయింపులు 2009-14 మధ్య కాలంలో ఉమ్మడి రాష్ట్రానికి జరిగిన సగటు కేటాయింపులతో పోలిస్తే దాదాపు ఆరు రెట్లు పెరిగిందని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ రైలు అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రూ. 41,677 పెట్టుబడి పెడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ ఇప్పుడు 100% విద్యుదీకరణ చెందిందని మంత్రి తెలియజేశారు. కవచ్ ఏర్పాటులో తెలంగాణ ముందంజలో ఉందని, కవచ్ అభివృద్ధి కేంద్రం సికింద్రాబాద్‌లో ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వివిధ విభాగాలలో 1,465 కిలోమీటర్ల మేర కవచ్ వ్యవస్థ ఏర్పాటుచేయబడింది. కవచ్ తాజా

# 12న వైసీపీ ఫీజు పోరు


- కీలక నిర్ణయం తీసుకున్న జగన్
- 5న జరగాల్సిన పోరు 12కు వాయిదా
- స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వల్లే మార్పు
- రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శ్రేణులు ఫీజుపోరులో పాల్గొనాలని వైఎస్ జగన్ పిలుపు



**అమరావతి-నవభూమి:**ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.దీంతో ప్రభుత్వ నిర్ణయాన్నివ్యతిరేకిస్తూ విద్యార్థులకు,వారి తల్లిదండ్రులకు మద్దతుగా ఈ నెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ఫీజుపోరు నిర్వహించాలని నిర్ణయించింది. అయితే తాజాగా ఫీజు పోరు నిరసన కార్యక్రమం వాయిదా వేస్తున్నట్టు వైసీపీ ప్రకటించింది. తొలుత ఫిబ్రవరి 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఫీజు పోరు కార్యక్రమం చేపట్టాలని జగన్ నిర్ణయించారు.ఆ మేరకు వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 175 నియోజకవర్గాల్లో ఈ నిరసన కార్యక్రమాన్ని ఉధృతంగా చేపట్టాలని పార్టీ భావించింది. దీనికి అన్ని ఏర్పాట్లను కూడా పూర్తి చేసింది. ఫీజు పోరు నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కూడా పార్టీ నాయకులు విడుదల చేశారు. అయితే పలు జిల్లాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో వైసీపీ తన నిర్ణయాన్ని మార్చుకుంది. ఫిబ్రవరి 5న జరగాల్సిన కార్యక్రమాన్ని మార్చి 12కి వాయిదా వేసింది. ఈ మేరకు పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల కోడ్ అమలు లో ఉన్నందున తమ ఫీజు పోరు కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని ఆదివారమే ఎన్నికల సంఘాన్ని వైసీపీ కోరింది. అయితే ఈసీ నుంచి స్పందన లేకపోవడంతో నిరసనను వాయిదా వేయాలని నిర్ణయించారు.

# పులివెందులకు ఉప ఎన్నిక..?

- పులివెందులకు ఉప ఎన్నికలు జరగనున్నట్లు ఆర్‌ఆర్‌ఆర్ జోస్యం
- ముందస్తు సెలవు కోరకుండా 60రోజుల పాటు
- అసెంబ్లీకి రాకపోతే జగన్ సభ్యత్వం రద్దు
- అసెంబ్లీకి జగన్ రావాలని ఆర్‌ఆర్‌ఆర్ పిలుపు



2

**అమరావతి-నవభూమి:**ఏపీ డిప్యూటీ స్పీకర్,ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.త్వరలోనే పులివెందుల నియోజకవర్గానికి ఉప ఎన్నిక రానుందని జోస్యం చెప్పారాయన. పులివెందుల ఎమ్మెల్యేగా జగన్ ఉన్నారని, ఆయన అసెంబ్లీ సమావేశాలకు రావడంలేదని రఘురామకృష్ణంరాజు గుర్తు చేశారు. ఓ ఎమ్మెల్యే ముందస్తు సెలవు కోరకుండా 60 రోజుల పాటు అసెంబ్లీకి రాకుండా ఉంటే... ఆ ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడుతుందని రఘురామ చెప్పుకొచ్చారు. ఈసారి జరిగే అసెంబ్లీ సమావేశాలకు జగన్ రాకపోతే పులివెందుల నియోజకవర్గానికి ఉప ఎన్నిక రావడం తథ్యమని ఆయన అన్నారు. జగన్ అలా 60 రోజులు అసెంబ్లీకి రాకపోతే అనర్హత వర్తిస్తుందని.. పులివెందులకు ఉపఎన్నిక వస్తుందంటూ రఘురామ కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ అసెంబ్లీకి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.జగన్ అసెంబ్లీకి రావాలని రఘురామకృష్ణంరాజు సూచించారు. జగన్ అసెంబ్లీకి వచ్చి తన అభిప్రాయాలను వెల్లడించాలని రఘురామ కోరారు. అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలను లేవనెత్తటం ఎమ్మెల్యేగా జగన్ బాధ్యతని ఆయన చెప్పారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా స్పీకర్, మంత్రులు,


# తెలంగాణలో కులగణన చేసి సక్సెస్ అయ్యాం

- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం
- లోక్ సభలో చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రసంగం
- దేశంలో కులగణన ఎందుకు చేయడంలేదన్న రాహుల్
- తెలంగాణలో 90 శాతం మంది వెనుకబడినవాళ్లేనని వెల్లడి

2



**న్యూఢిల్లీ-నవభూమి:**రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్ సభలో చర్చ సందర్భంగా విపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగించారు. దేశంలో కులగణన ఎందుకు చేయడంలేదని ఎన్డీయే ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణలో కులగణన చేసి సక్సెస్ అయ్యామని అన్నారు. తెలంగాణలో 90 శాతం మంది వెనుకబడినవాళ్లేనని తెలిపారు.
ఇక, రాష్ట్రపతి ప్రసంగంలోని అంశాలు ప్రతి సంవత్సరం ఒకేలా ఉంటున్నాయని విమర్శించారు. మేకిన్ ఇండియా పథకం ఉద్దేశం మంచిదేనని, కానీ ఇప్పటిదాకా ఆ పథకంతో ఒరిగిందేమీలేదని



# కేసీఆర్‌కు లీగల్ నోటీసులు

2

# బిచ్చమెత్తితే..నేరం

- భోపాల్ నగరంలో భిక్షాటన,బిచ్చమేసినా నేరం.. త్వరలోనే ఉత్తర్వులు!
- ఇండియన్ సివిల్ డిఫెన్స్ కోడ్ 2023లోని సెక్షన్ 163 కింద ఉత్తర్వులు
- భిక్షాటన చేసేవారి కోసం ఒక షెల్టర్,,జిల్లా కలెక్టర్ కౌశలేంద్ర
- 250 యాచకుల గుర్తింపు..భిక్షగ్రాహ్ తరలించి సంరక్షణ

2



**భోపాల్-నవభూమిబ్యూరో:** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో భిక్షాటన చేయడం, దానధర్మాలు చేయడం త్వరలో నేరంగా పరిగణించబడుతుంది. కలెక్టర్ కౌశలేంద్ర విక్రమ్ ఒకటి లేదా రెండు రోజుల్లో దానికి సంబంధించి ఉత్తర్వులను జారీ చేయబోతున్నారు. ఇండియన్ సివిల్ డిఫెన్స్ కోడ్ 2023లోని సెక్షన్ 163 కింద ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు భోపాల్ కలెక్టర్ కౌశలేంద్ర విక్రమ్ సింగ్ తెలిపారు. నగరంలో భిక్షాటన చేసేవారి కోసం ఒక షెల్టర్‌ను రూపొందిస్తామని కలెక్టర్ వెల్లడించారు. స్థలం కోసం మున్సిపల్ కార్పొరేషన్‌ను కోరామని.. దానిని భిక్షగ్రాహ్ గా మారుస్తామన్నారు. స్థలాన్ని గుర్తించిన వెంటనే ఆర్డర్ జారీ చేయబడుతుందన్నారు. సంబంధిత స్థలం గురించి ఆర్డర్ లో తెలియజేస్తామన్నారు. అనంతరం ఉత్తర్వులు అమలులోకి వచ్చిన వెంటనే భోపాల్‌లో భిక్షాటన చేయడంతో పాటు దానధర్మాలు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. భోపాల్‌లో 250 మంది యాచకులు ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో 250 మంది యాచకులు ఉన్నారని.. వారు మధ్యప్రదేశ్ తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చారని చెప్పారు. ఉత్తర్వులు జారీ అయిన వెంటనే కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ద్వారా యాచకులను, వారికి భిక్ష పెట్టేవారిని గుర్తిస్తామని కలెక్టర్ తెలిపారు. అంతే కాకుండా అధికారుల బృందాలు కూడా క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేస్తాయని తెలిపారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in


## బాలానగర్‌లో అగ్ని ప్రమాదం..



**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రంలో వరుస అగ్ని ప్రమాదాలు నగరవాసులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎప్పుడు ఎటువైపు నుంచి అగ్నిప్రమాదం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. తాజాగా బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానిక గాంధీనగర్‌లో సూర్య తేజ ఇండస్ట్రీస్, లిఫ్ట్ గ్రిల్స్ తయారీ కంపెనీలో మంటలు చెలరేగాయి. కంపెనీ సిబ్బంది గ్రిల్స్‌కు పెయింట్ వేసిన తర్వాత కంపెనీ షెట్టర్లు మూసివేసి వెళ్ళి పోయారు. షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగినట్లు తెలియవచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన ప్రదేశానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే ఏ మేరకు ఆస్తి నష్టం జరిగింది తెలియరాలేదు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.కాగా పాతబస్తి, కిషన్ బాగ్ ఎక్స్ రోడ్ సమీపంలోని ఆదివారం తెల్లవారుజామున ఓ భవనంలోని సెల్లార్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, కిషన్ బాగ్ కార్పరేటర్ సంఘటన ప్రదేశానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆ భవనంలో ఉన్న వారిని పోలీసులు క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్ని ప్రమాదం వల్ల భవనం పై అంతస్తులోనూ దట్టమైన పొగ అలుముకుంది. బహదూర్ పురా ఎంఐఎం ఎమ్మెల్యే దగ్గరుండి సహాయక చర్యలు సమీక్షిస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.



## ఫేర్‌వెల్ పార్టీ నుంచి ఆరుగురు టెన్త్ స్టూడెంట్స్ అదృశ్యం.. కట్ చేస్తే ఏపీలో ప్రత్యక్షం.. అసలేమైందంటే..?



**సూర్యాపేట-నవభూమి:**స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు గ్రాండ్‌గా ఫేర్ వెల్ పార్టీ నిర్వహించారు. అందరూ హ్యాపీగా ఎంజాయ్ చేశారు. అయితే.. ఫేర్ వెల్ పార్టీ తర్వాత ఆరుగురు పదో తరగతి విద్యార్థులు కనిపించకుండా పోయింది. స్టూడెంట్స్ మిస్సింగ్ విషయం బయటికి తెలియటంతో.. సర్వత్రా కలకలం చెలరేగింది. కట్ చేస్తే.. ఆరుగురు విద్యార్థులు ఏపీలోని విజయవాడలో ప్రత్యక్షమయ్యారు. పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లి.. ఆరుగురు స్టూడెంట్స్‌ని పాఠశాలకు క్షేమంగా తీసుకొచ్చారు. అసలు ఆ ఆరుగురు విద్యార్థులు అదృశ్యం కావటానికి అసలు కారణమేంటంటే..!సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట సమీపంలోని నెమలిపురి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో.. పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా ఫేర్ వెల్ పార్టీ నిర్వహించారు. ఈ పార్టీలో విద్యార్థులంతా హ్యాపీగా ఎంజాయ్ చేస్తుంటే.. మరోవైపు ఆరుగురు విద్యార్థులు మాత్రం.. పార్టీకి మద్యం సేవించి వచ్చారు. అక్కడితో ఆగకుండా.. పార్టీలో కాస్త ఓవరాక్షన్ చేశారు. తోటి విద్యార్థులతో గొడవ పెట్టుకున్నారు. ఈ గొడవ విషయం ఉపాధ్యాయులకు తెలియటంతో.. ఆ ఆరుగురు విద్యార్థులను మందలించారు.పార్టీలో అందరిముందు మందలించటంతో.. తీవ్ర మనస్థాపానికి గురైన ఆరుగురు విద్యార్థులు పాఠశాల నుంచి అదృశ్యమయ్యారు. ఈ ఘటనపై భయాందోళనకు గురైన గురుకుల సిబ్బంది వెంటనే స్థానిక పోలీసులకు, తల్లిదండ్రలకు విషయం తెలియజేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. దీంతో.. ఆ ఆరుగురు విద్యార్థులు విజయవాడకు వెళ్లినట్లు గుర్తించారు.విద్యార్థుల ఆచూకీ గుర్తించిన పోలీసులు వెంటనే విజయవాడకు వెళ్లి.. ఆ ఆరుగురిని క్షేమంగా పాఠశాలకు తిరిగి తీసుకొచ్చారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. వారి మానసిక పరిస్థితిని మెరుగురపగప పర్చే చర్యలు చేపట్టారు. విద్యార్థులను తిరిగి ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల సంరక్షణలో అప్పగించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.మరోవైపు.. పిల్లలు రక్షణ కోసం పాఠశాల యాజమాన్యం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## హైదరాబాద్ వాహనదారులకు బిగ్ రిలీఫ్.. ట్రాఫిక్ కష్టాలకు చెక్



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతోంది. అనేక జాతీయ, అంతర్జాయ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెడుతున్నాయి. వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన వారు ఉపాధి నిమిత్తం హైదరాబాద్ నగరానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని సమస్యలు నగర ప్రజలను వేధిస్తున్నాయి. అందులో ట్రాఫిక్ సమస్య ప్రధానమైనది. ఆఫీసులు, స్కూళ్లకు వెళ్లే ఉదయం సమయాల్లో.. తిరిగి ఇంటికి వెళ్లే సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ నరకంగా ఉంటుంది. కొన్ని ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద అయితే గంటల కొద్దీ వాహనాలు బారులు తీరుతుంటాయి. ముందుకు, వెనక్కి వెళ్లలేక ట్రాఫిక్‌లో వాహనదారులు ఇబ్బందులు పడుతుంటారు.

ఈ నేపథ్యంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు నగర పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేలా సైబరాబాద్ పోలీసులు ప్రత్యేకంగా 'ట్రాఫిక్ పల్స్' పేరుతో కొత్త విధానాన్ని వాహనదారులకు అందుబాటులోకి తెచ్చారు. క్యూఆర్ కోడ్ (సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ట్విట్టర్ అకౌంట్‌లో అందుబాటులో ఉంది) ద్వారా ఈ ప్రత్యేక ట్రాఫిక్ పల్స్‌లో ఒకసారి నమోదు చేసుకుంటే చాలు ట్రాఫిక్ కష్టాలు తీరినట్లే. వాహనదారులు నిత్యం ప్రయాణించే మార్గాలను అందులో ఎన్నుకోవాల్సి ఉంటుంది.

ఆయా మార్గాల్లో ఒకవేళ ట్రాఫిక్ సమస్య తలెత్తే పరిస్థితి ఉంటే ముందే గుర్తించి సమాచారాన్ని వాహనదారులకు చేరవేరుస్తారు. ట్రాఫిక్ రద్దీని మెసేజ్ రూపంలో సెల్‌ఫోన్‌కు అందిస్తారు. దీంతో వాహనదారులు ఆ మార్గాల్లో ప్రయాణాలు చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకొని సాఫీగా ప్రయాణాలు సాగించొచ్చు. ఈ విధానం ద్వారా సైబరాబాద్ పరిధిలోని ముఖ్యమైన 41కి రహదారుల రియల్ టైం ట్రాఫిక్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేస్తుంది. దీంతో వాహనదారులు ట్రాఫిక్ చిక్కులు లేకుండా సాఫీగా తమ ప్రయాణాలు సాగించొచ్చు.కాగా, నగరంలో ట్రాఫిక్ రద్దీకి చెక్ పెట్టేందుకు కొత్తగా ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు, రహదారులు కూడా నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వం కొన్ని ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు నిర్మించగా.. రేవంత్ సర్కార్ కూడా రహదారుల విస్తరణ, కొత్త ఫ్లైఓవర్ల నిర్మాణంపై ఫోకస్ పెట్టింది.

## విద్యా వ్యవస్థపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**సిద్దిపేట జిల్లా-నవభూమి:** తెలంగాణలో విద్యా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయంయ తీసుకుంది. ప్రభుత్వ పక్షాన విద్యవ్యవస్థను మెరుగుపరచడానికి ప్రతి ఒక్కరికీ విద్యా అందటానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదర్శ ఇందిరమ్మ పాఠశాలలు, నూతన నియామకాలు మౌలిక సదుపాయాలు అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. వసంత పంచమినీ పురస్కరించుకొని ఇవాళ(సోమవారం) వర్గల్ మండల కేంద్రంలోనీ శ్రీ విద్య సరస్వతి అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మృత్యువు ఎప్పుడు ఏ రూపంలో వస్తుందో చెప్పలేం



**హైదరాబాద్-నవభూమి:**కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలంటూ ఓ సామెత. ప్రస్తుతం చోటుచేసుకుంటున్న విషాదాలకు కూడా ఎన్నో కారణాలుంటున్నాయి. కొన్నిసార్లు ఈ మాత్రందానికే ప్రాణాలు పోతాయా అన్న అనుమానాలు కలిగే ఆశ్చర్యకరమైన ఘటనలు చోటుచేసుకుంటుండటం బాధాకరం. అచ్చంగా అలాంటి విషాదకర ఘటనే జరిగి.. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గన్ మెన్ శ్రీనివాస్ ప్రాణాలు పోయాయి. ఈ ఘటన చూసి.. మృత్యువు ఎలా వస్తుందో చెప్పలేమని అంతా అభిప్రాయపడుతున్నారు.

మృత్యువు ఎప్పుడు.. ఏ రూపంలో వస్తుందో ఎవ్వరూ చెప్పలేరు. కొన్నిసార్లు జరిగే విషాదాలను చూస్తుంటే.. ఇలా కూడా మృత్యువు సంభవిస్తుందా..? అన్న భయం కలుగుతుంది. ఒక్కోసారి మనవైపు నుంచి ఎలాంటి తప్పిదం లేకున్నా కూడా.. ఎదుటి వ్యక్తి చేసే చిన్న తప్పు కూడా విలువైన ప్రాణాలను తీస్తుంది. మరికొన్నిసార్లు అతివేగంగా దూసుకొచ్చే పెద్ద పెద్ద వాహనాలు మృత్యుశకటాలవుతుంటాయి. ఇవన్నీ కాకుండా.. రోడ్డు మీద వెళ్తుంటే.. ఒక్కసారిగా కుక్క, పంది, కోతి లాంటి జీవాలు కూడా వాహనానికి అడ్డు వచ్చి ఆగం చేస్తుంటాయి. అచ్చంగా అలాంటి ఘటనే చేటుచేసుకుంది. అలాంటి సంఘటనే సంగారెడ్డి జిల్లాలో జరిగింది.

తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే కాలే యాదయ్య గన్‌మెన్ అయిన శ్రీనివాస్.. ఆదివారం (ఫిబ్రవరి 02న) రాత్రి తన వ్యక్తిగత పనుల నిమిత్తం కొండకల్ నుంచి వెలిమెలకు ఒంటరిగా బైక్ మీద వెళ్తున్నాడు. బీడీఎల్ భానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెలిమల తండా సమీపంలోకి రాగానే.. ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా ఓ అడవి పంది దూసుకొచ్చింది. ఉన్నట్టుండి అకస్మాత్తుగా అడవి పంది దూసుకురావటంతో.. దాన్ని తప్పించే క్రమంలో శ్రీనివాస్ బైక్ అదుపుతప్పింది. దీంతో.. కింద పడిపోగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్ ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

స్థానికులు సమాచారం అందించడంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పటాన్ చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బైక్‌పై తన దారిలో తాను వెళ్తుంటే అడవి పంది దూసుకొచ్చి శ్రీనివాస్ ప్రాణం పోవటానికి కారణమవటాన్ని చూస్తుంటే.. మృత్యువు ఎప్పుడు ఏ రూపంలో దూసుకొస్తుందో చెప్పలేమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వద్ద.. శంకర్ పల్లి మండలం బుల్కాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ గన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. యాదయ్య ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శ్రీనివాస్ అతనికి ఎంతో నమ్మకస్థుడిగా ఉంటూ వస్తున్నాడు. తాజా ప్రమాద ఘటనలో శ్రీనివాస్ మృతి చెందడం బాధాకరమని పార్టీ వర్గాలు సంతాపం ప్రకటిస్తున్నాయి. శ్రీనివాస్ మరణవార్తతో ఆయన స్వగ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.

## 100 మంది యవతులతో డేటింగ్.. రూ.333 కోట్లు టార్గెట్..
## 'గచ్చిబౌలి' ప్రభాకర్ కేసులో విస్తుపోయే నిజాలు



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ గచ్చిబౌలి ప్రిజం పబ్ కాల్పుల కేసు నిందితుడు బత్తుల ప్రభాకర్ గురించి విస్తుపోయే విషయాలు బయటకు వస్తున్నాయి. 17 ఏళ్ల వయస్సులో రూ.3 వేలతో దొంగతనాలు మ్నొదలు పెట్టిన ప్రభాకర్.. ఆ తర్వాత కొన్ని నెలల్లోనే లక్షలకు లక్షలు చోరీ చేశాడు. చోరీ డబ్బుతో లగ్జరీ లైఫ్ గడుపుతున్న ప్రభాకర్ 100 మంది అమ్మాయిలతో డేటింగ్, రూ.333 కోట్లు కొల్లగొట్టడం టార్గెట్‌గా పెట్టుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.హైదరాబాద్ గచ్చిబౌలి ప్రిజం పబ్‌లో రెండ్రోజుల క్రితం కాల్పులు జరిగిన సంగతి తెలిసిందే. మోస్ట్ వాంటెడ్ గజదొంగ బత్తుల ప్రభాకర్ అలియాస్ బిట్టూ పోలీసులపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఓ కానిస్టేబులు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి వద్ద నుంచి మూడు తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బిహార్ నుంచి తుపాకులను కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రభాకర్‌పై గతంలో ఎక్కడెక్కడ కేసులు ఉన్నాయన్న అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, విచారణలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. చోరీల ద్వారా.. రూ.333 కోట్లు సంపాదించి ఆ తర్వాత నేరాలు మానేయాలని ప్రభాకర్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. 100 మంది యువతులతోనూ డేటింగ్ చేయాలని అతడు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

బత్తుల ప్రభాకర్ స్వగ్రామం ఏపీలోని చిత్తూరు జిల్లా ఇరికిపెంట. 8వ తరగతితోనే చదువు మానేసిన ప్రభాకర్ 17 ఏళ్ల వయసులో దొంగతనాలు చేయటం ప్రారంభించాడు. రాహుల్ రెడ్డి, సర్వేశ్వర్ రెడ్డి, రాజు, హర్షవర్ధన్ రెడ్డి వంటి మారు పేర్లతో చోరీలు చేయటం ప్రారంభించాడు. మొదట రూ.3 వేలు దొగిలించిన ప్రభాకర్ తన లక్కీ నెంబర్‌గా 3ను ఎంచుకున్నాడు. ఆ తర్వాత ఒకే రోజు రూ.3 లక్షలు, కొన్ని నెలల వ్యవధిలోనే రూ. 33 లక్షలు చోరీ చేశాడు. చివరగా రూ.333 కోట్లు కొల్లగొట్టి చోరీలు మానేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నాడు. డబ్బుతో పాటు 100 మంది యువతులతో డేటింగ్ చేయాలని కూడా లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ మేరకు ఛాతీపై 3, 100 నెంబర్లను పచ్చబొట్లుగా పొడిపించుకున్నాడు.

**ప్రతీకారం కోసమే తుపాకులు**

అయితే డబ్బుతో పాటు ఓ వ్యక్తిపై ప్రతీకారం తీర్చుకునేందుకు బిహార్ నుంచి ప్రభాకర్ తుపాకులు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. 2022లో విశాఖపట్నం జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో ఓ ఖైదీతో ప్రభాకర్‌కు గొడవ జరిగింది. జైలు నుంచి బయటకు వచ్చాక అతడిని చంపాలని టార్గెట్‌గా పెట్టుకున్నాడు. బిహార్ నుంచి దేశీయ తుపాకులను కొనుగోలు చేశాడు. ప్రతీకారం తీర్చుకునేందుకు కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో మకాం వేశాడు. నార్సింగ్‌లోని ఓ గెటెడ్ కమ్యూనిటీలో ప్రభాకర్ నివాసం ఉంటున్నాయి. ఒకే సమయంలో ఇద్దరికి మంచి అమ్మాయిలతో సహజీవనం చేస్తున్నాడు. స్నేహితుల పేర్లతో సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్లు కొనుగోలు చేయడమే కాకుండా నెలకో కారు మారుస్తూ విలాసవంతమైన జీవితం గడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

**స్నేహితుల అకౌంట్లలో డబ్బులు జమ..**

ఆదివారం అతడు అద్దెకు ఉంటున్న ఇంట్లో సోదాలు జరిపిన పోలీసులు రూ.50 వేల విలువైన మద్యం, జిమ్ సెటప్ ఖరీదైన గాడ్జెట్‌లు గుర్తించారు. 3 దేశీయంగా తయారు చేసిన తుపాకులు, 451 రౌండ్ల బుల్లెట్లు, ఇనుప కడ్డీలు, ఎలక్ట్రికల్ కట్టర్లు, దోపిడీ సాధనాలు, రూ.2.6 లక్షలు నగదు సీజ్ చేశారు. ప్రభాకర్ దొంగతనం చేయటానికి ముందు చాలా పక్కాగా ప్లాన్ చేసుకుంటాడు. యూట్యూబ్ వీడియోల ఆధారంగా పోలీసులకు చిక్కకుండా దోపిడీలు చేసేవాడు. ఆధారాలు దొరక్కుండా ముఖానికి ముసుగు, చేతులకు గ్లౌజులు ధరించేవాడు. దొంగలించిన సొమ్మును స్నేహితుల అకౌంట్లలో జమ చేసి అవసరంకొద్దీ వాడుకునేవాడు. ప్రభాకర్‌పై ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో 80కి పైగా కేసులున్నాయి. తాజాగా కాల్పుల కేసులో పోలీసులు రిమాండ్‌కు తరలించారు. న్యాయస్థానం అతడికి 14 రోజుల పాటు రిమాండ్ విధించింది.

## కేసీఆర్‌కు లీగల్ నోటీసులు పంపిన ఫార్మర్స్ అసోసియేషన్!

**ప్రతిపక్ష నేతగా ఉండి అసెంబ్లీకి హాజరు కావడం లేదంటూ లీగల్ నోటీసులు**

**అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో వివరణ కోరాలని స్పీకర్‌కు విజ్ఞప్తి నోటీసులు పంపిన 'ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ ఇన్ తెలంగాణ'**

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఊహించని పరిణామం ఎదురైంది. ప్రతిపక్ష నేతగా ఉండి అసెంబ్లీకి హాజరుకావడం లేదంటూ, కాబట్టి ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని 'ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ ఇన్ తెలంగాణ' నేడు నోటీసులు పంపింది. శాసనసభలో ప్రతిపక్ష నేతగా తన బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యారని, అందువల్ల ఆయన శాసనసభ్యుడిగా కొనసాగే అర్హతను కూడా కోల్పోయారని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

కేసీఆర్‌పై అనర్హత వేటు వేయాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్ పాల్ డిమాండ్ చేశారు. కేసీఆర్ అసెంబ్లీలో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని, లేదంటే ప్రతిపక్ష నేతగా ఆయనను తొలగించాలని ఆయన అన్నారు. కేసీఆర్‌కు సమన్లు జారీ చేసి అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో వివరణ కోరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అసోసియేషన్ తరఫు న్యాయవాది పాదూరి శ్రీనివాస్ రెడ్డి... మెయిల్, స్పీడ్ పోస్ట్ ద్వారా కేసీఆర్‌కు లీగల్ నోటీసులు పంపించారు.

## ఫిబ్రవరి 13న డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ!

**న్యూఢిల్లీ-నవభూమి:**కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, ఎన్నారైలతో సమావేశం కానున్న మోదీప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 13న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్నట్లు ఇంగ్లీష్ మీడియాలో వార్తలు వచ్చాయి. వాషింగ్టన్ డీసీలో ఈ భేటీ ఉండనుందని సమాచారం. అమెరికా పర్యటన సందర్భంగా మోదీకి ట్రంప్ విందు కూడా ఇచ్చే అవకాశముంది.ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటన ముగించుకొని ఈ నెల 12వ తేదీ సాయంత్రం వాషింగ్టన్ డీసీ చేరుకుంటారు. ఫిబ్రవరి 14వ తేదీ వరకు ఆయన అమెరికా రాజధానిలోనే ఉంటారు. ఈ రెండు రోజుల పాటు అమెరికన్ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో, ఎన్నారైలతో ఆయన సమావేశమయ్యే అవకాశాలు ఉన్నాయి.తమ దేశంపై సుంకాల విధింపును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాయిదా వేశారని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ తెలిపారు.

## దేశంలో మాంసాహారం తినే రాష్ట్రాల్లో ఏపీ, తెలంగాణా ఏ స్థానంలో ఉన్నాయంటే..



**హైదరాబాద్-నవభూమి:** భారతదేశంలో అనేక రకాల జాతులు, మతాలు, కులాలవారు నివసిస్తున్నారు. ఇక దేశవ్యాప్తంగా ప్రాంతాలను బట్టి ఆహారపు అలవాట్లు ఉన్నాయి. కొన్నిచోట్ల ప్రజలు శాఖాహారాన్ని తింటే మరికొన్ని చోట్ల మాంసాహారాన్ని తింటారు. మన తెలుగు రాష్ట్రాలలో కూడా మాంసాహారాన్ని ఇష్టంగానే తింటారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో అయితే మాంసాహారాన్ని చాలా ప్రత్యేక సందర్భాలలో తింటూ ఉంటారు. మాంసాహారులపై జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నాన్ వెజ్ లేకుండా భోజనం చేయడం భోజనం చేసినట్టే ఉండదు అన్న భావనను వ్యక్తం చేస్తూ ఉంటారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే మన దేశంలో మాంసాహారులు ఎంతమంది శాకాహారులు ఎంతమంది అన్న వివరాలను వెల్లడించింది. 2015 -16 సంవత్సరంలోని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే సుమారు 78 శాతం మహిళలు 70 శాతం మంది పురుషులు వారానికి ఒకసారి చేపలు, పౌల్ట్రీ లేదా మాంసాన్ని తీసుకుంటారని నిర్ధారించింది. మాంసాహారం తినే రాష్ట్రాలలో టాప్లో ఈ రాష్ట్రం దీనికి తోడు మాంసాహారం ఎక్కువగా వినియోగించే రాష్ట్రాలను సర్వే పేర్కొంది. ఈ సర్వే జాబితాలో మాంసాహారం ఎక్కువ తినే రాష్ట్రాలలో నాగాలాండ్ అగ్రస్థానంలో ఉంది. నాగాలాండ్ లో నివసించేవారు దాదాపు 99.8% మంది మాంసాహారులు. ఇక తర్వాత రెండవ స్థానంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఉంది. పశ్చిమ బెంగాల్లో 99.3% మంది నాన్ వెజ్ ఎక్కువగా తినే వారు ఉన్నారు. ఆ తర్వాత మూడవ స్థానంలో కేరళ రాష్ట్రం ఉంది. మాంసాహారం తినే రాష్ట్రాల్లో ఏపీ, తెలంగాణా ఎన్నో స్థానంలో ఉన్నాయంటే కేరళ రాష్ట్రంలో 99.1 శాతం మంది మాంసాహారాన్ని తింటారు. ఇక తెలుగు రాష్ట్రాలలో మాంసాహారాన్ని ఎక్కువగానే తింటారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మాంసాహారం తినే రాష్ట్రాలలో నాలుగవ స్థానంలో ఉంది .ఆంధ్రప్రదేశ్లో 98.25 శాతం మంది మాంసాహారులు ఆంధ్రప్రదేశ్ తో పోలిస్తే తెలంగాణ రాష్ట్రంలో మాంసాహారం తినే వారి సంఖ్య తక్కువగా ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 98.8 శాతం మంది పురుషులు 98.6% మంది మహిళలు మాంసాహారులు.

## వివాదాల్లో సోనియా

(1వపేజీ తరువాయి)గిరిజన వర్గాల పట్ల పార్టీకి ఉన్న తన వ్యతిరేక భావజాలాన్ని సోనియా గాంధీ బయటపెట్టారని మోదీ ధ్వజమెత్తారు. ఆదివాసీలు, గిరిజనులు, పేదరికం నుంచి అత్యుత్తమ స్థానాలను అందుకున్న వాళ్లపై తనకు ఉన్న దీర్ఘకాల పక్షపాత వైఖరిని సోనియా గాంధీ బయటపెట్టుకున్నారని మండిపడ్డారు. గిరిజనుల ప్రయోజనాలను విస్మరించడం, ఆదివాసీ వీరులను గుర్తించడంలో విఫలం కావడం, ఈ వర్గాల కోసం ఉద్దేశించిన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉంది. గిరిజన హక్కుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించిన ట్రాక్ రికార్డ్‌కు- తాజాగా ద్రౌపది ముర్ముపై సోనియా చేసిన వ్యాఖ్యలు అద్దం పట్టినట్టయిందనే విమర్శలు ఉన్నాయి. గత ఏడాది జులైలో కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి కూడా ద్రౌపది ముర్ముపై ఇలాంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే. ఆమెను రాష్ట్రపత్నిగా సంబోధించారు. రాష్ట్రపతి హోదాను అవమానించారు. ఆయన వ్యాఖ్యలు.. పార్టీ భూస్వామ్య, జాత్యహంకార దృక్పథాన్ని బహిర్గతం చేశాయంటూ అప్పట్లో విమర్శలు తలెత్తాయి. రాష్ట్రపతి ఇతర ఆధిపత్య కుటుంబం నుంచి వచ్చినట్లయితే కాంగ్రెస్ ఇలాంటి అగౌరవ వ్యాఖ్యలు చేసి ఉండేదా? అనే అభిప్రాయాలు వ్యక్తమౌతోన్నాయి. ఓ గిరిజన మహిళ.. దేశంలో అత్యున్నత స్థానమైన రాష్ట్రపతి పదవిని అధిష్ఠించడాన్ని కాంగ్రెస్ ఎప్పటికీ అంగీకరించదనే అభిప్రాయాలను కలిగించినట్టయింది.

## గ్రూప్-1 అభ్యర్థులకు గుడ్ న్యూస్

(1వపేజీ తరువాయి)హైదరాబాద్ నగరంలో లాఠీ ఛార్జ్ సైతం జరిగింది. పెద్దఎత్తున నిరసన తెలిపిన అభ్యర్థులు ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ వారికి ఎదురుదెబ్బ తగలడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. పరీక్షలు మొదలైన రోజే కేసు విచారణకు రావడంతో పరీక్షలు నిలిపివేసేందుకు కోర్టు అనుమతి ఇవ్వలేదు. దీంతో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అయితే నేడు విచారణ చేపట్టిన ధర్మాసనం అభ్యర్థుల పిటిషన్లు కొట్టివేసింది.

## కలెక్టర్ ఎదుటే తిట్ల పురాణం

(1వపేజీ తరువాయి)చేసుకుంది. దీంత అర్థాంతరంగా అక్కడి నుంచి మంచు మనోజ్ వెళ్లిపోయారు. దీంతో మరోసారి విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. దాంతో వచ్చే వారం మరోసారి హాజరు కావాలంటూ జిల్లా కలెక్టర్.. మోహన్ బాబు, మంచు మనోజ్‌ను ఆదేశించారు.ఈ విచారణలో వారు చేసిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ పలు ప్రశ్నలు సంధించారు. అయితే తమ వద్ద ఉన్న పలు ఆస్తి సంబంధించిన డాక్యుమెంట్లను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు మోహన్ బాబు, మంచు మనోజ్ వేర్వేరుగా అందజేశారు.

ఇంతకీ ఏం జరిగిందంటే..ఇటీవల మంచు మోహన్ బాబు ఫ్యామిలీలో వివాదాలు చెలరేగాయి. దీంతో మంచు మోహన్ బాబు, ఆయన చిన్న కుమారుడు మంచు మనోజ్ మధ్య దూరం పెరిగింది. ఆ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేశారని.. తనకు, తన భార్య మౌనికకు ప్రాణ హాని ఉందంటూ మంచు మనోజ్.. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఇది జరిగిన కొద్ది నిమిషాలకే అతడి తండ్రి మోహన్ బాబు.. రాచకొండ పోలీస్ కమిషనర్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. తన కుమారుడు మంచు మనోజ్, అతడి భార్య మౌనిక ద్వారా తనకు ప్రాణ హాని ఉందంటూ ఆ ఫిర్యాదులో స్పష్టం చేశారు. దీంతో ఇరు వర్గాల ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టారు.

## తెలంగాణకు శుభవార్త చెప్పిన మోదీ

(1వపేజీ తరువాయి)వెర్షన్ 4.0 ఏర్పాటుకు ట్రయల్స్ జరుగుతున్నాయని ఆయన అన్నారు. రాబోయే 6 సంవత్సరాలలో దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం రైలు నెట్‌వర్క్‌లో కవచ్‌ను ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు . తెలంగాణ రాష్ట్రంలో 7 జిల్లాల గుండా తొమ్మిది స్టాప్‌లతో 5 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఇంకా, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలోని 40 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 50 కొత్త నమో భారత్ రైళ్లు, 200 వందే భారత్ రైళ్లు, 100 కొత్త అమృత్ భారత్ రైళ్లకు ఆమోదం లభించిందని, ఈ రైళ్ల రాకపోకలను ఎప్పటికప్పుడు ప్రకటిస్తామని ఆయన ప్రకటించారు. రైల్వేలు7,000 కిలోమీటర్ల మేర పాత ట్రాక్‌లను పునరుద్ధరించాలనే లక్ష్యాన్ని చేపట్టాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమైన విభాగాలలో 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపడానికి భారతీయ రైల్వేలు రైల్వే ట్రాక్‌లను అప్‌గ్రేడ్ చేయాలని యోచిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా, కొన్ని మార్గాలు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని మరియు మొత్తం నెట్‌వర్క్ 100 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని పేర్కొన్నారు.

## పులివెందులకు ఉప ఎన్నిక..?

(1వపేజీ తరువాయి)ముఖ్యమంత్రులు ఇచ్చేదా కాదని, ప్రజలు ఇవ్వాలని, వారు ఇవ్వనప్పుడు జగన్ ప్రతిపక్ష హోదా ఎలా అడుగుతారని రఘురామకృష్ణంరాజు ప్రశ్నించారు.

## తెలంగాణలో కులగణన చేసి సక్సెస్ అయ్యాం

(1వపేజీ తరువాయి)వ్యాఖ్యానించారు. మేకిన్ ఇండియా ఆచరణలో ప్రధాని నరేంద్ర మోదీ విఫలమయ్యారని రాహుల్ గాంధీ అన్నారు.

చాలా సంస్థలు ఉత్పాదనలు పెంచడానికి ప్రయత్నించాయని, కానీ తయారీ అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేకపోయిన విషయం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ప్రస్తుతం మొత్తం ఉత్పత్తులను చైనాకు అప్పగించామని అన్నారు. ఉత్పత్తుల పెంపుపై భారత్ దృష్టి సారించాలని సూచించారు. సాఫ్ట్ వేర్ విప్లవం గేమ్ చేంజర్ లా నిలుస్తుందని రాహుల్ అభిప్రాయపడ్డారు.60 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా జీడీపీ పడిపోయిందని... 2014లో 15.3 శాతం ఉన్న జీడీపీ 12.6 శాతానికి పడిపోయిందని వివరించారు. ఏఐలో భారత్ కంటే చైనా పదేళ్లు ముందుందని తెలిపారు. మహారాష్ట్ర ఎన్నికల ముందు అకస్మాత్తుగా 70 లక్షల ఓట్లు పెరిగాయని, ఓటర్ల సంఖ్య ఉన్నట్టుండి ఎందుకు పెరుగుతోందో ఈసీ చెప్పాలని అన్నారు.

## బిచ్చమెత్తితే..నేరం

(1వపేజీ తరువాయి)కూడళ్లలోని భిచ్చగాళ్లను ఓ షెల్టర్ కు చేర్చి.. అక్కడ వారికి బస ఏర్పాటు చేయడంతో పాటు ఆహారం, పానీయాలు అందిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికే మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో భిక్షాటనను అక్కడి అధికారులు బ్యాన్ చేశారు.



# దేశానికి క్యాన్సర్ సవాల్



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశానికి 2025లో క్యాన్సర్ ముఖ్యమైన ప్రజారోగ్య సవాల్‌గా మారనుందని.. దేశవ్యాప్తంగా 15 లక్షల కొత్త కేసులు నమోదయ్యే ప్రమాదం ఉందని ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ మహమ్మారిని నోటిఫయబుల్ డిసీజ్‌గా గుర్తించి.. దాని కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. మంగళవారం (ఫిబ్రవరి 4) 'ప్రపంచ క్యాన్సర్ దినం' సందర్భంగా.. దాని నియంత్రణ, నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయన పలుసూచనలు చేశారు. దేశంలో నమోదవుతున్న క్యాన్సర్ మరణాల్లో మూడింట రెండువంతులు.. పొగాకు, మద్యం, ఇన్ఫెక్షన్ల కారణంగా సంభవించేవేనని, ఈ క్యాన్సర్లన్నీ నిరోధించదగ్గవి, తొలి దశలో గుర్తించి, సత్వర చికిత్సతో నయంచేయదగ్గవేనని ఆయన స్పష్టం చేశారు. "క్యాన్సర్‌పై పోరులో అందరూ కలిసిరావాలి" అంటూ విధాన నిర్ణేతలు, వైద్య నిపుణులు, ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. క్యాన్సర్ రోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో.. బాధితులకు సత్వర వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేలా కేంద్ర బడ్జెట్‌లో మోదీ సర్కారు కీలక నిర్ణయాలను ప్రకటించడంపై ప్రశంసలజల్లు కురిపించారు. క్యాన్సర్ బాధితుల ప్రాణాలు కాపాడే ఔషధాల ధరలను ప్రజలకు మరింత అందుబాటులోకి తేవడం, 36 ప్రాణాధార ఔషధాలకు కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు, మూడు ప్రాణాధార ఔషధాలపై జీఎస్టీ తగ్గింపు. మూడేళ్లలో జిల్లాకో క్యాన్సర్ డే కేర్ కేంద్రం ఏర్పాటు వంటి నిర్ణయాలను..

## ఏఐలో ఏపీ కన్నా ముందుగా మహారాష్ట్ర!



**ముంబై-నవభూమి:** ప్రపంచం మొత్తం ఏఐ చుట్టూ పరుగులు తీస్తోంది. 2027 నాటికి మనదేశంలో ఏఐ మార్కెట్ 17 బిలియన్ డాలర్లకు చేరే అవకాశముంది. దీంతో ఈ రంగంలో సత్తా చాటాలని దేశంలో చాలా రాష్ట్రాలు ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా ఏపీ, తెలంగాణ పోటాపోటీగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై ఫోకస్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఏఐని ప్రోత్సహిస్తోంది. త్వరలోనే సొంతంగా ఏఐ మోడల్ ని తయారు చేసుకుంటామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ మధ్యే ప్రకటించారు. ఇక ఏపీ రాజధాని అమరావతిని ఏఐ సిటీ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. అదేవిధంగా విశాఖలో ఏఐ యూనివర్శిటీ స్థాపనకు ప్రయత్నాలు జరగుతున్నాయి. అయితే ఈ విషయంలో ఏపీకన్నా ముందుగా మహారాష్ట్ర పరుగులు తీస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ ఏఐ యూనివర్సిటీలతోపాటు క్సలెన్స్ సెంటర్స్ ఏర్పాటుకు కేంద్రం బడ్జెట్ లో రూ.500 కోట్లు కేటాయించింది. ఈ ప్రకటన వచ్చిన వెంటనే మహారాష్ట్ర ముందడుగు వేసింది. టెక్నాలజీ విషయంలో కేంద్ర సహకారాన్ని అందిపుచ్చుకునేందుకు మహారాష్ట్ర కీలక కసరత్తు మొదలుపెట్టింది. దేశంలోనే తొలి ఏఐ యూనివర్సిటీని మహారాష్ట్రలో ఏర్పాటు చేసేందుకు ఓ టాస్క్ ఫోర్సును నియమించింది. ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన సదుపాయాలు, వనరులు, సౌకర్యాలపై ఈ టాస్క్ ఫోర్సు రిపోర్టు ఇవ్వనుంది. 30 రోజుల గడువులో రిపోర్టు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై మహారాష్ట్ర ఐటీ మంత్రి అశిష్ షెలార్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ యూనివర్సిటీ ద్వారా ఏఐలో పరిశోధన, అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తామని ఆయన వెల్లడించారు. ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్టుగా అకాడమిక్స్‌లో విద్యార్థులకు ఈ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. .జీవిత కాల గరిష్ఠానికి ఏపీకి పోటీగా ముందుగా యాక్షన్ లోకి దిగిన మహారాష్ట్ర తొలి ఏఐ యూనివర్సిటీతో క్రెడిట్ కొట్టేయాలని భావిస్తోంది. ఇందుకోసం నిపుణుల సలహాలు, సూచనలు స్వీకరించాలని నిర్ణయించింది. ఏఐపై నియమించిన టాస్క్ పోర్సులో ఐటీ ఎక్సపర్టలను నియమించింది. ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా మహారాష్ట్ర ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని చెబుతోంది. ఏపీలో కూడా స్వర్ణాంధ్ర 2047 విజన్ లో భాగంగా ఏఐపై ఎక్కువగా ఫోకస్ చేశారు. కానీ, మహారాష్ట్ర దూకుడు చూస్తే ఈ విషయంలో ఏపీని వెనక్కి నెట్టాలనే పట్టుదలే కనిపి స్తోంది. ముఖ్యంగా దేశ ఆర్థిక రాజధాని అయిన ముంబైలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జోరుగా సాగుతు న్నాయి. మొత్తానికి దేశంలో తొలి యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని ముందుగా ఎవరు చేరుకుంటారనేది ఆసక్తి రేపుతోంది.

## అక్కడ మతం మారారా.. జైలు శిక్షతోపాటు భారీ జరిమానా



**జైపూర్-నవభూమి:** బలవంతపు మత మార్పిడులను నిరోధించేందుకు రాజస్థాన్‌లోని భజన్ లాల్ శర్మ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకోసం బడ్జెట్ సమావేశాల వేదికగా రాజస్థాన్ చట్టవిరుద్ధ మత మార్పిడి నిషేధ బిల్లు 2024 (రాజస్థాన్ ప్రోహిబిషన్ ఆఫ్ అన్ లాఫుల్ కన్వర్షన్ ఆఫ్ రిలిజియన్ బిల్లు 2025)ను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టింది. ఈ బిల్లుపై అసెంబ్లీలో చర్చించి ఆమోద ముద్ర వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే గతేడాది అంటే 2024, నవంబర్‌లో ఈ బిల్లు ముసాయిదాను భజన్ లాల్ శర్మ నేతృత్వంలోని కేబినెట్ ఆమోదించిన సంగతి తెలిసిందే.మత మార్పిడి చేసుకోవాలని నిర్ణయించుకోన్న వారు.. దాదాపు రెండు నెలల ముందు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ క్రమంలో తాము మత మార్పిడి చేసుకోవాలని తమ సొంతంగా నిర్ణయం తీసుకున్నామని జిల్లా ఉన్నతాధికారి ముందు ఒప్పుకోవాల్సి ఉంది. ఇందులో ఎవరి బలవంతం కానీ.. ఎవరి ప్రోద్బలం కానీ లేదని తెలిపాలి. అనంతరం మత మార్పిడికి అనుమతి లభిస్తోంది. అయితే రాష్ట్రంలో బలవంతపు మత మార్పిడులు చోటు చేసుకొంటున్నాయంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో వాటిని నిరోధించేందుకు రాజస్థాన్‌లోని బీజేపీ ప్రభుత్వం ఈ తరహా చర్యలకు చేపట్టనుంది. ఓ వేళ షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన వారితోపాటు మహిళలు, మైనర్లను బలవంతంగా మత మార్పిడులకు పాల్పడితే.. రెండు నుంచి 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ. 25 వేల వరకు జరిమానా సైతం విధించే విధంగా ఈ బిల్లును రూపొందించారు. ఈ బిల్లు ఆమోదం పొందితే.. బలవంతపు మతమార్పిడులకు అడ్డుపడే అవకాశాలు మెండుగా ఉన్నాయనే ఓ చర్చ అయితే రాష్ట్రంలో జోరందుకుంది. ఇక ఈ మత మార్పిడి నిరోధక బిల్లుపై రాజస్థాన మంత్రి కె.కె.బిష్ణోయ్ మాట్లాడుతూ.. లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా ఈ బిల్లును ప్రవేశపెడుతున్నామన్నారు. తద్వారా అమాయక బాలికలను ప్రలోభపెట్టడాన్ని ఆపవచ్చని ఆయన పేర్కొన్నారు.గతేడాది రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ.. తన ఎక్స్ ఖాతా వేదికగా కీలక ప్రకటన చేశారు. రాజస్థాన్ ప్రభుత్వం అక్రమ మతమార్పిడికి అడ్డుకట్ట వేసేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సీఎంవోలో జరిగిన కేబినెట్ భేటీలో ప్రేరేపరించండం లేదా మోసం చేసి మత మార్పిడులు జరిగే ప్రయత్నాలకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు అసెంబ్లీలో రాజస్థాన్ చట్టవిరుద్ధ మత మార్పిడి నిషేధ బిల్లు 2024ను ప్రవేశ పెట్టాలని నిర్ణయించామన్నారు. ఒక వ్యక్తి చట్టవిరుద్ధ మత మార్పిడి కోసం వివాహం చేసుకోంటే.. అది చెల్లదని ప్రకటించే హక్కు కుటుంబ కోర్టుకు ఉంటుందని సీఎం వివరించారు.

## 'శీష్ మహల్'ను తెరుస్తాం: అమిత్‌షా

**న్యూఢిల్లీ-నవభూమి:** కోట్లాది రూపాయల ప్రజాధనంతో అరవింద్ కేజ్రీవాల్ నిర్మించిన "శీష్ మహల్"ను ప్రజా సందర్శన కోసం తెరుస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారు. రూ.51,000 కోట్ల ప్రజాధనంతో అద్దాలమేడ (శీష్ మహల్)ను కేజ్రీవాల్ నిర్మించారని అన్నారు. జాంగ్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా మాట్లాడుతూ, కేజ్రీవాల్‌కు ఒక ఇల్లుతో సంతృప్తి లేకనే 'అద్దాలమేడ' నిర్మించుకున్నారని చెప్పారు.

# ఏపీ యువతితో దుబాయ్‌లో ప్రేమ.. కర్ణాటకలో పెళ్లి.. ఆపై ఊహించని ట్విస్ట్



**దుబాయి-నవభూమి:** దుబాయిలో ఉపాధికోసం వెళ్లిన ఆంధ్రప్రదేశ్ మహిళ.. కర్ణాటకకు చెందిన వ్యక్తితో ప్రేమలో పడింది. ఇరువురి మతాలు వేరైనా కలిసి జీవించాలని భావించారు. దీంతో స్వదేశానికి వచ్చి ఆరిఫ్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. మూడేళ్ల పాటు ప్రేమలో ఉన్న ఈ జంట.. సొంతూరికి వెళ్లి పెళ్లిచేసుకోవాలని భావించారు. మతాంతర వివాహం చేసుకున్నారు. కానీ, పెళ్లైన 20 రోజులకే భార్యతో గొడవపడిన అతడు.. ఆమె నగలు, నగదు, ఇతర పత్రాలు తీసుకుని పరారయ్యాడు. దీంతో ఆమె లబోదిబో మంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన కర్ణాటకలోని విజయపుర గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మహిళ.. నాలుగేళ్ల కిందట ఉపాధి కోసం దుబాయ్ వెళ్లింది. ఈ క్రమంలో కర్ణాటకలోని విజయపురకు చెందిన దీంతో గత నెలలో ఆరిఫ్, చిత్తూరు యువతి విజయ పురకు వచ్చారు. ముస్లిం సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. పెళ్లైన కొద్ది రోజుల నుంచి ఆరిఫ్ కుటుంబసభ్యులు ఆమెను వేధించడం మొదలుపెట్టారు. విడాకులు (తలాక్) ఇవ్వాలని బలవంతపెట్టడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. అనంతరం ఆరిఫ్.. ఆమెతోనే ఉంటానని చెప్పి తన వెంట ఇంటికి తీసుకెళ్లాడు. రెండు మూడు రోజుల తర్వాత ఆ మహిళకు మళ్లీ వేధింపులు మొదలయ్యాయి. చివరకు బురనాపురలోని ఇంటికి అద్దెకు తీసుకుని ఈ జంట కాపురం పెట్టింది. అక్కడకు వెళ్లిన తర్వాత కూడా గొడవపడ్డారు. ఈ క్రమంలో తన బంధువులను తీసుకొచ్చి.. భార్యను కత్తితో బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆమె నగలు, డబ్బులు, పాస్‌పోర్టు, మొబైల్ ఫోన్ తీసుకుని పరారయ్యాడు. ఆ తర్వాత అతడి కుటుంబసభ్యులు వచ్చి.. ఫిర్యాదు వెనక్కి తీసుకోకుంటే చంపుతామని బెదిరించారు. దీంతో రెండు రోజుల కిందట బాధితురాలు విజయపుర గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో మరోసారి ఫిర్యాదు చేసింది. ప్రేమ, పెళ్లి పేరుతో తాను నిలువునా మోసపోయానని వాపోయింది. న్యాయం జరగకుంటే ఆత్మహత్య శరణ్యమని కన్నీళ్లు పెట్టుకుంది. ఆమె ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసిన పోలీసులు... నిందితుని కోసం గాలింపు తీవ్రం చేశారు. అతడి మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఎక్కడ ఉన్నాడో తెలుసుకోవడం కష్టంగా మారిందని పోలీసులు తెలిపారు. ఆరిఫ్ కుటుంబసభ్యులను విచారిస్తే ఆచూకీ తెలిసే అవకాశం ఉందని చెప్పారు. త్వరలోనే అతడ్ని పట్టుకుని బాధితురాలికి న్యాయం చేస్తామని పోలీసులు తెలిపారు.

## సీఈసీకి బీజేపీ ఆఫరిచ్చింది.. అందుకే ఆయన ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు: కేజ్రీవాల్




**న్యూఢిల్లీ-నవభూమి:** మరో రెండు రోజుల్లోనే దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈక్రమంలోనే ప్రధాన పార్టీలన్నీ పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఓటర్లను ఆకర్షించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నా యి. నేడే ప్రచార కార్యక్రమాలు ముగిసిపోతుం డడంతో.. ఢిల్లీ వ్యాప్తంగా అన్ని పార్టీల వాళ్లు సభలు, ర్యాలీలు నిర్వహించుకుంటూ ఇతర పార్టీలపై దుమ్మెత్తి పోస్తున్నారు. అయితే తాజా గా ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ షాకింగ్ కామెంట్లు చేశారు. బీజేపీ ఆఫర్లకు లొంగిన ప్రధాన ఎన్నికల కమిషనర్.. దేశ ప్రజాస్వామ్యాన్ని, భవిష్యత్తును నాశనం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. అయితే నేటితో ప్రచార కార్యక్రమాలు ముగిసిపోతుండగా.. చివరి రోజు అన్ని పార్టీల నేతలు ప్రచారాలతో ఢిల్లీని హోరెత్తిస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ సైతం.. ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు. కేవలం బీజేపీపైనే కాకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌పై కూడా ఘాటు విమర్శలు చేశారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ముందు ఈసీ లొంగిపోవడం చూస్తుంటే స్వతంత్ర సంస్థ ఉనికి పూర్తిగా కోల్పోయినట్లు తెలుస్తుందంటూ కేజ్రీవాల్ అన్నారు. ఈ నెలాఖరుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ పదవీ విరమణ పొందబోతున్నారని.. ఆయనకు బీజేపీ ఏదో ఆఫర్ ఇచ్చే ఉంటుందంటూ వివరించారు. రాష్ట్రపతి పదవినో, గవర్నర్ పదవినో కట్టబెడతానని చెప్పడం వల్లే ఆయన పదవులపై ఆశతో దేశ ప్రజాస్వామ్యాన్ని, భవిష్యత్తును నాశనం చేస్తున్నారంటూ ఆరోపించారు. ఇప్పటికైనా సీఈసీ రాజీవ్ కుమార్ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కకు పెట్టి.. ఎన్నికలను న్యాయబద్ధంగా నిర్వహించాలని కోరుతున్నానంటూ కేజ్రీవాల్ చెప్పుకొచ్చారు. మరో రెండు రోజుల్లోనే ఎన్నికలు ఉండనుండగా.. బీజేపీ గూండాలు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అనేక దాడులు చేస్తోందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇంత జరగుతున్నా ఢిల్లీ పోలీసులు సైతం చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు.ఓవైపు ఢిల్లీ ప్రజల అభివృద్ధి కోసం తాము అనేక పథకాలు తీసుకు వస్తుంటే.. బీజేపీ మాత్రం గొడవలు సృష్టించేందుకు గూండాలను పంపుతోందని ఆరోపించారు. అలాగే ఓటింగ్ విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు తమ నేతలకు స్పై కెమెరాలు ఇస్తున్నామని కూడా కేజ్రీవాల్ ప్రకటించారు. ప్రజలు ఈ విషయాలన్నింటిని దృష్టిలో ఉంచుకుని.. ఎవరి వల్ల ఢిల్లీకి మంచి జరుగుతుందో బేరీజు వేసుకుని మరీ ఓట్లు వేయాలని అభ్యర్థించారు.

## రాందేవ్ బాబాపై నాన్‌బెయిలబుల్ వారెంట్



**తిరువనంతపురం-నవభూమి:** యోగా గురు బాబా రాందేవ్‌కు కేరళలో కోర్టు ఒకటి నాన్‌బెయిలబుల్ వారెంటు జారీ చేసింది. విచారణకు హాజరు కావాలన్న ఆదేశాలను విస్మరించినందుకు పాలక్కాడ్‌లోని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేటు కోర్టు-2 ఈ వారెంటు ఇచ్చింది. ఔషధాలకు సంబంధించి పతంజలి సంస్థకు అనుబంధంగా ఉన్న దివ్య ఫార్మసీ తప్పుదోవపట్టించేలా ప్రకటనలు ఇచ్చిందంటూ ఆ సంస్థ నిర్వాహకులైన రాందేవ్‌తో పాటు, ఆచార్య బాలకృష్ణలపై కేరళ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేసు పెట్టారు. ఫిబ్రవరి ఒకటో తేదీన విచారణకు హాజరు కావాలంటూ గతంలో కోర్టు నోటీసులు ఇవ్వగా వారు దాన్ని అమలు చేయలేదు. దాంతో వారిని ఈ నెల 15న కోర్టులో ప్రవేశపెట్టాలంటూ శనివారం వారెంట్లు జారీ చేసింది.

## జైలు నుంచి బెయిల్‌పై వచ్చి.. వృద్ధురాలిపై రేప్, హత్య



**పెదనందిపాడు-నవభూమి:** అత్యాచారం కేసుల్లో జైలుకు వెళ్లిన ఓ కామోన్మాది.. మూడు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలై మరో ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈసారి ఏకంగా 64 ఏళ్ల వృద్ధురాలిని కాటేశాడు. తన కామవాంఛ తీర్చుకున్నాక ఆమెను దారుణంగా హత్య చేశాడు. గుంటూరు జిల్లా పెదనందిపాడులో జరిగిన ఈ దారుణ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. తొలుత అనుమానాస్పద మృతిగా పోలీసులు భావించినప్పటికీ, ఆ వృద్ధురాలు ఓ ఉన్మాది ఈ ఘాతుకానికి బలైపోయినట్లు గుర్తించారు. నిందితుడు మంజు 2023లో ఇదే తరహా ఓ మహిళపై అత్యాచారం చేసి హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత 2024లో కూడా ఓ మహిళపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ప్రస్తుతం ఆ కేసులో జైలులో ఉన్న అతడు మూడు రోజుల క్రితమే బెయిల్‌పై విడుదలయ్యాడు. వృద్ధురాలు స్థానికంగా స్వీపర్‌గా పనిచేసుకుంటూ గుడిసెలో నివాసం ఉంటోంది. శనివారం రాత్రి వృద్ధురాలిపై అత్యాచారం, హత్యకు ఒడిగట్టిన నిందితుడు వెంటనే పరారయ్యాడు.ఆదివారం ఉదయం పనికి రాకపోవడంతో, అదే గ్రామంలో ఉంటున్న ఆమె కుమార్తె గుడిసె వద్దకు వచ్చి చూడగా.. వృద్ధురాలు రక్తం మరకలతో పాటు ఒంటిపై గాట్లతో కనిపించింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. శనివారం రాత్రి సాంబ, మంజు అనే వ్యక్తులు అనుమానంగా తిరగడం గమనించినట్లు స్థానికులు తెలపడంతో పోలీసులు ఆ దిశగా విచారణ జరిపి మంజు రేప్ చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. ఘటనా స్థలాన్ని ట్రైనీ ఎస్పీ దీక్షిత, డీఎస్పీ భానోదయ పరిశీలించారు. ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలం వద్ద క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్ఐ మధుపవన్ తెలిపారు. వరుస అత్యాచారాలు, హత్యల నేపథ్యంలో మంజు నేర ప్రవృత్తిపై పోలీసు వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నిందితుడు మంజును త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

## అయోధ్య రామ మందిర ప్రధాన పూజారి ఆరోగ్యం విషమం.. ఏమైందంటే?



**అయోధ్య -నవభూమి:** అయోధ్య రామ మందిరం ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వివరిస్తున్నారు. తాజాగా ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రాగా.. లఖ్‌నవూలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారట. మధుమేహంతో పాటు బీపీ కూడా ఎక్కువ కాగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆయన కూడా వైద్యానికి స్పందిస్తున్నప్పటికీ.. పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది.అయోధ్య రామాలయం ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్‌కు ప్రస్తుతం 85 ఏళ్లు. ఇన్నాళ్లూ ఆరోగ్యంగానే ఉన్న ఈయనకు ఆదివారం రోజు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. ఈక్రమంలోనే అతడిని లఖ్‌నవూలోని సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెన్ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అక్కడి వైద్యులు సైతం సత్యేంద్ర దాస్‌కు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. పూజారి కూడా వారి చికిత్సకు స్పందిస్తున్నారు. అయినప్పటికీ ఆయన పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

ముఖ్యంగా మహంత్ సత్యేంద్ర దాస్ మధుమేహంతో పాటు బీపీతో బాధ పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ఆదివారం రోజు ఆస్పత్రిలో చేరిన సత్యేంద్రను ఐసీయూలో ఉంచగా.. ప్రస్తుతం న్యూరాలజీకి చెందిన హై డిపెండెన్సీ యూనిట్‌కు మార్చినట్లు వివరించారు. అనుక్షణం అతడి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తూ అవసరమైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని కూడా వెల్లడించారు. 1992 డిసెంబర్ 6వ తేదీన బాబ్రా మసీదు కూల్చి వేసిన సమయంలో తాత్కాలిక రామ మందిరానికి పూజారిగా పని చేశారు ఆచార్య సత్యేంద్ర దాస్. 20 ఏళ్ల వయసులోనే నిర్వాణి అఖాడాలో చేరి ఆధ్యాత్మిక దీక్ష తీసుకున్న ఈయన.. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం, బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సమయంలోనూ ముఖ్య పాత్ర పోషించారు. ప్రస్తుతం అయోధ్య రామాలయ ప్రధాన పూజారిగా పని చేస్తున్నారు. అయితే ఈయన ఆరోగ్య పరిస్థితి విషమించినట్లు తెలియడంతో.. దేశ వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆయన ఆరోగ్యంగా బయటకు రావాలని అయోధ్య బాల రాముడిని కోరుతున్నట్లు కూడా

## ఆస్తి పంపకాల్లాగే అంత్యక్రియల పంపకం.. తండ్రి మృతదేహాన్ని రెండు ముక్కలు చేసేందుకు నిర్ణయం!



**తీకంఫుర్-నవభూమి:** రోజురోజుకూ మనుషులు పశువుల్లా మారిపోతున్నారు. చిన్న చిన్న వాటికే కోపం తెచ్చుకుంటూ ఎంతకైనా దిగజారుతున్నారు. ఇంటి బాధ్యతలన్నీ మోస్తూ కుటుంబ పరువును కాపాడాల్సిన ఓ పెద్ద కుమారుడే.. తాజాగా తమ్ముడితో గొడవ పడి తండ్రి అంత్యక్రియలను అడ్డుకున్నాడు. తానే ఆ కార్యక్రమం నిర్వహిస్తానంటూ రచ్చ చేశాడు. కుదరదని చిన్న కుమారుడు చెప్పగా.. ఆస్తి పంపకాల్లేగా తండ్రి మృతదేహాన్ని పంచుకుందామని చెప్పాడు. రెండు ముక్కలు చేసి వేర్వేరుగా అంత్యక్రియలు నిర్వహించుకుందామంటూ వివరించి అందరికీ షాక్ ఇచ్చాడు. మధ్య ప్రదేశ్‌లోని తీకంఫుర్ జిల్లా లిధౌరా తాల్ గ్రామానికి చెందిన 85 ఏళ్ల ధ్యాని సింగ్ ఘోష్‌కు ఇద్దరు కుమారులు. వారిలో పెద్దవాడు కిషన్ సింగ్ కాగా, దామోదర్ చిన్నవాడు. అయితే వీరిద్దరికీ పెళ్లిళ్లు కాగా వేర్వేరుగా ఉంటున్నారు. ఈక్రమంలోనే చిన్న కుమారుడు దామోదర్.. తండ్రి బాధ్యతలు చూసుకుంటున్నాడు. చాలా కాలంగా ధ్యాని సింగ్.. దామోదర్ వద్దే ఉంటుండగా.. తాజాగా ఆయన ప్రాణాలు కోల్పోయాడు. దీంతో చిన్న కుమారుడు దామోదన్ తన ఇంటి వద్దే అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లు చేశాడు.

విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్థులు అంతా అంత్యక్రియల కోసం రాగా.. పెద్ద కుమారుడు కిషన్ సింగ్ కూడా హాజరయ్యాడు. ఈక్రమంలోనే తానే తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తానని.. పెద్ద కుమారుడే తండ్రికి దహన సంస్కారాలు చేయాలంటూ చెప్పాడు. కానీ దామోదర్ మాత్రం అందుకు అస్సలే ఒప్పుకోలేదు. మొదటి నుంచి తండ్రిని తానే చూసుకుంటున్నానని.. అంతిమ సంస్కారాలు కూడా తానే చేస్తానంటూ వివరించాడు. ఈక్రమంలోనే అన్నదమ్ముల మధ్య గొడవ జరిగింది.అయితే అక్కడే ఉన్న బంధువులు, గ్రామస్థులు అంతా అన్నదమ్ముళ్లకు నచ్చజెప్పారు. కానీ వాళ్లలో ఏ ఒక్కరూ వెనక్కి తగ్గలేదు. దీంతో పెద్ద కుమారుడు కిషన్ సింగ్.. ఆస్తి పంపకాల్లాగే తండ్రి అంత్యక్రియలను పంచుకుందామని చెప్పాడు. తండ్రి మృతదేహాన్ని రెండు ముక్కలు చేసి చేరో ముక్కకు దహన సంస్కారాలు చేసుకుందామంటూ వివరించాడు. దీంతో బంధువులు, గ్రామస్థులు అంతా షాక్ అయ్యారు. అలా చేయడానికి వీల్లేదంటూ గొడవ చేశారు. ఆపై వెంటేనే పోలీసులకు సమాచారం అందించారు.హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు.. అన్నదమ్ముళ్లిద్దరికీ నచ్చజెప్పారు. అలా అస్సలే చేయకూడదంటూ వివరించారు. దీనిపై వెనక్కి తగ్గకపోతే అరెస్టు కూడా చేస్తామంటూ హెచ్చరించగా.. కిషన్ సింగ్‌తో పాటు దామోదర్ కూడా వెనక్కి తగ్గాడు. ఇద్దరూ కలిసే అంత్యక్రియలు చేసేందుకు ఒప్పుకు న్నారు. ఇలా దామోదర్ దనహ సంస్కారాలు చేయగా.. సోదరుడి పక్కనే ఉండి కిషన్ సింగ్ అన్నింట్లోనూ పాలు పంచుకున్నాడు. పోలీసులు సైతం బందోబస్తు నిర్వహించి మరీ ధ్యాని సింగ్

## అయోధ్యలో దళిత యువతిపై హత్యాచారం

**అయోధ్య -నవభూమి:** దళిత యువతిపై హత్యాచారం ఉత్తరప్రదేశ్‌లో దుమారం రేపుతోంది.



అయోధ్య సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువతి గురువారం రాత్రి భాగవతం వినేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఆమె మృతదేహాన్ని అత్యంత దారుణ స్థితిలో గ్రామ సమీపంలోని కాల్వలో గుర్తించారు. కాళ్లుచేతులు విరగ్గొట్టి, కళ్లు పీకేయడమే కాక మర్మావయాల్లో కర్ర దూర్చినట్లు తేలింది. శరీరంపై ఇతర చోట్లా తీవ్ర గాయాలున్నాయని యువతి కుటుంబ సభ్యులు ఆరోపించారు. యువతి అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా సరిగా స్పందించలేదని విమర్శించారు. పోస్టుమార్టం నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని, అది వచ్చాకే నిజానిజాలు తేలుతాయని స్థానిక పోలీసులు తెలిపారు.కాగా, హత్యాచార ఘటనపై మీడియాతో మాట్లాడుతూ ఫైజాబాద్ ఎంపీ అవధేశ్ ప్రసాద్ కన్నీటి పర్యంతమయ్యారు. "ఓ మర్యాద రామా.. ఓ సీతమ్మ తల్లీ మీరెక్కడున్నారు?" అంటూ రోదించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని లేదంటే ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని హెచ్చరించారు. లోక్‌సభలో విషయాన్ని లేవనెత్తుతానని, ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.




## ఆధునిక టెక్నాలజీలకు భారత్ సై!

**న్యూఢిల్లీ-నవభూమి:** కృత్రిమమేధ (ఏఐ), రోబోటిక్స్, అటానమస్ వ్యవస్థలు వంటి అత్యాధునిక టెక్నాలజీలను తమ సంస్థల్లో ప్రవేశపెట్టే విషయంలో భారతీయ పారిశ్రామికవేత్తలు ఇతర దేశాల పారిశ్రామికవేత్తలకన్నా ముందంజలో ఉన్నారు. 'ఉద్యోగాల భవిష్యత్తు' పేరుతో ప్రపంచ ఆర్థిక సంస్థ (డబ్ల్యూఈఎఫ్) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ వివరాల్ని వెల్లడించింది. సెమీకండక్టర్లు, కంప్యూటింగ్ టెక్నాలజీలను వాడేందుకు భారత్‌లో 35శాతం కంపెనీల అధిపతులు సుముఖత వ్యక్తం చేశారని నివేదిక తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఇది సగటున 20శాతం ఉంది. క్వాంటమ్, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీలను ఉపయోగించుకోవటానికీ భారతీయ పారిశ్రామికవేత్తలు సిద్ధపడుతున్నారు. ఈ టెక్నాలజీల పట్ల 21శాతం మంది ఆసక్తితో ఉన్నారని, ఇది ప్రపంచ సగటు 12శాతం కన్నా చాలా ఎక్కువని నివేదిక పేర్కొంది. భారత్‌లో డేటా, ఏఐ, మెషిన్ లెర్నింగ్, సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ రంగాల నిపుణులు గ్లోబల్ ట్రెండ్‌లకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటున్నారని తెలిపింది. ఏఐ నిపుణుల సంఖ్యను పెంచుకోవడంలో అమెరికా, భారత్ ముందువరుసలో ఉన్నాయని పేర్కొంది. అమెరికాలో వ్యక్తిగతస్థాయిలో ఆసక్తి కొద్ది ఏఐ రంగంలోకి ప్రవేశిస్తున్నారని, భారత్‌లో మాత్రం కార్పొరేట్ కంపెనీలు ముందుండి ఏఐ శిక్షణను ప్రోత్సహిస్తున్నాయని తెలిపింది. రానున్న కాలంలో అవసరమైన శ్రామికశక్తికి 2/3వంతు వాటాను భారత్, సబ్‌సహారన్ ఆఫ్రికా దేశాలే అందజేస్తాయని పేర్కొంది.



## ఎడిట్ పేజీ

## చిక్కుల్లో ఆర్థికం...!

దేశ ఆర్థిక వ్యవస్థ గత కొన్ని సంవత్సరాలతో పోల్చితే కొంత చిక్కుల్లో ఉన్నదన్న విషయం శుక్రవారం పార్లమెం టులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే తేల్చి చెప్పింది. మన ఆర్థిక వృద్ధిరేటు ఇప్పటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నింటితో పోల్చితే బలంగానే ఉన్నప్పటికీ దేశీయంగాను, అంతర్జాతీయంగాను పలు సవాళ్లు రాబోయే కాలంలో ఆ జోరుకు పగ్గాలు వేయవచ్చునన్న సంకేతాలు వెలువరించింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వృద్ధిరేటు 6.3 నుంచి 6.8 శాతం మధ్యన ఉండవచ్చునని అంచనా వేసింది. 2047 నాటికి వికసిత్ భారత్ కావాలన్న లక్ష్యం నెరవేరాలంటే ఈ వృద్ధిరేటు ఏ మాత్రం సరిపోదు. ఏడాదికి సగటున ఎనిమిది శాతం వృద్ధిని సాధిస్తే తప్ప మనం ఆ లక్ష్యాన్ని చేరడం సాధ్యం కాదు. గత కొన్నేళ్లుగా ఉన్న సానుకూలతలు క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం, యూరోపియన్ ఆర్థిక వ్యవస్థల్లో మంద గమనం వల్ల ఎగుమతుల రంగం ఎదురీదుతోంది. ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం వాటా కేవలం 2 శాతం ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మన ఎగుమతుల వృద్ధిరేటు 1.6 శాతానికే పరిమితం అయింది. దీనికి తోడు కొత్తగా రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన అమెరికా అధ్యక్షుడు ఆత్మరక్షణ విధానాలకు పెద్ద పీట వేస్తున్నారు. దీని వల్ల అమెరికాకు ఎగుమతులు మరింతగా తగ్గే అవకాశం ఉంది. ఇవన్నీ విదేశాల నుంచి ఎదురవుతున్న సవాళ్లయితే దేశీయంగా ద్రవ్యోల్బణం పెనుభూతంగా ఉంది. గత ఏడాది రుతుపవనాల సానుకూలత కారణంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కొనుగోలుశక్తి పెరిగినప్పటికీ నగర జీవులు మాత్రం ధరల కాటుకు విలవిలలాడుతూనే ఉన్నారు. ఫలితంగా వారి కొనుగోలు శక్తి తగ్గిపోయింది. పెరిగిన ద్రవ్యోల్బణాన్ని తట్టుకోగల రీతిలో వారి వేతనాలు పెరగడంలేదు. ఈ అస్థిరతల నుంచి బయటపడి నిలకడ వృద్ధిరేటు సాధించాలంటే భిన్న రంగాల్లో సంస్కరణలు చేపట్టక తప్పదన్న విషయం ఆర్థిక సర్వే నివేదికలో తేల్చి చెప్పారు. దేశీయంగా వృద్ధికి ఊతం ఇచ్చే రంగాలను ఉత్తేజితం చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రధానంగా వాణిజ్యం, ఎగుమతులు, పారిశ్రామిక రంగాల విషయంలో నియంత్రణలు సడలించడం, సుంకాలు హేతుబద్ధం చేయడం వంటి చర్యలు తీసుకోవాలన్నది ఆర్థిక సర్వే సారాంశం. దేశంలో ఉపాధికి వెన్నుదన్నుగా నిలుస్తున్నది ఎంఎస్ఎంఈ రంగమే. ఈ రంగంలో ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు మితిమీరిన నియంత్రణలను సడలించి పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించాలని సర్వేలో సూచించారు. అలాగే దేశంలో ఇప్పటికీ పప్పుదినుసులు, వంటనూనెల కొరత అధికంగా ఉంది. ఆ కొరతను అధిగమించేందుకు ఇప్పటికీ భారీ పరిమాణంలో వాటిని దిగుమతి చేసుకుంటున్నాం. అవసరాన్ని మించి తృణ ధాన్యాలు ఉత్పత్తి చేయడాన్ని నిలువరించి పప్పులు, నూనెగింజల ఉత్పత్తిని పెంచడం అవసరమన్న విషయం సర్వే తేల్చి చెప్పింది. ఒకపక్క మార్కెట్ ధరల్లో ఆటుపోట్ల నుంచి రైతులకు రక్షణ కల్పించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు కావడంతో పాటు మరోపక్క సాధారణ గృహస్థులకు రక్షణ కల్పించే సమాంతర వ్యవస్థ ఒకటి ఉండాలని సూచించింది. ఇక ఎగుమతులు ఉత్తేజితం చేయాలంటే వాణిజ్య సంబంధిత వ్యయాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పారు. అప్పుడే భారత్ పోటీ సామర్థ్యం పెంచుకోగలుగుతుంది. ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావాలంటే మధ్యతరగతి ప్రజల ఆదాయాలు పెరగాలని, కంపెనీలు వేతనాల పెంపునకు చర్యలు తీసుకోవడం అవసరమన్న విషయం నాగేశ్వరన్ ఒక చక్కని ఉదాహరణ ద్వారా చెప్పారు. వేతనాల్లో అరకొర వృద్ధి ఉన్నట్టయితే తాను ఉత్పత్తి చేస్తున్న కార్లు అమ్ముడుపోవని ఫోర్డ్ మోటార్ కంపెనీ వ్యవస్థాపకుడు హెన్రీ ఫోర్డ్ గుర్తించారని వ్యాఖ్యానించడం ద్వారా కార్పొరేట్లు లాభాలు మూటగట్టుకుంటే సరిపోదని, దాన్ని ఉద్యోగులకు కూడా వేతన వృద్ధి రూపంలో పంచినప్పుడే ఆర్థిక వృద్ధికి దోహదకారులవుతారని ఆయన స్పష్టంగా సూచించారు. మొత్తం మీద ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడి దేశం స్థిరమైన వృద్ధిరేటు సాధించే దిశగా అడుగేయాలంటే సంస్కరణలను ఆశ్రయించక తప్పదు. ఒక పక్క వ్యయాలను నియంత్రించుకుంటూ మరోపక్క స్థిరమైన వృద్ధిని కొనసాగించడం ద్వారా వికసిత్ భారత్‌కు బాటలు వేయడం అనేది కత్తిమీద సాము అనక తప్పదు. ఆర్థిక సర్వేలో సూచించిన భిన్న మార్గాల్లో పయనిస్తూ దేశ ఉజ్వల భవిష్యత్తుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేటి బడ్జెట్లో ఏ విధమైన బాటలు వేస్తారన్నది వేచి చూడాలి.

# అధికార, ప్రతిపక్షానికి మధ్య నలుగుతున్న రక్షకభటులు



ప్రస్తుత రాజకీయాలు చూస్తుంటే ఒక్కరికి కూడా రాజనీతిశాస్త్రం మీద అవగాహన ఉన్నట్లుగా అనిపించట్లేదు. ప్రజల కోసం ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యడానికి బదులుగా గత ప్రభుత్వం తాలూకా వాళ్ళ మీద కక్ష సాధింపు చర్యల కోసం ఏర్పాటు చేసి నట్టే అనిపిస్తుంది. ప్రశ్నించిన వారి మీద కేసులు పెట్టి జైలుకి పంపాలని చేసే ప్రయత్నాలు అన్ని ఇన్నీ కావు. దీని కోసం వాళ్ళు ఉపయోగించే పోలీసు వ్యవస్థ ఇరు పక్షాల మధ్య నలిగిపోతుంది. మార్చి 2023 లెక్కల ప్రకారం, లక్ష మంది జనాభాకు 153 మంది పోలీసు అధికారులు ఉన్నారు. కానీ, అనుమతి ఉన్నది 196 మంది అధికారులకు. ఇంత తక్కువ ఉండి కూడా శాంతి భద్రతలు కాపాడటంలో వాళ్లు ఎంత కష్ట పడుతున్నారు అనేది ఎవరూ చెప్పక్కర్లేదు. దేశంలో ఉన్న అన్ని ఉద్యోగాలు ఒక ఎత్తు రక్షణశాఖ ఉద్యోగాలు ఒక ఎత్తు. అందులో పోలీసు ఉద్యోగం ఒకటి. సామాన్యులకు ఉండే పండుగలు, సెలవులు, విశ్రాంతి తీసుకునే సమయం, కుటుంబంతో వేడుకలు వాళ్ళకి చాలా ఉండవు. మనం పండుగలు, వేడుకలు జరుపుకుంటూ ఉంటే వాళ్ళు గస్తీ కాస్తుంటారు. ఒక్కోసారి రోజుల కొద్దీ పని చేయాల్సి వస్తుంది. కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తుంది. అయినా, కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో ఎక్కడా అసహనం కనపడదు, రాజీ పడరు. చల్ల గాలి లేనిదే ఊపిరి కూడా ఆడట్లేదు అంటాం, వర్షం పడ్డా, చలి కాస్త ఎక్కువ ఉన్నా ఇంట్లోనే ఉంటాం. కానీ, పోలీసులు



ఇవేం పట్టించుకోకుండా ఎండ ఉన్నా, వర్షం ఉన్నా, వాతావరణం ఎలా ఉన్నా వాళ్ళ పని వాళ్ళు చేస్తూనే ఉంటారు. వాళ్ళే లేకపోతే ప్రజల జీవితాలు ఇపుడు ఉన్నంత ప్రశాంతంగా అస్సలు ఉండవు. శాంతి భద్రతలకు భంగం కలిగి పరిపాలన కూడా సజావుగా సాగదు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా, వాళ్ళకి అనుకూలంగా పోలీసు వ్యవస్థ పని చేస్తుంది అనేది తెలిసిన విషయమే. మరీ నిజాయితీ ఉన్న నాయకులు అయితే తప్ప పోలీసులను వాళ్ళ పనిని వాళ్ళను చేసుకొనివ్వరు. అధికారంలో ఉన్నది ఎవరైనా అది ప్రభుత్వం కాబట్టి ప్రభుత్వం కోసం పని చేయడం పోలీసుల కర్తవ్యం, ధర్మం కూడాను. కొన్ని సార్లు ప్రతిపక్షంలో ఉన్న వాళ్ళని నిర్బంధించి జైలుకి తరలించాల్సి వస్తుంది. గతంలో అధికారంలో ఉన్నపుడు ఎవరికి అయితే వాళ్ళు సలాం కొట్టారో వాళ్ళ చేయి పట్టి లాక్కెళ్ల వలసి వస్తుంది. వాళ్ళు ప్రజలను రెచ్చ గొడుతున్నారా, ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారా, లేదా శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తున్నారా అనే దానికి లోబడే పోలీసులు వ్యవహరిస్తారు. ఖర్మ కాలి ప్రతిపక్షానికి తరువాత అధికారం గాని వచ్చిందా, గత ప్రభుత్వం హయాంలో ప్రతిపక్షం వాళ్ళతో కొంచం అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులపై వేటు పడటమో, వారిని వేరే చోటికి బదిలీ చేయడమో ఖచ్చితంగా జరుగుతుంది. పోలీసులు ఎంత నిజాయితీగా ఉన్నప్పటికీ, పై అధికారుల ఆదేశాలను తుః చః తప్పక పాటిస్తారు. ఆలోచించాల్సిన విషయం ఏమిటి అంటే ఆ ఆదేశాలు ఎలాంటివి అని. ప్రతిపక్షం వాళ్ళ మీద కేసులు పెట్టడం కావచ్చు, గృహ నిర్బంధం కావచ్చు లేదా జైలుకి తీసుకు పోవడం కావచ్చు. ఇలాంటివి కూడా ఆదేశాల మేరకే చేస్తారు తప్ప వారికి ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఎలాంటి పగ ప్రతీకారాలు ఉండవు. అయినప్పటికీ, ఇలా చేయడం వల్ల సహజంగానే నాయకుల మనోభావాలు దెబ్బ తింటాయి. ఆత్మ గౌరవం అని, అన్యాయం అని వాళ్ళు చేసే రాద్ధాంతం అంతా ఇంతా కాదు. ఓ నాలుగు రోజుల పాటు, వార్తా పత్రికలకు, ప్రసార మాధ్యమాలకు అదొక మంచి అంశం అవుతుంది. చట్టం ముందు అందరూ సమానమే అయినా మంత్రులుగా, ప్రజా పాలకులుగా పని చేసిన వారికి కనీస మర్యాద ఉండదా అన్నది ప్రతిపక్షం వాళ్ళ వాదన. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ప్రభుత్వ ఆదేశానుసారం వ్యవహరిస్తారే తప్ప వ్యతిరేకించరు. అదే పోలీసులు కూడా చేస్తుంది. దానికే పోలీసులు అత్యుత్సాహం చూపిస్తున్నారు అనడం, నిందించడం ఎంత వరకు సరైంది అని ఒక్కసారి ఆలోచించుకోవాలి. ప్రజలను పాలించే స్థాయిలో ఉన్న నాయకులకు ఇది తెలియదు అనుకోవడం మన అమాయకత్వం. అన్నీ తెలుసు. అయినా గుర్తు పెట్టుకునో లేదా పుస్తకాలలో రాసుకునో, అధికారంలోకి రాగానే వాళ్ళ అంతు చూస్తాం అంటూ బెదిరిస్తారు. విచిత్రం ఏమిటంటే, అధికారం రాగానే అదే పోలీసుల్ని ప్రతిపక్షం మీదకి కక్ష తీర్చుకోవడానికి ఉపయోగిస్తారు. ప్రజల కోసం కాకుండా కేవలం ఒక పార్టీకి సంభందించిన ప్రభుత్వం కోసం మాత్రమే పని చేసిన పోలీసులు కూడా ఉన్నారు. అలాంటి వారికి న్యాయ వ్యవస్థ బుద్ధి చెప్పడం, మొట్టికాయలు వేయడం మనం చూస్తూనే ఉంటాం. పార్టీల కోసం పని చేసే వారి వల్ల నిజాయితీగా పని చేస్తున్న వారికి కూడా చెడ్డ పేరు వస్తుంది. అందుకే ప్రజలలో పోలీసు వ్యవస్థ మీద సదాభిప్రాయం లేదు అనేది వాస్తవం. ఒక్కరు తప్పు చేస్తే శాఖ మొత్తం ఆ తప్పుని మీద వేసుకుని భరించాలి మరి. అధికార పార్టీ ప్రత్యర్థుల మీద కాకుండా పాలన మీద ధ్యాస పెడితే, ప్రజలతో పాటు పోలీసులు కూడా సుఖంగా ఉంటారు. లేదు అని కక్ష పూరిత రాజకీయాలు చేస్తే మధ్యలో బలి అయ్యేది పోలీసులే. ఎందుకంటే, ప్రత్యక్షంగా రాజకీయ నాయకులను ఏమి చేయలేరు కాబట్టి ఏదో ఒక కేసులో ఇరికించి జైలుకి పంపడానికి ఉన్నది పోలీసులే. వాళ్ళు ఉన్నపుడు వాళ్ళ కోసం పని చేశారు అని వీళ్ళు, వీళ్ళు ఉన్నపుడు వీళ్ళ కోసం పని చేశారు అని వాళ్ళు అనుకోకుండా, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసం ఉపయోగిస్తే బావుంటుంది అని చాలా మంది అభిప్రాయం. వ్యవస్థ దేని కోసం ఏర్పడిందో దానికోసం మాత్రమే పని చేయనివ్వాలి. అధికారాన్ని ప్రజా క్షేమం కోసం కాకుండా వ్యక్తిగత కక్షల కోసం ఉపయోగిస్తే అది మరో తరానికి ఆదర్శం అవడమే కాకుండా అదే ఆనవాయితీగా మారుతుంది.

**రామ్ సంకుల, రీసెర్చ్ అనలిస్ట్**
**అశ్వారావుపేట, సెల్: 9603939033**

# కేంద్రబడ్జెట్ 2025: పేదల పట్ల నిర్లక్ష్యం




ఊహించినట్లుగానే, దేశంలోని అత్యంత అణగారిన శ్రామిక వర్గాన్ని అణగారిన ప్రజలను కేంద్ర బడ్జెట్ స్థూలంగా విస్మరిస్తూ భారతదేశంలో పెరుగుతున్న మధ్యతరగతి కలలను విలాసాల వైపు మళ్లేటట్లు చేయడం( పాంపరింగ్ చేయడం) లేదా మధ్యతరగతి ఆలోచనలను తట్టుడంతో పాటుగా మితవాద నయా ఉదారవాద విధానాలను వేగవంతం చేయాలనే మోదీ పాలన సంకల్పాన్ని భారత ఆర్థిక మంత్రి 2025 బడ్జెట్ ప్రసంగం వెల్లడి చేసింది. ఇది ప్రపంచ ఆర్థికవేత్తల అధ్యయనాల ప్రకారం, ప్రపంచంలోని 70 కోట్ల " మొత్తం నిరుపేదల"లో 50% కంటే ఎక్కువ నిరుపేదలు". దాదాపు 35 కోట్ల మందితో, 145 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలోనే ఉన్నారు. వారంతా చిన్నాచితకా, నైపుణ్యం లేని మొద్దు చాకిరి చేసే శ్రమజీవులుగా( మాన్యువల్) వివిధ రంగాలలో పనులలో నిమగ్నమై ఉన్నారు. వీరిలో అత్యధికులు ఈ అత్యంత అణగారిన అణచివేతకు గురైన ప్రజలు, వారికి సంవత్సరానికి కనీసం 100 రోజుల ఉపాధి హామీ పథకం అమలు చేయాల్సి ఉన్నది. వీరంతా గ్రామీణ ప్రాంతాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకం కింద దేశమంతా వివిధ రాష్ట్రాలలో నమోదు చేయబడ్డారు. భారతదేశంలో గత సంవత్సరం నిపుణుల అంచనా ప్రకారం, కనీసం ? 2.70 లక్షల కోట్లు - 2024లో భారతదేశ స్థూల జాతీయోత్పత్తి ( జిడిపి- %+ఞా%)లో దాదాపు 1.5% - మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఇ జి ఏ-%వీ+చీ=జు+ూ%) కోసం బడ్జెట్‌లో " నిరుపేదలకు" లేదా అత్యంత దయనీయ స్థితిలో ఉన్న పేదలకు 100 రోజుల ఉపాధి కల్పించడానికి కేటాయించబడి ఉండాలి. అయితే, 2047 నాటికి "వికసిత్ భారత్" సాధనలో నిమగ్నమై ఉన్న మోదీ పాలనలో, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులు సంవత్సర సంవత్సరానికి క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. బడ్జెట్ అంచనాల ప్రకారం, 2021లో, ఇది స్థూల జాతీయోత్పత్తిలో( జిడిపి- %+ఞా%) 0.56%గా ఉంది. ఇది 2022లో 0.41%కి, 2023లో 0.33%కి 2024లో 0.25%కి తగ్గింది. బడ్జెట్ అంచనాల ప్రకారం మోదీ ప్రభుత్వం మధ్యతరగతి వర్గాలను శాంతింపజేయడానికి బడ్జెట్‌లో అధిక ఉత్సాహం చూపుతోంది. "దేశం బడ్జెట్ పరిస్థితి మధ్యతరగతికి నిదర్శనం", గా ఉన్నది. వారి ఓటు బ్యాంకును నిర్ధారించడంగా ఉన్నది. "వికసిత్ భారత్"ను వినియోగంతో నడిపించేదిగా చేస్తుంది, అయితే మోదీ ప్రభుత్వం 2025 బడ్జెట్‌లో ఆదాయపు పన్ను తగ్గింపులు వివిధ మినహాయింపుల ద్వారా సుమారు ?1 లక్ష కోట్లను వదులుకుంది. ఈ సమయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గురించి అది ప్రస్తావించలేదు. తద్వారా భయంకరమైన పేదరికం, వేదన దయనీయమైన జీవితానికి " గురి అవుతున్న వారిని, బేషరతుగా పేదలను" పూర్తిగా విస్మరిస్తున్నది. ఇది ఖండించాల్సిన అంశం .ప్రపంచ బ్యాంకు నిర్వచనం ప్రకారం "పూర్తి పేదలు" అని నిర్వచించినప్పుడు, రోజుకు 1.90 కంటే తక్కువ ఆదాయం ఉన్నవారు పేదలన్నది. భారతదేశంలో ఈ ప్రమాణం ప్రకారం రోజుకు 1.15 కంటే తక్కువ ఉన్నది! ఇదే సమయంలో, భారతదేశం ప్రపంచంలోనే అతి తక్కువ కార్పొరేట్ పన్ను విధానాన్ని కలిగి ఉంది. భారతీయ బిలియనీర్ల సంపద గత ఆర్థిక సంవత్సరంలో 42% పెరిగింది. అయితే, ప్రపంచంలోని అత్యంత తిరోగమన వస్తు సేవల పన్నుద్వారా పన్నుల భారం మొత్తం భారతదేశ సామాన్య ప్రజలపై పడింది. ఈ సందర్భంలోనే 2025 బడ్జెట్‌లో మరింత సరళీకరణ, నియంత్రణ సడలింపు ప్రపంచీకరణ రూపంలో కార్పొరేట్ అనుకూల ప్రోద్భలంతో సహా "స్నేహపూర్వక పెట్టుబడి కోసం ,సులభతరం చేయడం""(ఈజ్ ఆఫ్ డూయింగ్" "ఇన్వెస్టర్-ఫ్రెండ్లీ") చర్యల శ్రేణితో పాటు పన్ను విధానాన్ని మరింత సరళీకృతం చేయాలని విధాన రూపకల్పన అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం భావించింది . విధాన రూపకల్పన అమలు కొరకు బడ్జెట్‌లో పేర్కొన్న అన్ని మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అభివృద్ధి కార్యక్రమాలు, పరిశోధన అభివృద్ధి, పట్టణాభివృద్ధి అణు ఇంధన ప్రాజెక్టుల కోసం కూడా, ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పిపిపి) పథకం అని పిలవబడే ఆశ్రిత పెట్టుబడిదారీ(క్రోనీ-పెట్టుబడిదారీ) ప్రమేయం ఈ బడ్జెట్ లో నిర్ధారించబడుతుంది. చిన్న మాడ్యులర్ రియాక్టర్ల కోసం ?20000 %=ఃణ% ఇనిషియేటివ్ ప్రైవేట్ భాగస్వామ్యంతో అణు శక్తి చట్టానికి ప్రతిపాదిత సవరణలు న్యూక్లియర్ డ్యామేజ్ చట్టానికి పౌర బాధ్యత భారతదేశాన్ని అణు విపత్తుకు గురిచేయడమే కాకుండా ఖరీదైన భారతదేశం సామ్రాజ్యవాద శక్తుల నుండి అసురక్షిత అణు వ్యర్థాలతో అణు డంపింగ్ గ్రౌండ్‌గా మారుస్తుంది. ఈ కార్పొరేట్ దాడులన్నింటిని సులభతరం చేయడానికి, 2025 బడ్జెట్, బహుళ జాతి కంపెనీలు వారి భారతీయ జూనియర్ భాగస్వాముల ప్రమేయంతో వివిధరాష్ట్రాలలో నయా ఉదారవాద కార్పొరేటీకరణను వేగవంతం చేయడానికి "పెట్టుబడి స్నేహపూర్వక సూచికను" మొదటిసారిగా ప్రతిపాదించింది. ఈ దిశలో ఒక తెలివిగల ఎత్తుగడ, బహుశా తీవ్రవాద నయా ఫాసిస్ట్ ట్రంప్‌ను శాంతింపజేయడానికి, 100% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కోసం భారతీయ బీమా రంగాన్ని సాదరంగా భేషరతుగా తెరవడం. ఇది అపఖ్యాతి పాలైన బ్లాక్ లిస్ట్ చేయబడిన అమెరికా బీమా కంపెనీల సులువుగా దేశంలో ప్రవేశానికి, దోపిడీకి నిష్క్రమణకు మార్గం సుగమం చేస్తుంది. బడ్జెట్‌లో కస్టమ్ టారిఫ్ నిర్మాణాన్ని పూర్తిగా సరళీకరించే క్రమబద్ధీకరించే ప్రణాళికతో పాటు విదేశీ వాణిజ్య రంగంలో ఏడు టారిఫ్ రేట్లను ఆకస్మికంగా తొలగించడం ట్రంపియన్ ముప్పు మరొక ప్రభావం. సహజంగానే, బడ్జెట్‌లో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ-)వంటి సరిహద్దు సాంకేతికతలపై కూడా వాక్చాతుర్యం ఉంది, దీని కోసం అమెరికా సంయుక్త రాష్ట్రాలు లేదా చైనా నుండి వచ్చిన టెక్ టైకూన్‌లపై ఆధారపడటం తప్ప భారతదేశానికి వేరే మార్గం లేదు. దీనికి సంబంధించి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం కోసం ?500 కోట్ల పెట్టుబడి ప్రతిపాదన కూడా ఉంది. క్లుప్తంగా, బడ్జెట్‌లోని వివిధ కార్పొరేట్ అనుకూల ప్రకటనలను అనుసరించి, ఆర్థిక మంత్రి తన ప్రసంగాన్ని ముగించడంతో స్టాక్ మార్కెట్ సూచీలు, సెన్సెక్స్ నిఫ్టీ రెండూ కూడా తమ ప్రారంభ ఒడిదుడుకులను తొలగించడం ప్రారంభించాయి.. అయితే, మోదీ పాలన విధేయత గల కార్పొరేట్ మీడియా వ్యాప్తి చేసిన భ్రమలకు భారత వాస్తవికతలు చాలా దూరంగా ఉన్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ నయా వలసవాద(నియోకలోనియల్) విభాగం అయిన అమెరికా వీటో అధికారం కలిగి ఉంది. భారత జాతీయ స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు 6.5% మించదని ఇప్పటికే అంచనా వేసింది. సంబంధిత వ్యక్తులకు తెలిసినట్లుగా, నయా ఉదారవాద కాలంలో ఆర్థిక లోటు లక్ష్యంతో సహా భారతదేశ బడ్జెట్ పారామితులు అంతిమంగా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఆదేశాల ప్రకారం 2003లో వాజ్‌పేయి ప్రభుత్వం ఆమోదించిన చట్టం (ఆర్థిక బాధ్యత బడ్జెట్ నిర్వహణ చట్టం) ద్వారా నిర్ణయించబడతాయి. అందుకని, 2047లో వికసిత్ భారత్‌ను సాధించడం కోసం 8% జాతీయ స్థూల ఉత్పత్తి వృద్ధిని సాధించాలనే నినాదం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ మొదలైన ఇతర వాదనలు ఉన్నప్పటికీ, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(అంచనాలకు అనుగుణంగా ఆర్థిక సర్వే జాతీయ స్థూల ఉత్పత్తి )ని పరిమితం చేయవలసి వచ్చింది. వచ్చే ఏడాది వృద్ధి రేటు 6.4 శాతానికి నిర్ణయిం చబడింది..అదే సమయంలో, ఇప్పటికే గుర్తించినట్లుగా, ప్రపంచంలోని నిరపేక్ష పేదలలో సగానికి పైగా ఉన్న భారతదేశాన్ని తరచుగా "ప్రపంచ పేదరికం కోట" అని పిలుస్తారు మోదీ పాలనలో అసమానతలు భయంకరంగా పెరిగాయి. భారత్ అసమాన భారత్ గా మారింది. 1 శాతం మంది అతి ధనవంతులు కాగా, 40 శాతానికి పైగా దేశ సంపద కలిగిఉన్నారు. ఉద్యోగం చేస్తున్న వారిలో 90% కంటే ఎక్కువ మంది అనధికారిక/అసంఘటిత రంగాలలో ఉద్యోగ హామీ, సామాజిక భద్రత కనీస వేతనాల కోసం ఎటువంటి నిబంధనలు లేనివారు గా ఉన్నారు. ఇప్పటికీ, ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో నిరుద్యోగులు ఉన్న భారతదేశం నిరుద్యోగభూమిలా ఉంది. 2025 బడ్జెట్‌లో పేర్కొన్న ?10 లక్షల కంటే ఎక్కువ కోర్ క్యాపెక్స్ - క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ (చివరి బడ్జెట్‌లో, ఇది ?11.11 లక్షల కోట్లు) ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం ఇతర మార్గాల క్రింద ప్రధానంగా డబ్బు-స్పిన్నింగ్ శీఘ్ర లాభదాయ కమైన ఊహాజనిత రంగాలకు మళ్లించబడుతుంది. ఉపాధి ఆధారిత ఉత్పాదక రంగాలను అభివృద్ధి చేయడం కోసం కాకుండా ఆశ్రిత పెట్టుబడిదారుల (క్రోనీ క్యాపిటలి స్టులు) లాభాల కోసం ఉన్నది. 'ఫాసిస్ట్ ప్రభుత్వం డబుల్ ఇంజన్' కింద బీహార్ వంటి రాష్ట్రాలకు స్పష్టమైన బొనాంజాను విస్తరించడం ద్వారా బడ్జెట్ భారతీయ సమాఖ్యవాదాన్ని అపహాస్యం చేసింది. ఖచ్చితంగా చెప్పాలంటే, నయా ఉదారవాద కార్పొరేటీకరణ తర్కంలో పనిచేసే బడ్జెట్ దాని నిబంధనలు దేశం దాని ప్రజలను ఉంచిన విష వలయాన్ని విచ్ఛిన్నం చేయలేవు.

**తెలుగుస్వేచ్ఛానుసరణ:**
**కొల్లిపర వెంకటేశ్వరరావు,9392325652.**

## సకల విద్యాప్రదాయిని

**భక్తి**



సర్వశక్తిమంతం అయిన జగదంబను వాక్కు, బుద్ధి, జ్ఞానాల స్వరూపిణిగా భావన చేస్తే... ఆ రూపమే సరస్వతీదేవి. ఆమెను ఆరాధించే గొప్ప పర్వదినం మాఘ శుద్ధ పంచమి. దీనినే 'శ్రీ పంచమి' అని కూడా అంటారు. సరస్వతీదేవిని 'జ్ఞానం దేహి స్మృతి దేహి విద్యాం విద్యాధి దేవతే ప్రతిష్ఠా, కవితాం దేహి శక్తిం శిష్య ప్రబోధితాకామ్' అని 'బ్రహ్మవైవర్త పురాణం' వర్ణించింది. "విద్యాధిదేవత అయిన సరస్వతీ దేవి జ్ఞానాన్ని, జ్ఞాపకాన్ని ప్రసాదించే తల్లి. విద్యను, ప్రతిష్టను, కవితాశక్తిని ఆమె అనుగ్రహిస్తుంది. శిష్యులను జ్ఞానవంతులుగా చేసే శక్తిని సమకూరుస్తుంది" అని భావం.

**ప్రాణశక్తి, జ్ఞాన శక్తి...**

ప్రతిభ, మేధ, శ్రద్ధ, స్ఫురణ, సాహిత్య సంగీతాది కళా నైపుణ్యాలు సరస్వతీ గుణాలు. పూర్వం గురువులు 'సరస్వతీ నమస్తుభ్యం' అంటూ ప్రార్థన చేయించిన తరువాత విద్యార్థులకు బోధన ప్రారంభించేవారు. అక్షరాభ్యాసానికి ముందు సరస్వతిని పూజించి, పలక మీద బలపంతో శివ పంచాక్షరిని రాయించే ఆనవాయితీ ఉంది. బ్రహ్మదేవుడు సరస్వతిని ఆరాధించి, జ్ఞానాన్ని పొంది... సృష్టిని ఆరంభించాడని పురాణాలు చెబుతున్నాయి. వాణి, భారతి, వీణాపాణి, విద్యావాచస్పతి, వాగ్దేవి, బుద్ధిధాత్రి, ప్రజ్ఞ... ఇలా ఆమెకు సహస్రాధికంగా పేర్లు ఉన్నాయి. లౌకికమైన విద్యలకు, పారమార్థికమైన బ్రహ్మవిద్యకు అధినేత్రి సరస్వతి. భ్రమ, బుద్ధిమాంద్యం, మతిమరపు, వాక్కులో లోపాలు తదితరాలను సమూలంగా నశింపజేస్తుంది కాబట్టి 'నిశ్శేష జాడ్యాపహా' అని సరస్వతీదేవిని వర్ణించారు. వేదాల్లో సరస్వతీ సూక్తాలు ఉన్నాయి. ప్రాణ శక్తిగా, జ్ఞానశక్తిగా పూర్వులు సరస్వతిని ఆరాధించారు. 'యా బ్రహ్మాచ్యుత శంకరః ప్రభృతిభిః దేవై సదా పూజితా..' సరస్వతీ దేవిని సర్వ దేవతలూ పూజిస్తారు.

**నాటి వ్యాసపురి... నేటి బాసర**

పురాణ గ్రంథాల ప్రకారం... వాల్మీకి మహర్షి... సరస్వతిని ఉపాసించి రామాయణ మహా కావ్య రచన చేశాడు. ఆ బాటలోనే వ్యాస మునీంద్రుడు కూడా నడచి వేదవిభజన చేశాడు. పురాణాలను ఆవిష్కరించి, మహా భారత, భాగవత, బ్రహ్మసూత్రాది రచనలు చేసి... భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి ఆచార్యుడు అయ్యాడు. సరస్వతీ దేవిని సాక్షాత్కరించుకున్న వ్యాసుడు ఆ తల్లి ఆజ్ఞపై పరమ పావన గోదావరీ తీరంలోని వాసర క్షేత్రంలో ఆమెను సైకత మూర్తిగా ప్రతిష్ఠించాడు. ఆ రోజు మాఘ శుద్ధ పంచమి అనీ 'దేవీ భాగవతం' తదితర గ్రంథాలు పేర్కొంటున్నాయి వ్యాసపురిగా ప్రసిద్ధి చెందిన ఆ క్షేత్రం అనంతర కాలంలో 'బాసర'గా ప్రాచుర్యం పొందింది. సరస్వతీ కృపతోనే అపారమైన తత్త్వ విజ్ఞానాన్ని పొందానని చెప్పిన ఆది శంకరులు శృంగేరిలో శారదామాతను ప్రతిష్ఠించి, ఆరాధించారు. యాజ్ఞవల్క్యుడు గురు శాపం కారణంగా అభ్యసించిన విద్యలన్నిటినీ కోల్పోయాడు. సూర్యుడి సూచనల మేరకు సరస్వతిని ఉపాసించి ఆమె కరుణను పొందాడు. మళ్ళీ విద్వాంసుడయ్యాడు.

మాఘ శుద్ధ పంచమి రోజున జన్మించిన సరస్వతీ దేవి తెలుపు వర్ణంలో వెలుగులీనుతూ ఉంటుంది. ఆమెకు ఇష్టమైన రంగు తెలుపు. తెల్లని పద్మం ఆమె పీఠం. హంస ఆమె వాహనం. తెల్లని పుష్పాలు ఆమెకు ఇష్టం. తెల్ల రంగు వస్త్రాలతో ఆమెను అలంకరించి, పూజించి, తెల్లని పాయసాన్ని నివేదిస్తే అనుగ్రహిస్తుందని పెద్దలు చెప్పారు. పుస్తక ధారిణి అయిన సరస్వతిని పుస్తక రూపంలోనూ పూజించవచ్చు. గాయత్రిగా, సావిత్రిగా, పరాశక్తిగా శ్రుతులు పేర్కొన్న సరస్వతిని శ్రీపంచమినాడు భక్తితో అర్చిస్తే సర్వ శుభాలు చేకూరుతానేది పెద్దల మాట.

పాలలో నీరు కలిపిందీ లేనిదీ సులభంగా గుర్తించవచ్చు. ఏటవాలుగా ఉన్న ప్రదేశంపై పాల చుక్క వేయాలి. అది మెల్లగా కదులుతూ తెల్లని గీతని వదిలితే అవి స్వచ్ఛమైన పాలని చెప్పవచ్చు. అదే పాల చుక్క వేగంగా కిందికి జారితే నీళ్లు కలిపినట్లే!అరగ్లాసు పాలలో అరగ్లాసు నీళ్లు పోసి వేగంగా కలపాలి. ఇలా కలుపుతున్నప్పుడు దట్టంగా నురుగు కనిపిస్తే పాలలో వాషింగ్ పౌడర్ లేదా డిటర్జెంట్ పౌండర్ కలిపినట్లు గుర్తించవచ్చు.అరగ్లాసు పాలలో రెండు చెంచాల అయోడైజ్డ్ ఉప్పు వేసి బాగా కలపాలి. పాలు నీలం రంగులోకి మారితే అందులో మైదా లేదంటే వేరే ఏదైనా పిండిని కలిపినట్లు తెలుసుకోవచ్చు.%పావు గ్లాసు నీళ్లను బాగా వేడి చేసి అందులో అయిదు చుక్కల టించర్ అయోడిన్



## పాలలో కల్తీని ఇలా గుర్తించండి!

కలపాలి. ఈ నీళ్లను పావు గ్లాసు పాలలో కలపాలి. వెంటనే పాలు నీలం రంగులోకి మారినట్లయితే గంజి పొడి కలిపినట్లు తెలుసుకోవచ్చు.పావు గ్లాసు పాలలో ఒక చెంచా సోయాబీన్ పొడిని కలపాలి. దీనిలో ఎరుపు రంగు లిట్మస్ పేపర్‌ను ఉంచి పరీక్షించాలి. అది నీలం రంగులోకి మారినట్లయితే పాలలో యూరియా కలిపినట్లు గుర్తించవచ్చు.బజార్లో దొరికే పీహెచ్ పట్టీని తీసుకు వచ్చి దానిపై ఒక పాల చుక్క వేయాలి. పీహెచ్ నిష్పత్తి 6.4 నుంచి 6.6 మధ్య ఉంటే ఆ పాలు స్వచ్ఛమైనవని చెప్పవచ్చు. అంతకన్నా ఎక్కువ లేదా తక్కువ ఉన్నట్లయితే పాలలో కల్తీ జరిగిందని గుర్తించాలి.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 హైదరాబాద్ మంగళవారం 04 ఫిబ్రవరి 2025


# పట్టు చీరలు ఇలా పదిలం...



**పట్టుచీరని ఒకసారి కట్టుకుని విడిచిన తరవాత దానికి బాగా గాలి తగిలేలా ఆరేయాలి. తేమ, చల్లదనం లేకుండా పొడిగా ఆరిన తరవాతనే మడత పెట్టి భద్రపరచాలి. నాలుగైదుసార్లు కట్టుకున్న తరవాత చీరని డ్రైక్లీనింగ్ చేయించవచ్చు. దీనివల్ల పట్టు చీర మెరుపు పోకుండా ఉంటుంది.**



చీర మీద చిన్న మరకలు లేదా మురికి అంటితే అక్కడ మాత్రమే..... నీళ్లతో తడిపిన దూదితో తుడవాలి. కొద్దిగా గ్లిజరిన్ రాసి పలుచని బట్టతో తుడిచినా మరకలు పోతాయి.

పట్టు చీరని శుభ్రం చేయాలనుకుంటే మొదటిసారి మాత్రం డ్రైక్లీనింగ్ చేయించాలి. తరవాత తగిన జాగ్రత్తలు తీసుకుంటూ నీళ్లలో ముంచి ఉతకవచ్చు. నీళ్లలో కొద్ది మోతాదులో బేబీ షాంపూని మాత్రమే కలపాలి. డిటర్జెంట్, సర్ఫ్ కలపకూడదు. చీరని నీళ్లలో ఎక్కువసేపు నాననివ్వకూడదు. చేతులతో గట్టిగా పిండకూడదు.

చీర కొనను నీళ్లలో ముంచి వేళ్లతో పిండి రంగు పోతున్నదీ లేనిదీ పరిశీలించాలి. రంగు వదులుతున్నట్లయితే ఒక బకెట్ నీళ్లలో పది చుక్కల నిమ్మరసం కలిపి అందులో చీర ముంచి వెంటనే తీసి నీడలో ఆరవేయాలి.

చీరని ఇస్త్రీ చేసేముందు దానిపై కొన్ని నీటి చుక్కలు చల్లితే ముడతలు తొంతరగా పోతాయి. పట్టుచీరని నేరుగా ఇస్త్రీ చేయకూడదు. చీరపై నూలు దుపట్టా లేదా పరిశుభ్రమైన తువాలు పరిచి దానిమీద ఇస్త్రీ చేయాలి. దీనివల్ల ఇస్త్రీ పెట్టె వేడికి జరీ నల్లబడకుండా ఉంటుంది.

పట్టుచీరని చక్కగా మడతపెట్టి సన్నని నూలు వస్త్రం లేదా తెల్లని కాగితంలో చుట్టి అలమరాలో పెట్టుకోవాలి. కనీసం మూడు నెలలకు ఒకసారైనా చీర మడతలను మార్చాలి. లేకుంటే మడతలపై చిరుగులు వస్తాయి.

పట్టుచీరలను అలమరాలో సర్దిన తరవాత వాటి మధ్యలో కలరా ఉండలు లేదంటే ఫ్యాబ్రిక్ ఫ్రెషనర్స్‌ను ఉంచాలి. దీనివల్ల పురుగులు చేరకుండా ఉంటాయి. గంధపు చెక్కను పలుచని గుడ్డలో చుట్టి పెడితే చీరలకు తేమ చేరకుండా





ఉంటుంది. వాటికి మంచి సువాసన కూడా పడుతుంది.

పట్టుచీర మీద దగ్గరనుంచి పెర్ఫ్యూమ్‌ని స్ప్రే చేయకూడదు. దానిలోని రసాయనాల వల్ల జరీ పోగులు పాడయ్యే అవకాశం ఉంది. కాబట్టి ఒక అడుగు దూరంలో ఉండి స్ప్రే చేయడం మంచిది.

# ఆరోగ్యానికి భరోసానిచ్చే అరటిపండు.. కొందరికి చేటుచేస్తుందని తెలుసా?



అనేక పోషకాలతో నిండిన అరటిపండు.. ఆరోగ్యానికి భరోసా ఇస్తుంది. వివిధ దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షిస్తుంది. ఎనర్జీ బూస్టర్‌గానూ పనిచేస్తుంది. దీనిని రోజూ తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. అరటిపండు పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ బి6, ఫాస్ఫరస్ వంటి విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉంటుంది. జీర్ణశక్తిని బలోపేతం చేయడంతోపాటు ఎముకల బలానికీ, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలోనూ ముందు ఉంటుంది. బరువుతోపాటు రక్తంలో చక్కెరనూ నియంత్రణలో ఉంచుతుంది. అయితే.. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న అరటిపండు.. కొందరికి అనారోగ్యాలను తెచ్చిపెడుతుంది.

అలర్జీలు, శ్వాసకోశ సమస్యలు, ఆస్తమా బాధితులూ.. అరటిపండుకు దూరంగా ఉంటేనే మంచిది. అలాంటివారు అరటిపండు తింటే.. అలర్జీ రియాక్షన్స్ ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది.

మలబద్ధకం, గ్యాస్ సమస్యలు ఉన్నవారు కూడా అరటిపండును మితంగానే తీసుకోవాలి. ఎక్కువగా తింటే.. మలబద్ధకం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. అంతేకాకుండా కడుపునొప్పి, గ్యాస్ సమస్యలు, కడుపుబ్బరం వంటి సమస్యలు వచ్చే అవకాశమూ ఉంది.

కిడ్నీ సమస్యలతో బాధపడేవారు అరటిపండును ఎక్కువగా తినకూడదు. ఇందులో పొటాషియం అధికంగా లభిస్తుంది. దీన్ని ఎక్కువగా తీసుకుంటే.. మూత్రపిండాలకు పొటాషియాన్ని విసర్జించడం కష్టమైపోతుంది.

అరటిపండులో ఉండే పొటాషియం.. బీపీ బాధితులకు చేటు చేస్తుంది. అధిక రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారు ఈ పండును తినకుంటేనే మంచిది.

అధిక బరువుతో బాధపడేవారు, బరువు తగ్గుదామని అనుకునేవారు కూడా అరటిపండును ఎక్కువగా తినకూడదు. అరటిపండులో ఫ్రక్టోజ్ ఎక్కువ. దీంతో.. రక్తంలో చక్కెర స్థాయులు పెరుగుతాయి. అవి కొవ్వుగా మారి.. మరింత బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది.

అరటిపండులో చక్కెర శాతం ఎక్కువ. అందువల్ల.. మధుమేహ రోగులకు ఇది అంతగా మేలు చేయదు. కాబట్టి, డయాబెటిస్ సమస్యలు ఉన్నవారు దీన్ని పక్కనపెట్టడమే మంచిది.

# టీ జాలీని ఇలా శుభ్రం చేయాలి!



ఒక గిన్నెలో ఒక గ్లాసు వేడినీళ్లు పోయాలి. ఇందులో రెండు చెంచాల వెనిగర్ లేదా బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. ఈ నీళ్లలో టీ జాలీని మునిగేలా ఉంచాలి. అరగంట తరవాత స్క్రబ్బర్‌తో రుద్ది కడిగేస్తే జాలీ పూర్తిగా శుభ్రమవుతుంది.

టీ జాలీని ముందుగా నిమ్మచెక్కతో రుద్దాలి. పది నిమిషాల తరవాత పాత్రలు కడిగే లిక్విడ్ సోప్ పట్టించి తోమితే జాలీ తెల్లగా మెరుస్తుంది.

ఒక గిన్నెలో కొన్ని వేడి నీళ్లు పోయాలి. ఒక చెంచా బేకింగ్ పౌడర్, ఒక చెంచాడు పాత్రలు కడిగే లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. ఈ నీళ్లలో జాలీని ముంచి పదిహేను నిమిషాలు నానబెట్టాలి. తరవాత బ్రష్‌తో రుద్ది కడిగితే జాలీ కొత్తదానిలా మెరుస్తుంది.

టీ వడబోసిన తరవాత వెంటనే జాలీని పంపు నీళ్ల ధార కింద పెట్టి శుభ్రం చేయాలి. దీనివల్ల జాలీ ఎక్కువకాలం మన్నుతుంది.స్టవ్‌ను వెలిగించి బర్నర్ మీద జాలీని ఉంచి వేడి చేయాలి. దీనివల్ల జాలీలో ఇరుక్కున్న టీ పొడి అవశేషాలన్నీ కాలి రాలిపోతాయి. చల్లారిన తరవాత స్క్రబ్బర్‌తో రుద్ది కడిగితే జాలీ శుభ్రపడుతుంది.ఒక గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ పౌడర్ వేసి ఒక చెంచా నీళ్లు చిలకరిస్తూ బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జాలీ అంతటా పట్టించాలి. టూత్ బ్రష్‌తో రుద్ది ఆరనివ్వాలి. తరవాత జాలీ మీద రెండు చెంచాల వెనిగర్‌ను చల్లాలి. అయిదు నిమిషాల తరవాత స్క్రబ్బర్‌తో రుద్ది కడిగేస్తే జాలీ తెల్లగా మెరుస్తుంది.

# మీ ఆభరణాలు నల్లగా మారాయా.. ఈ చిట్కాలతో వాటిని మెరిసేలా చేయండి..



చాలా మంది అమ్మాయిలు ఆభరణాలను ధరించడానికి ఇష్టపడతారు. ఫంక్షన్ ఏదైనా సరే తాము ధరించే ఆభరణాలతో స్పెషల్‌గా కనిపించాలని ఎన్ని షాప్స్ అయినా సరే తిరిగి నచ్చిన వాటిని తీసుకుంటారు. అయితే, ఎంతో ఇష్టంగా ఆభరణాలు కొన్నప్పటికి కొంతకాలానికి అవి నల్లగా మారిపోతాయి. ఇది ఇబ్బందికి కారణం అవుతుంది. అయితే, మీ ఆభరణాలు కూడా నల్లగా మారాయా? మీరు చింతించాల్సిన అవసరం లేదు. కొన్ని సులభమైన చిట్కాలతో మీ ఆభరణాలను కొత్తగా కనిపించేలా చేయవచ్చు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

**బేకింగ్ సోడా..**

ఆభరణాలు కొత్తవిగా కనిపించడానికి మీరు బేకింగ్ సోడా ఉపయోగించవచ్చు. దీని కోసం, మీరు ఒక చిన్న గిన్నెలో బేకింగ్ సోడా తీసుకొని దానిలో కొంచెం నీరు వేసి పేస్ట్‌లా సిద్ధం చేసుకోవాలి. పాత టూత్ బ్రష్ లేదా మెత్తని గుడ్డ సహాయంతో, ఈ పేస్ట్‌ను అప్లై చేసి ఆభరణాలపై సున్నితంగా రుద్దాలి. కొంత సమయం తర్వాత ఆభరణాలను శుభ్రమైన నీటితో కడగాలి.

**వెనిగర్..**

వెనిగర్, నీటిని సమాన పరిమాణంలో తీసుకొని పేస్ట్ సిద్ధం చేయాలి. ఈ పేస్ట్‌ను పాత టూత్ బ్రష్‌పై అప్లై చేసి ఆభరణాలపై 5 నుంచి 10 నిమిషాల పాటు రుద్దాలి. దీని తర్వాత మీరు శుభ్రమైన నీటితో వాటిని కడగాలి. నీటితో కడిగిన తర్వాత, శుభ్రమైన గుడ్డ సహాయంతో ఆభరణాలను తుడవండి. సరిగ్గా శుభ్రం చేసినప్పుడు తేడాను మీరే చూడవచ్చు.

**టూత్‌పేస్ట్..**

పాత టూత్ బ్రష్‌పై కొద్దిగా టూత్‌పేస్ట్ రాసి ఆభరణాలపై సున్నితంగా రుద్దండి. కొంత సమయం తర్వాత ఆభరణాలను నీటితో కడగాలి. తర్వాత శుభ్రమైన గుడ్డ తీసుకొని నగలను తుడవండి.

**డిష్ వాష్ లిక్విడ్**

ఆభరణాలు కొత్తవిగా కనిపించడానికి మీరు డిష్ వాష్ లిక్విడ్ కూడా ఉపయోగించవచ్చు. దీని కోసం, మీరు డిష్ వాష్ లిక్విడ్‌లో మెత్తని గుడ్డను ముంచి ఆభరణాలపై తేలికగా రుద్దాలి. ఇలా చేయడం వల్ల ఆభరణాల నలుపు పోయి కొత్తదనం వస్తుంది.

**ఈ విషయాలను గుర్తుంచుకోండి**

ఆభరణాలను శుభ్రపరిచేటప్పుడు మీరు కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. ఎల్లప్పుడూ తడిగా ఉన్న బ్రష్‌ని ఉపయోగించడం, కఠినమైన రసాయనాలను నివారించడం, మృదువైన వస్త్రాన్ని ఉపయోగించడం, ఆభరణాలను ఎక్కువగా రుద్దడం వంటివి చేయవద్దు. పై చిట్కాల సహాయంతో, మీరు ఆభరణాల నల్లదనాన్ని సులభంగా తొలగించి, కొత్తదిగా చేసుకోవచ్చు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
6 | హైదరాబాద్
మంగళవారం
04 । ఫిబ్రవరి । 2025






# భారీ నష్టాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు.. టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..



**న్యూఢిల్లీ- నవభూమి:**అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ నేపథ్యంలో దేశీయ సూచీలు సోమవారం ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఈ వారంలో 5,6 తేదీలలో ఆర్బీఐ ద్రవ్యపరపతి మీటింగ్ జరగనుంది. కీలక వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. ఆదాయపు పన్ను తగ్గింపు కారణంగా ఎఫ్ఎమ్‌సీజీ, బడ్జెట్ కేటాయింపుల వల్ల వ్యవసాయ ఆధారిత స్టాక్స్ మాత్రమే లాభాల్లో కొనసాగుతున్నాయి.
శనివారం ముగింపు (77, 505)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం 500 పాయింట్లకు పైగా నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో దాదాపు 750 పాయింట్లు కోల్పోయి 76, 756 వద్ద కనిష్టానికి చేరుకుంది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో 672 పాయింట్లు కోల్పోయి 76, 833 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదులుతోంది. ప్రస్తుతం 239 పాయింట్ల నష్టంతో 23, 243 వద్ద కొనసాగుతోంది.సెన్సెక్స్‌లో పీఐ ఇండస్ట్రీస్, నైకా, యూపీఎల్, టీవీఎస్ మోటార్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. హుడ్కో, మదర్సన్, సైమన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు భారీ నష్టాల్లో ఉన్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 725 పాయింట్ల నష్టాంతో కొనసాగుతోంది. బ్యాంక్ నిఫ్టీ 479 పాయింట్ల నష్టంతో ఉంది.

# ఇక జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ !




**న్యూఢిల్లీ- నవభూమి:**జీఎసటీ రేట్లనీ హేతుబద్ధీకరించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభమైనట్లు అధికార వర్గాలు చెప్పాయి. రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన మంత్రుల బృందం (జీఓఎం) దీనిపై ఇప్పటికే కసరత్తు చేస్తోంది. తాజా కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ.12 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉండే వ్యక్తులకు పూర్తి పన్ను మినహాయింపు ప్రకటించారు. దాంతో పాటు వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుల భారం తగ్గేలా పన్నుల శ్లాబులనీ సవరించారు. జీఎసటీ రేట్ల హేతుబద్ధీకరణ విషయంలోనూ ఇదే పద్ధతి అనుసరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలను కూడా కలుపుకోవాలని యోచిస్తున్నట్టు భావిస్తున్నారు. త్వరలో జరిగే జీఎస్‌టీ మండలి సమావేశం ఇందుకు వేదిక అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల జీఎసటీ ఆదాయాలకు గండి పడకుండా, మధ్య తరగతి ప్రజలపై పన్ను పోటు తగ్గేలా ఈ హేతుబద్ధీకరణ ఉండాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

# అదే జరిగితే.. మీ ఆదాయం రూ.12 లక్షలోపు ఉన్నా.. 20 శాతం ట్యాక్స్ కట్టాలి తెలుసా?




**న్యూఢిల్లీ- నవభూమి:**ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలకు భారీ ఉపశమనం కల్పిస్తూ వ్యక్తిగత ఆదాయపు పన్ను మినహాయింపును రూ.12 లక్షలకు పెంచింది కేంద్రం. ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఈ మేరకు ప్రకటన చేశారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. ఇది కొత్త పన్ను విధానానికి వర్తిస్తుందని చెప్పారు. సెక్షన్ 87ఏ కింద రిబేట్ రూ.60 వేలకు పెంచారు. అయితే, మీ ఆదాయంలో స్పెషల్ రేట్ ఇన్‌కమ్ ఉంటే మీకు సెక్షన్ 87ఏ వర్తించదు. దీంతో మీ ఆదాయం రూ.12 లక్షల లోపు ఉన్నా మీరు భారీగా ట్యాక్స్ చెల్లించాల్సి వస్తుంది.ఈ విషయంపై బడ్జెట్ 2025లోనే క్లారిటీ ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం. స్పెషల్ రేట్ ఆదాయంపై ఎలాంటి ట్యాక్స్ రిబేట్ రాదని తెలిపింది. స్పెషల్ ట్యాక్స్ రేట్ ఆదాయంలో సెక్షన్ 111ఏలోని స్వల్ప కాలిక మూలధన లాభాలు, సెక్షన్ 112లోని దీర్ఘకాలిక మూలధన లాభాల వంటివి ఉంటాయి. దీనిని మనం ఒక ఉదాహరణతో అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం. మీ ఆదాయం మొత్తం రూ.12 లక్షలు ఉందని అనుకుందాం. అందులో మీకు శాలరీ ద్వారా రూ.8 లక్షలు వస్తుందని అనుకుందాం. మిగిలిన రూ.4 లక్షల ఆదాయం ఈక్విటీ షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ వంటి షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ద్వారా వస్తుందని అనుకుందాం. అప్పుడు మీకు కేవలం రూ.8 లక్షలకే సెక్షన్ 87ఏ ట్యాక్స్ రిబేట్ వర్తిస్తుంది. షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ఇన్‌కమ్ రూ.4 లక్షలకు రిబేట్ వర్తించదు. దీనిపై మీరు ట్యాక్స్ చెల్లించాల్సి వస్తుంది.
వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త పన్ను విధానంలో కొత్త మార్పులు అమలులోకి వస్తాయి. సెక్షన్ 87ఏ రిబేట్ ద్వారా మీ రూ.8 లక్షల శాలరీపై ఎలాంటి ట్యాక్స్ పడదు. అయితే, రూ.4 లక్షల షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై ట్యాక్స్ పడుతుంది. క్యాపిటల్ గెయిన్స్‌పై స్పెషల్ రేట్ 20 శాతం ఉంటుంది. అప్పుడు మీ మొత్తం ట్యాక్స్ రూ.80 వేలు అవుతుంది. అంటే మీ శాలరీతో పాటు మీరు మూలధన లాభాలు అందుకున్నప్పుడు రిబేట్ రాదు. దీంతో దానిపై ట్యాక్స్ చెల్లించాల్సి వస్తుంది.మరోవైపు.. మీకు లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్ ద్వారా రూ.4 లక్షల వస్తుంటే అందులోంచి రూ.1.25 లక్షలకు పన్ను మినహాయింపు ఉంటుంది. మిగిలిన రూ.2.75 లక్షలపై 12.5 శాతం చొప్పున ట్యాక్స్ కట్టాల్సి వస్తుంది. అంటే లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పై రూ.34,375 ట్యాక్స్ పడుతుంది. ఈ విషయం తెలియకుండా రూ.12 లక్షలలోపే ఉంది కదా అని ఆదమరిచి ఉంటే ఐటీ నోటీసులు వస్తాయి. కొన్నిసార్లు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది.

# ఉద్యోగులకు కేంద్రం షాక్.. 8వ వేతన సంఘం ఆలస్యం.. ఎందుకంటే?




**న్యూఢిల్లీ- నవభూమి:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతో ఆశగా ఎదురుచూసి నిరాశకు గురయ్యారు. ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త పే కమిషన్‌కి సంబంధించిన రోడ్ మ్యాప్‌పై కీలక ప్రకటన చేస్తారని భావించారు. కానీ, బడ్జెట్‌లో 8వ వేతన సంఘం ఊసేఎత్తలేదు. దీంతో సుమారు 1.20 కోట్ల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నిరాశ ఎదురైందని చెప్పవచ్చు. బడ్జెట్‌కు ముందే 8వ పే కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు మోదీ ప్రభుత్వం ప్రకటించడంతో బడ్జెట్లో ప్రకటన చేస్తారని భారీ అంచనాలు ఉండేవి. కానీ, అలా జరగలేదు. దీంతో కొత్త పే కమిషన్ అమలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.బడ్జెట్‌కి ముందే 8వ వేతన సంఘం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మోదీ కేబినెట్ త్వరలోనే ఇద్దరు సభ్యులు, ఒక ఛైర్మన్‌తో ప్యానల్ ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఈ ప్యానల్ వచ్చే ఏడాది తొలినాళ్లలోనే నివేదిక సమర్పించే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న 7వ వేతన సంఘం ఈ ఏడాది డిసెంబర్ 31, 2025తో ముగియనుంది. దీంతో జనవరి 1, 2026 నుంచే కొత్త వేతన సంఘం అమలు చేస్తారని ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే, బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయకపోడవడం, కనీసం రోడ్ మ్యాప్ కూడా ప్రకటించకపోవడంపై ఉద్యోగులు అయోమయంలో పడ్డారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయకపోవడంతో ఆ తర్వాత బడ్జెట్ 2026-27లో ఉంటాయని తెలుస్తోంది. ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల పెరుగుతాయి కాబట్టి బడ్జెట్ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలోనే ఈసారి ఎలాంటి బడ్జెట్ కేటాయింపులు చేయలేదని తెలుస్తోంది. 8వ వేతన సంఘం కోసం ఏర్పటయ్యే ప్యానల్ రిపోర్ట్ తయారు చేసేందుకు కనీసం ఏడాది తీసుకునే అవకాశం ఉంది. దీంతో అప్పటి వ్యయ అంచనాల ప్రకారం ఆ తర్వాత బడ్జెట్‌లో కేటాయింపులు చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. 7వ వేతన సంఘం అమలు కోసం ఏర్పాటు చేసిన కమిషన్ ఏడాదికిపైగా సమయం తీసుకుంది. ఇప్పుడు 8వ వేతన సంఘం కోసం ప్యానల్ మార్చి, 2025 నాటికి ఏర్పాటు చేసినా నివేదిక సమర్పించేందుకు కనీసం ఏడాది కాలం పడుతుందని అంచనా వేయవచ్చు. దీంతో కమిషన్ రిపోర్ట్ మార్చి, 2026 తర్వాతే రావచ్చని తెలుస్తోంది. అ తర్వాతే ఉద్యోగులు జీతాల పెంపుపై నిర్ణయం వెలువడుతుంది. దీంతో జనవరి 1, 2026 నుంచి 8వ వేతన సంఘం అమలు దాదాపుగా ఉండకపోవచ్చని

# కార్ లోన్లపై ఏ బ్యాంకులో వడ్డీ రేట్లు ఎలా? రూ. లక్షకు నెలకు ఈఎంఐ ఎంత కట్టాలి..?




**న్యూఢిల్లీ- నవభూమి:** ఇటీవలి కాలంలో మన దేశంలో కార్లు కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగిపోయిందని చెప్పొచ్చు. ఎలా అయినా కారు కొనాలనేది కొందరికి అవసరం అయితే.. ఇంకొందరికి లక్ష్యంగా ఉంటుంది. ఇప్పుడు మార్కెట్లో ఏ ఆదాయ వర్గానికి సరిపడా అలా అని వివిధ రకాల మోడళ్ల కార్లు అందుబాటులో ఉన్నాయి. దాదాపుగా అన్ని బ్యాంకులు ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు విరివిగా కార్ లోన్లు ఇవ్వడం వల్ల కూడా కార్లు కొనే వారి సంఖ్య పెరిగిపోయింది. ఎక్కడైనా లోన్ విషయానికి వస్తే క్రెడిట్ స్కోరు కీలక పాత్ర పోషిస్తుందని చెప్పొచ్చు. సాధారణంగానే క్రెడిట్ స్కోరు 700 కంటే ఎక్కువగా ఉంటే లోన్ పొందే సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని చెప్పొచ్చు.అయితే క్రెడిట్ స్కోరు 750, అంతకంటే ఎక్కువ ఉన్న వారికి లోన్ వడ్డీ రేట్లు కాస్త తక్కువే ఉంటాయి. ఇక లోన్ కాలవ్యవధి 7 సంవత్సరాల వరకు ఉంటుంది. చాలా బ్యాంకులు సాధారణంగా కారు ఆన్- రోడ్ ధరలో 80 నుంచి 90 శాతం వరకు లోన్ ఇస్తుంటాయి. కొన్ని బ్యాంకులైతే కారు విలువపైన 100 శాతం వరకు కూడా ఫైనాన్సింగ్ ఇస్తుంటాయి. అయితే లోన్ వడ్డీ రేట్లు బ్యాంకుల్ని బట్టి మారుతుంటాయి. ఒక్కో దాంట్లో ఒక్కో విధంగా ఉంటాయని చెప్పొచ్చు.అందుకే బ్యాంకుల్లో లోన్ తీసుకునే ముందు వడ్డీ రేట్లతో పాటుగా ప్రాసెసింగ్ ఫీజులు, రీపేమెంట్ ఛార్జీలు, ఇతర ఛార్జీల గురించి తెలుసుకోవాలి. ఇప్పుడు కార్ లోన్లపై వడ్డీ రేట్లు ఏ బ్యాంకులో ఏ విధంగా ఉన్నాయి. ఇంకా ప్రతి రూ. లక్ష లోన్‌పై 7 సంవత్సరాల వ్యవధికి ఈఎంఐ ఎలా ఉందో తెలుసుకుందాం.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 9.10 శాతం నుంచి వడ్డీ రేట్లు ప్రారంభం అవుతున్నాయి. ఇక్కడ ప్రతి రూ. లక్ష లోన్‌పై రూ. 1614 ఈఎంఐ పడుతుంది. ఐసీఐసీఐ బ్యాంకులో కూడా 9.10 శాతం నుంచే ప్రారంభం అవుతున్నాయి. ఇక్కడ కూడా ఈఎంఐ రూ. 1614 గా ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో వడ్డీ రేట్లు 9.40 శాతం నుంచి మొదలవుతున్నాయి. ఇక్కడ ఈఎంఐ రూ. 1629గా ఉంది. యాక్సిస్ బ్యాంకులో 9.30 శాతం నుంచి వడ్డీ రేట్లు షురూ అవుతున్నాయి. ఇక్కడ కూడా 9.30 శాతం వడ్డీ రేట్లు ఉండగా.. ఈఎంఐ రూ. 1624గా ఉంది.కోటక్ మహీంద్రా బ్యాంకులో 7.70 శాతం నుంచి వడ్డీ రేట్లు మొదలవుతున్నాయి. ఇక్కడ ఈఎంఐ రూ. 1544 గా ఉంది. కెనరా బ్యాంకు 8.70 శాతం నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఇక్కడ ఈఎంఐ రూ. 1594 గా ఉంది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, యూనియన్ బ్యాంకులో వడ్డీ రేట్లు రేట్లు 8.70 శాతంగానే ఉన్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకులో 8.75 శాతం నుంచి వడ్డీ రేట్లు ప్రారంభమవుతున్నాయి. ఈఎంఐ రూ. 1596 గా ఉంది.

# సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ రద్దు? మోదీ సర్కార్ షాక్.. డిస్కౌంట్లో తక్కువ ధరకే బంగారానికి చెక్!



**న్యూఢిల్లీ- నవభూమి:** కేంద్ర ప్రభుత్వం నుంచి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్న అద్భుత పథకాల్లో సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ గురించి ప్రధానంగా మాట్లాడుకుంటాం. ఇక్కడ బంగారం కొనుగోళ్లు తగ్గించి.. పెట్టుబడులు పెట్టేందుకు ఉద్దేశించిన స్కీమ్. ఆన్‌లైన్‌లోనే బంగారంపై ఇక్కడ ఇన్వెస్ట్ చేస్తే.. బంగారం ధర పెరిగితే దానికి తగ్గట్లుగా ప్రతిఫలం వస్తుంది. కేంద్ర ప్రభుత్వం తరఫున రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గోల్డ్ బాండ్లు జారీ చేస్తుంటుంది. అయితే ఒకప్పుడు నెలకు కొన్ని గోల్డ్ బాండ్లు జారీ చేసేది. తర్వాత ప్రతి నెలకు ఒక ట్రాంచి విడుదల చేస్తూ వచ్చింది. ఆ తర్వాత.. ఇక ప్రతి త్రైమాసికానికి ఒకసారి చొప్పున .. మొత్తం ఆర్థిక సంవత్సరంలో నాలుగు గోల్డ్ బాండ్ ట్రాంచీల్ని జారీ చేస్తూ వచ్చింది.అయితే గత కొంతకాలంగా.. అంటే గతేడాది ఫిబ్రవరి నుంచి కొత్తగా ఎలాంటి గోల్డ్ బాండ్లను కేంద్రం జారీ చేయలేదు. అంటే ఈ ఆర్థిక సంవత్సరంలో (2024-25) ఈ గోల్డ్ బాండ్ల ఊసే లేదు. కేంద్రం కూడా ఈ పథకంపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. గతేడాది మధ్యంతర బడ్జెట్ సమయంలో.. బంగారంపై దిగుమతుల సుంకం తగ్గించగా.. గోల్డ్ రేట్లు భారీగా దిగొచ్చాయి. అప్పుడు ప్రతిఫలం తగ్గి.. డిమాండ్ తగ్గుతుందన్న క్రమంలో ఈ స్కీమ్ రద్దు చేస్తారని వాదనలు వినిపించినా అధికారిక ప్రకటన రాలేదు.
ఇప్పుడు మాత్రం ఈ స్కీమ్‌కు కేంద్ర ప్రభుత్వం చరమగీతం పాడినట్లే తెలుస్తోంది. తాజాగా 2025-26 బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టిన తర్వాత.. మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలిచ్చారు. 'ఈ బడ్జెట్‌లో సావరిన్ గోల్డ్ బాండ్ల గురించి ఏం ప్రస్తావించలేదు. గత కొన్ని త్రైమాసికాలుగా ఎలాంటి కొత్త ట్రాంచీల్ని కూడా ఇష్యూ చేయలేదు. ఇది స్కీమ్ ముగింపునకు సంకేతంగా భావించవచ్చా?' అని ఒక రిపోర్టర్ ప్రశ్నించగా.. దానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'యెస్, ఇన్ ఏ వే (ఒక విధంగా అవును)' అని సమాధానం ఇచ్చారు. దీనిపై ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి అజయ్ సేథ్ మాట్లాడతారని ఆమె చెప్పారు.అప్పుడు సేథ్ కూడా గోల్డ్ బాండ్ స్కీమ్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వానికి ఈ పథకం ఆర్థికంగా భారంగా మారిందని.. అందుకే కొంతకాలంగా కొత్త ట్రాంచీలు కూడా జారీ చేయట్లేదని స్పష్టం చేశారు. అయితే.. స్కీమ్ రద్దు గురించి అధికారికంగా నిర్ణయం తీసుకుంటే చెబుతామని అన్నారు.ఇక దీనికి బలం చేకూర్చేలా బడ్జెట్‌లో ఈ పథకానికి కేటాయింపులు కూడా తగ్గించడం గమనార్హం. గతేడాది మధ్యంతర బడ్జెట్‌లో ఈ స్కీమ్ కోసం రూ. 26,852 కోట్లు కేటాయించగా.. ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్లో కూడా రూ. 18,500 కోట్లే కేటాయించింది. చివరిసారిగా 2023 ఫిబ్రవరిలో గోల్డ్ బాండ్లను ఆర్బీఐ జారీ చేయగా.. రూ. 8008 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేశారు. ఇక ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు.. గతంలో బాండ్లను కొనుగోలు చేసిన వారికి మెచ్యూరిటీ సమయంలో ఇచ్చేందుకేనని అనుకోవచ్చు.గోల్డ్ బాండ్ స్కీమ్ కింద కనీసం గ్రాము నుంచి గోల్డ్ కొని ఇన్వెస్ట్ చేయొచ్చు. గ్రామును యూనిట్‌గా పేర్కొంటారు. సాధారణ ప్రజలకు గరిష్టంగా 4 కిలోల వరకు గోల్డ్ బాండ్ యూనిట్లు కొనొచ్చు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తే గ్రాముపై రూ. 50 డిస్కౌంట్ వస్తుంది. ఈ స్కీమ్ కాలపరిమితి 8 సంవత్సరాలు. ఐదేళ్ల తర్వాత కూడా ముందస్తు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. దీనిపై చివరిసారి ఇష్యూ ప్రకారం 2.50 శాతం వడ్డీ రేటు కూడా వస్తుంది. ఈ వడ్డీ రేటు అనేది టెన్యూర్ మొత్తానికి స్థిరంగా ఉంటుంది.

# ఎస్‌బీఐ నుంచి మరో కొత్త స్కీమ్.. రేపటి నుంచే షురూ..




**న్యూఢిల్లీ- నవభూమి:**ఇటీవలి కాలంలో ఈక్విటీల్లో పెట్టుబడులు భారీగా పెడుతున్నారు. స్టాక్ మార్కెట్లపై సరైన అవగాహన లేని వారంతా మ్యూచువల్ ఫండ్స్ వైపు మళ్లుతున్నారు. కోట్లాది రూపాయలు ఈక్విటీ ఫండ్స్‌లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు కొత్త కొత్త పథకాలను లాంచ్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఇన్వెస్టర్లకు చాలా ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. తమకు అనువైన ఫండ్ ఎంచుకుని ఇన్వెస్ట్ చేయవచ్చు. ఈ క్రమంలోనే ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ మరో కొత్త స్కీమ్ తీసుకొస్తోంది. అందే ఎస్‌బీఐ నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఫండ్ . ఈ కొత్త ఫండ్ ఆఫర్ గురించిన పూర్తి వివరాలు తెలుసుకుందాం. ఎస్‌బీఐ న్యూ ఫండ్ ఆఫర్‌తో తమ మదుపరులను ఆకర్షిస్తోంది. దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ అందించాలనే లక్ష్యంగా నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఫండ్ పేరుతో కొత్త స్కీమ్ తీసుకొచ్చింది. ఈ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 4వ తేదీతో ప్రారంభమవుతోంది. ఫిబ్రవరి 17, 2025 వరకు సబ్‌స్క్రిప్షన్ అందుబాటులో ఉంటుంది. ఆ తర్వాత యూనిట్ల కేటాయింపు ఉంటుంది. దాని తర్వాత క్రయ విక్రయాలకు రిటైల్ మార్కెట్‌లోకి ఈ ఫండ్ వస్తుంది.ఈ కొత్త మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లోని నిధుల్లో 95 శాతం నుంచి 100 శాతం వరకు నిఫ్టీ ఐటీ ఇండెక్స్‌లోని స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తారు. మిగిలిన 0-5 శాతం నిధులను ప్రభుత్వ సెక్యూరిటీలైన ట్రెజరీ బిల్స్, ఎస్‌డీఎల్స్, ఇతర ఆర్‌బీఐ సూచించిన వాటిల్లో ఇన్వెస్టే చేస్తారు. అలాగే ఎస్‌బీఐ తీసుకొచ్చిన ఈ కొత్త పథకం సబ్‌స్క్రైబ్ చేసేందుకు కనీస పెట్టుబడి రూ.5000గా ఉంది. ఆ తర్వాత రూ.5 వేల చొప్పున ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. ఇందులో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారానూ ఇన్వెస్ట్ చేసేందుకు అవకాశం కల్పిస్తారు. రోజువారీ, వారం, నెల, త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక పద్ధతుల్లో సిప్ ఇన్వెస్ట్ మెంట్ చేయొచ్చు.ఎస్‌బీఐ నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఫండ్ మేనేజర్లుగా హర్ష సేథి ఉన్నారు. ఆయన ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌లో 2007 నుంచి పని చేస్తున్నారు. ఆయన ఇప్పటికే ఎస్‌బీఐ నిఫ్టీ ఐటీ ఈటీఎఫ్, ఎస్‌బీఐ నిఫ్టీ కన్సంప్షన్ ఈటీఎఫ్, ఎస్‌బీఐ నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ ఈటీఎఫ్, ఎస్‌బీఐ నిఫ్టీ మిడ్ క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్, ఎస్‌బీఐ నిఫ్టీ స్మాల్ క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్, ఎస్‌బీఐ నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ ఇండెక్స్ ఫండ్, ఎస్‌బీఐ నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్ నిర్వహిస్తున్నారు.

## రెండేళ్లలో 250 శాతం లాభం..

# ఇప్పుడు 1 షేరుకు 1 షేరు ఉచితం..



**న్యూఢిల్లీ- నవభూమి:**స్మాల్ క్యాప్ కేటగిరి, వేస్ట్ మ్యానేజ్మెంట్ సర్వీసెస్ సెక్టార్ కంపెనీ అర్బన్ ఎన్విరో వేస్ట్ మ్యానేజ్మెంట్ లిమిటెడ్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఇటీవలే సమావేశమై బోనస్ షేర్లు జారీ చేసేందుకు ఆమోదం తెలుపినట్లు వెల్లడించింది. రికార్డ్ తేదీ నాటికి ఈ కంపెనీకి చెందిన 1 షేరు కొంటే మరో షేరు ఉచితంగా అందనుంది. ఈ కంపెనీ షేరు గత రెండేళ్లనే 250 శాతానికిపైగా లాభాన్ని అందించి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో ఒకటిగా నిలిచింది.

**బోనస్ షేర్లు..**


కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. 1:1 రేషియోలో బోనస్ షేర్లు అందించేందుకు కంపెనీ బోర్డు సిఫార్స్ చేసింది. అంటే రికార్డు తేదీ నాటికి రూ. 10 ఫేస్ వ్యాల్యూ గల 1 ఈక్విటీ షేరు తమ డీమ్యాట్ ఖాతాలో కలిగి ఉంటే వారికి అదనంగా రూ. 10 ఫేస్ వ్యాల్యూ గల 1 ఈక్విటీ షేరు బోనస్ రూపకంగా ఉచితంగా లభిస్తుంది. ఈ బోనస్ షేర్ల జారీకి సంబంధించి అర్హులను నిర్ణయించడానికి రికార్డు తేదీని ఫిబ్రవరి 7, 2025గా నిర్ణయించినట్లు కంపెనీ తెలిపింది. ఈ బోనస్ ఇష్యూ కోసం 43,30,000 షేర్లు కేటాయించినట్లు వెల్లడించింది.ఈరోజు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్‌లో అర్బన్ ఎన్విరో వేస్ట్ మ్యానేజ్మెంట్ కంపెనీ షేరు 5 శాతం నష్టపోయి లోయర్ సర్క్యూట్ తాకింది. రూ. 523 వద్ద స్థిరపడింది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 695.15గా ఉండగా.. కనిష్ఠ ధర రూ. 265.45గా ఉంది. గత వారంలో ఈ షేరు సుమారు 3 శాతం నష్టపోయింది. గత నెల రోజుల్లో 23 శాతం నష్టపోయింది. అయితే గత ఆరు నెలల్లో 21 శాతం లాభాన్ని అందించింది. ఏడాది కాలంలో 47 శాతం లాభాన్ని ఇవ్వగా.. గత రెండేళ్లలో 253 శాతం లాభాన్ని తమ వాటాదారులకు అందించింది. రెండేళ్ల క్రితం లక్ష రూపాయలు పెట్టి షేర్లు కొనుగోలు చేసినట్లయితే ఇప్పుడు ఆ విలువ రూ.3.53 లక్షలకుపైగా ఉంటుంది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 226 కోట్లుగా ఉంది.

# 84 వేలు దాటేసిన బంగారం.. బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ- నవభూమి:**బంగారం వెండి ధరలు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరవవుతున్నాయి. కొన్ని రోజుల క్రితం వరకు 80 వేలకు దిగువన కొనసాగిన బంగారం ఒక్కసారిగా పెరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వం బంగారం దిగుమతులపై పన్నును పెంచబోతుండడమే దీనికి కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఫిబ్రవరి 3న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 84, 480కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 77, 440కి చేరింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 84, 630కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 77, 590కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 84, 480కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 77, 440కి చేరింది. వెండి ధరలు భారీగా పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.





## మహాకుంభ్‌లో 34 కోట్ల మంది పవిత్ర స్నానాలు

**అయోధ్య-నవభూమి:** ఈ శతాబ్దంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమంగా ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్ మేళా లో ఇప్పటి వరకూ 34 కోట్ల మంది త్రివేణి సంగమ స్నానాలు చేశారని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. మిల్కిపూర్ అసెంబ్లీ నియోజవర్గంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, ఏళ్ల తరువాత రామ్‌లల్లా ప్రతిష్ఠాపన జరిగినప్పుడు సమాజ్‌వాదీ పార్టీ వ్యతిరేకించిందని, అయోధ్య అంతర్జాతీయ విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి పేరు పెట్టడాన్ని వ్యతిరేకించిందని, గత రెండు నెలలుగా ఆ పార్టీ చీఫ్ మహాకుంభ్‌కు వ్యతిరేకంగా టీట్లు చేస్తూనే ఉన్నారని అన్నారు. ఈరోజు వరకూ 34 కోట్ల మంది భక్తులు త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు చేశారని చెప్పారు.మిల్కిపూర్ ఉప ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 5న జరుగనుంది. ఈ ఎన్నికలు జాతీయతావాదానికి, ఆనువంశిక రాజకీయాలకు మధ్య జరుగుతున్న పోరుగా యోగి ఆదిత్యనాథ్ అభివర్ణించారు. 2017లో తమ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ల్యాండ్ మాఫియా నడ్డివిరిచామని, యాంటీ ల్యాండ్ మాఫియా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని, డబుల్ ఇంజన్ ప్రభుత్వం ప్రగతిపథంలోకి దూసుకువెళ్తే తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఎస్పీ భయపడుతోందని విమర్శించారు. ఇదే పార్టీ ఉత్తరప్రదేశ్ ప్రగతిని అడ్డుకుందని, అయోధ్యలో రామభక్తులపై తూటాలు పేల్చిందని, వారిని ఎంతమాత్రం నమ్మడానికి వీల్లేదని యోగి అన్నారు.

## కాఫీ చేదు నిజం ఇదే..



**న్యూఢిల్లీ- నవభూమి:**కాఫీ చేదుగా ఉంటుందా? కానే కాదు.. కమ్మగా ఉంటుందని కొందరంటారు. అబ్బే.. కాఫీ చేదుగా ఉంటుంది బ్రో అని మరికొందరు అంటారు. ఇంతకూ కాఫీ చేదుగా ఎందుకు ఉంటుంది? అన్న రహస్యాన్ని బట్టబయలు చేశారు జర్మనీ శాస్త్రవేత్తలు. కాఫీ తాగే వ్యక్తి జన్యు లక్షణాల ఆధారంగానే చేదు ఫీలింగ్ ఉంటుందన్నారు. కొద్దికాలంగా తాము చేస్తున్న పరిశోధనలకు తాజాగా వారు పలు విషయాల్ని గుర్తించారు. తమ రీసెర్చ్ లో భాగంగా కాఫీయా అరబికా మొక్క నుంచి సేకరించిన గింజలను రోస్ట్ చేశారు. వాటిని పొడిగా మార్చి.. కాఫీని తయారు చేశారు. కాఫీలోని కేఫీన్ చాలా చేదుగా ఉంటుందన్న విసయం తెలిసిందే. దీన్ని తొలగించిన కాఫీ కూడా చేదుగా ఉంటోంది. దీంతో రోస్టెడ్ కాఫీలో చేదుకు ఇతర పదార్థాలు కారణంగా గుర్తించారు. ఇందులో మొజాంబియోసైడ్ కూడా ఉంది. కెఫీన్‌తో పోలిస్తే ఇది పది రెట్లు ఎక్కువ చేదుగా ఉంటుంది. మనిషి శరీరంలో చేదుకు సంబంధించిన టీఏటస్2ఆర్43, టీఏఎస్2ఆర్46 అనే రెండు రకాల గ్రాహకాలను క్రియాశీలం చేస్తుంది. అయితే.. కాఫీ గింజలను వేగించేటప్పుడు మొజాంబియోసైడ్ తీవ్రత గణనీయంగా తగ్గుతున్నట్లుగా గుర్తించారు. కాఫీ చేదుగా ఉండటానికి అదో కారణంగా గుర్తించారు. రోస్టింగ్ కారణంగా మొజాంబియోసైడ్ కు సంబంధించిన ఇతరత్రా పదార్థాలు ఇంకేమైనా ఉత్పత్తి అవుతున్నాయా? అన్నది తేలాల్సి ఉంది. కాఫీ గింజల్ని వేయించే క్రమంలో మొజాంబియోసైడ్ క్షీణించి.. ఏడు విభిన్న ఉత్పత్తులుగా రూపాంతం చెందుతున్నట్లుగా గుర్తించారు. రోస్టింగ్ ఉష్ణోగ్రత.. ఎంతసేపు రోస్ట్ చేశారన్న దానికి అనుగుణంగా వీటి పరిమాణం ఉంటోందని తేల్చారు. కాఫీగా తయారైన తర్వాత వీటి గాఢత తగ్గుతున్నట్లుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. మొజాంబియోసైడ్.. దాని రోస్టింగ్ ఉత్పత్తులకు సంబంధించి ఒక కాంబినేషన్ కలిగిన కాఫీ తాగిన పదకొండు మంది వాలంటీర్లలో ఎనిమిది మంది మాత్రమే చేదు రుచిని అనుభవించారు. జన్యుపరమైన అంశాలు ఈ రుచి భావనను ప్రభావితం చేస్తున్నట్లుగా తేల్చారు. మొత్తంగా జన్యుపరమైన అంశాలు కాఫీ చేదుగా ఉందనే భావనను కలిగిస్తున్న విషయాన్ని తాజాగా శాస్త్రవేత్తలు తేల్చారు.

## 'చైనా పనామా'.. ట్రంప్ తదుపరి పని అదే..




**వాషింగ్టన్-నవభూమి:**మెక్సికో, కెనడా, చైనాలపై సుంకాల విధింపు అయిపోయింది..జన్మత: అమెరికా పౌరసత్వం రద్దయింది.. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలగడం పూర్తయింది.. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతిలో మిగిలిన పని 'పనామా' కాల్వ. ఈ మేరకు ఆయన కార్యరంగంలోకి దిగారు. అంతేకాదు.. పనామా కాల్వను చైనా పరోక్షంగా నిర్వహిస్తోందని ఆరోపించారు. ఒప్పందాన్ని పనామా ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. అందుకే కాల్వను తిరిగి తీసుకోవాలని అనుకుంటున్నట్లు చెప్పాడు. బలగాల అవసరం లేకుండా త్వరలోనే శక్తిమంతమైన చర్య ఉంటుందని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ ట్రంప్ ఎన్నికల ప్రచార సమయం నుంచే ఇరుగు పొరుగైన కెనడా, మెక్సికోలను హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. సుంకాలు విధిస్తానని గట్టిగా హెచ్చరించారు. ఇక అధికారంలోకి వచ్చాక అదే పని చేస్తున్నారు. శనివారం కెనడా, మెక్సికో, చైనాపై సుంకాలు వేసేశారు. మిగిలింది 'పనామా కాల్వ'. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆదివారం పనామా అధ్యక్షుడు జోస్‌రౌల్ ములినోతో భేటీ అయ్యారు. పనామాపై చైనా జోక్యాన్ని, నియంత్రణను అడ్డుకోకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే, 'అమెరికా దురాక్రమణకు మేం భయపడం' అని పనామా అధ్యక్షుడు తెలిపారు. చర్చలకు సిద్ధమని ప్రకటించారు. అయితే, ట్రంప్ హెచ్చరికలతో కాస్త వెనక్కు తగ్గినట్లున్నారు. చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్ట్ నుంచి వైదొలుగుతామని ప్రకటించారు. చైనాతో ఈ ఒప్పందాన్ని 2017లో చేసుకున్నారు. ఇకపై పునరుద్ధరించబోమని వెల్లడించారు. కాగా, పనామా కాల్వను నిర్మించింది అమెరికానే. అందుకే అంతంగా పట్టుబడుతోంది. 1914లో కట్టింది. పనామా దేశంతో జరిగిన ఒప్పందం మేరకు 1999 డిసెంబరులో పనామాకు ఇచ్చేసింది. కానీ, తమ దేశ వాణిజ్య, నౌకా దళం నుంచి పనామా భారీగా ఫీజులు వసూలు చేస్తోందని.. వీటిని తగ్గించాలని ట్రంప్ కోరుతున్నారు. లేకుంటే పనామా కాలువను తిరిగి వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు. ఇది వివాదం రాజేసింది.

## అఘోరి కోసం దేశం విడిచిన రష్యన్ యువతి?!



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ప్రేమకు సాధువులు, అఘోరీలు సైతం అతీతులు కాదు అనడానికి పురాణాల్లోనే ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు లైవ్ గా అలాంటి ప్రేమకథ చూడండి అంటూ యూట్యూబ్ మీడియా ఊదరగొడుతోంది. భారతదేశానికి చెందిన ఒక అఘోరీతో రష్యన్ యువతి లవ్ స్టోరి వింటుంటే ఆశ్చర్యపోని వారు లేరు. వివరాల్లోకి వెళితే.. తీవ్రమైన, కఠినమైన ఆచారాలతో నిండి ఉంది. వారు ప్రాపంచిక అనుబంధాలను త్యజించి అతీతమైన జీవన విధానంతో కఠినమైన ఆధ్యాత్మిక శిక్షణ పొందుతారు.వారి కఠినమైన క్రమశిక్షణ దృష్ట్యా అఘోరి- రష్యన్ యువతి ప్రేమకథ ఆసక్తిని కలిగిస్తోంది. ఇది నిజమా కాదా? అనేది బిగ్ డిబేట్‌గా మారింది. సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ ప్రపంచంలోనే అతిపెద్ద మతపరమైన వేడుక 'మహా కుంభమేళా-2025' ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతోంది. వేలాదిగా సాధువులు, పెద్ద సంఖ్యలో భక్తులు ఈ గొప్ప కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ప్రయాగ్ రాజ్ వేదికగా సాధువులు, అఘోరీల గురించి చాలా కథనాలు యూట్యూబ్ లో మీడియాలో వైరల్ గా మారాయి. వీటిలో నెటిజనుల దృష్టిని ఆకర్షించిన ఒక ప్రత్యేక కథ అఘోరి - రష్యన్ మహిళ ప్రేమకథ. వైరల్ గా షేర్ అవుతున్న ఈ వీడియో చూసాక సాధారణ ప్రజలు అవాక్కవుతున్నారు. సదరు రష్యన్ మహిళ అఘోరితో ఎంతగా ప్రేమలో పడిందంటే ఆమె తన దేశాన్ని విడిచిపెట్టి భారతదేశంలో స్థిరపడిందట. అఘోరీ ఆమె లేనిదే జీవించలేని స్థితికి చేరుకున్నాడు అంటూ ప్రచారమవుతోంది. అయితే ప్రాపంచిక సుఖాల కోసం ఇలా తపించిపోయే అఘోరీలు ఉంటారా? అనే కొత్త డౌట్ ప్రజల్లో వ్యక్తమవుతోంది. భారతదేశ పర్యటన సందర్భంగా రష్యన్ పర్యాటకురాలు ఊహించని విధంగా అఘోరి బాబాను ప్రేమించిందని కథనాలొస్తున్నాయి. వీడియోలో ఆ మహిళ అఘోరిని తన భర్తగా

# ఆప్‌ది దద్దమ్మ ప్రభుత్వం.. కేజ్రీవాల్‌పై చంద్రబాబు ఘాటు విమర్శలు



**న్యూఢిల్లీ-నవభూమి:**ఎన్డీయే భాగస్వామి, టీడీపీ అధినేత ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షం బీజేపీ తరపున ప్రచారానికి వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న ఆయన.. తెలుగువారు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరిన చంద్రబాబు.. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)పై విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆప్ సర్కారు విఫలమైందని దుయ్యబట్టారు. ఇదే సమయంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటోందని అన్నారు.


ఢిల్లీ ప్రజలకు తాగునీరు అందించడంలో కేజ్రీవాల్ ప్రభుత్వం విఫలమైతే.. మోదీ మాత్రం అమృత్ పథకం కింద స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేని దద్దమ్మ ప్రభుత్వం ఆప్‌దని బాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ దుర్గంధభరితంగా ఉండటానికి కారణం ఎవరని ఏపీ సీఎం ప్రశ్నించారు. యమున నదిని ప్రక్షాళన చేస్తామని గత 10 ఏళ్లుగా చెబుతున్నారని కానీ చేయలేకపోయారని విమర్శించారు. యమున ప్రక్షాళన జరగాలంటే మోదీకే సాధ్యమని చంద్రబాబు ఉద్ఘాటించారు.

ఢిల్లీలో కాలుష్యం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదన్నారు. ఈ సభకు వచ్చిన వాళ్లు కూడా కాలుష్యం దెబ్బకు ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వ నమూనా విఫలమైందని, సమ్మిళిత వృద్ధికి సహకరించే పార్టీకి ప్రజలు ఓటు వేయాలని నాయుడు పిలుపునిచ్చారు. 'ఈరోజు.. రేపు, భవిష్యత్తు కోసమే రాజకీయ పార్టీలు ఎప్పుడూ ఆలోచిస్తాయి.. మంచి ప్రజా విధానం ఉన్న ప్రభుత్వం సమాజాన్ని మార్చగలదు.' అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆప్ ప్రభుత్వాన్ని హాఫ్ ఇంజిన్ సర్కార్గా అభివర్ణించిన ఆయన... ఢిల్లీకి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరమని నొక్కిచెప్పారు..

'మనకు కావాల్సింది ఆయారాంలు గయారాంలు కాదు... రాజభవనాలు కట్టుకునే వాళ్లు కాదు... ప్రజల కోసం పనిచేసేవాళ్లు కావాలి... అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించాలి... కమలం గుర్తుకు ఓటేయాలి... 1995లో హైదరాబాద్ ఎలా ఉండేదో ప్రస్తుతం ఢిల్లీ అలా ఉంది.. ఇక్కడ గాలి కాలుష్యమే కాదు రాజకీయ కాలుష్యం కూడా ఉంది.. పేదలు శాశ్వతంగా మురికవాడల్లోనే ఉండిపోకూడదంటే ఆలోచించాలి' అని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. దీంతో సోమవారంతో ప్రచారానికి తెరపడనుంది. ఫిబ్రవరి 8న ఓట్లను

### కుంభమేళా తొక్కిసలాట పిల్‌ను

# తిరస్కరించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ- నవభూమి:** ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో ఫిబ్రవరి 29వ తేదీ మౌని అమావాస్య రోజు వేకువజామున తొక్కిసలాట జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ ఘటనలో మొత్తం 30 మంది భక్తులు ప్రాణాలు కోల్పోగా.. మరో 60 మంది తీవ్రంగా గాయపడినట్లు యూపీ సర్కారు వెల్లడించింది. అయితే ఈ ఘటనకు కారణం యూపీ ప్రభుత్వ అధికారులే అంటూ ఓ న్యాయవాది సుప్రీం కోర్టులో పిల్ వేశారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. ఆ పిల్‌ను తిరస్కరించింది. ఈ ఘటనపై అలహాబాద్ హైకోర్టుకు వెళ్లాలంటూ పిటిషనర్‌కు సూచించింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. ఫిబ్రవరి 29వ తేదీన మౌని అమావాస్య సందర్భంగా.. ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు కోట్లాది మంది భక్తులు తరలి వచ్చారు. వేకువజాము నుంచే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు కుప్పలు తెప్పలుగా వెళ్లారు. అయితే చీకటిగా ఉండడం, చెత్త డబ్బాలు అడ్డుగా ఉండడంతో అవి కనిపించక కొంత మంది భక్తులు కింద పడిపోయారు. అది గమనించకుండా వెళ్లి మరికొంత మంది భక్తులు వారిపై పడగా.. తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో మొత్తం 30 మంది భక్తులు ప్రాణాలు కోల్పోగా.. మరో 60 మందికి పైగా ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఈ ఘటనకు కారణం ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వమేనని.. సర్కారు అధికారులే దీనిపై బాధ్యత వహించాలంటూ విశాల్ తివారీ అనే న్యాయవాది సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్రాలకు స్పష్టమైన, విధాన పరమైన మార్గదర్శకాలు ఇవ్వాలంటూ కోరారు. అలాగే భక్తుల భద్రత ప్రమాదంలో పడకుండా ఉండేందుకు వీఐపీ ట్రీట్‌మెంట్‌ను రద్దు చేయాలని సూచించారు.

తాజాగా దీనిపై స్పందించిన సుప్రీం కోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. ఈక్రమంలోనే ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఈఘటనపై ఇప్పటికే జ్యూడీషియల్ దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. ఇలాంటి ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యమే హైకోర్టులో కూడా దాఖలు అయిందని వివరించారు. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీం కోర్టు కుంభమేళా తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని.. ఆందోళన కల్గించే అంశమని చెప్పుకొచ్చింది. ఈక్రమంలోనే ఈ పిల్‌ను తిరస్కరించి.. పిటిషనర్‌ను అలహాబాద్ హైకోర్టుకు వెళ్లాలని

### ఫుల్లుగా మందుకొట్టి.. ఆపై కారును

# రైల్వే ప్లాట్‌ఫామ్‌పై పడిపోయాడు



**బెంగళూరు-నవభూమి:**మద్యం మత్తులో డ్రైవర్లు చేసే రచ్చల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఫుల్లుగా మందుకొట్టి కొందరు ట్రాఫిక్ పోలీసులకు చుక్కలు చూపిస్తుంటే.. మరికొందరు మాత్రం మద్యం మత్తులోనే డ్రైవింగ్ చేసి ప్రమాదాలు కొని తెచ్చుకుంటారు. అలా తమ ప్రాణాలు తీసుకోవడమే, ఇతరుల ప్రాణాలు తీయడమో చేస్తుంటారు. కానీ మనం ఇప్పుడు చూడబోయే డ్రైవర్ మాత్రం.. తాగిన మైకంలో వాహనాన్ని రోడ్డుపై నడపడానికి బదులుగా రైల్వే ప్లాట్‌ఫామ్‌పై నడిపి నేరుగా వెళ్లి రైల్వే ట్రాక్‌పై పడిపోయాడు. ఆ సమయంలో ఎలాంటి రైలూ రాకపోవడం.. స్థానికులు వెంటనే అతడిని పైకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. కర్ణాటకలోని మైసూరు సమీపంలోని బన్నూరుకు చెందిన చెందిన 32 ఏళ్ల రాకేష్ గౌడ్ క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తనకు చెందిన మారుతీ స్విఫ్ట్ డిజైర్‌ను నడుపుకుంటూ కోలార్ జిల్లాలో జీవనం సాగిస్తున్నాడు. అయితే ఫిబ్రవరి 1వ తేదీ శనివారం అర్ధరాత్రి రాకేష్ గౌడ్ మద్యం సేవించాడు. ఫుల్లుగా మందుకొట్టి ఇంటికి వెళ్లాలనుకున్నాడు. ఈక్రమంలోనే తన కారును తీసి నడపడం ప్రారంభించాడు. కానీ అప్పటికే ఫుల్లుగా తాగడంతో మైకం వచ్చి ఎటు వెళ్తున్నాడో తెలియకుండానే కారును నడిపాడు. ఇలా కారు ముందుగా టేకల్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పైకి దూసుకు వచ్చింది. ఆపై నేరుగా వెళ్లి రైల్వే ట్రాక్‌పై పడిపోయింది. అర్ధరాత్రి 2 గంటలు కావడం.. ఆ సమయంలో ప్లాట్‌ఫామ్‌పై ఎక్కువగా ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే రైల్వే ట్రాక్‌పై కారు పడిన సమయంలో కూడా ఆ పట్టాలపై ఎలాంటి రైలూ రాకపోవడం.. విషయం గుర్తించిన స్థానికులు వెంటనే వెళ్లి అతడిని పైకి తీసుకు రావడంతో.. డ్రైవర్ రాకేష్ గౌడ్ ప్రాణాలు కూడా నిలిచాయి. ఈక్రమంలోనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన రైల్వే స్టేషన్‌కు చేరుకున్న పోలీసులు క్యాబ్ డ్రైవర్ రాకేష్ గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే రైల్వే అధికారుల సాయంతో ఆ ట్రాక్ వెంట వచ్చే రైళ్లను దారి మళ్లించారు. ఆపై క్రేన్ల సాయంతో ట్రాక్‌పై ఉన్న కారును తొలగించి.. రైళ్ల రాకపోకలు కొనసాగేలా చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు మద్యం సేవించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని.. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టమూ సంభవించలేదని అక్కడే ఉండి ప్రమాదాన్ని చూసిన ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

# సెంచరీ దిశగా రూపాయి..



**న్యూఢిల్లీ- నవభూమి:** డాలరు విలువతో పోలిస్తే రూపాయి పతనం అయితే ఏమవుతుంది..? సింపుల్ గా చెప్పాలంటే.. మీ జేబుకు పరోక్షంగా చిల్లు పడుతుంది.. ఉదాహరణకు ఒక వ్యక్తి తన కూతురును అమెరికా పంపాలని అనుకున్నాడు. అప్పటికి డాలరుకు రూపాయి విలువ 80. కొద్ది రోజుల్లోనే అది 86కు చేరింది అనుకోండి. దీని దెబ్బ.. కుమార్తె కోసం అతడు తీసుకునే బ్యాంక్ లోన్ మీద ప్రభావం పడుతుంది.. ఈ మొత్తం రూ.లక్షల్లో ఉంటుంది.. డాలరు-రూపాయి మధ్య దూరం బాగా పెరిగింది. ఇక ట్రంప్ వచ్చీ రావడంతోనే డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా పతనం అవుతోంది. ఎన్నడూ లేని విధంగా చరిత్రలో తొలిసారి రూ.87 దాటింది. సెంచరీ దిశగా ఏడాది కిందటితో పోలిస్తే రూపాయి విలువ డాలరుతో పోలిస్తే రూ.7 వరకు పెరిగింది. ఇది ఇక్కడితో ఆగదని మరింత పతనం అవుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ట్రంప్ చర్యలే దీనికి కారణం అని అంటున్నారు. ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనట్లుగా సోమవారం రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్టానికి (రూ.87) పడిపోయింది. డాలర్‌తో చూస్తే రూపాయి విలువ రూ. 87.20 వద్ద ట్రేడవుతోంది. అమెరికా ప్రధాన వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో, చైనా లపై సుంకాల విధింపుతో డాలర్ బలపడుతోంది. ఇదే సమయంలో డాలర్‌పైనే ఎక్కువగా ఆధారపడి ఉన్న ఆసియా కరెన్సీలు పతనం అవుతున్నాయి. . పదవులు కిందటి సెషన్లో రూపాయి విలువ రూ. 86.60 స్థాయిలో ఉండేది. సోమవారం ఒక్కసారిగా 0.70 శాతం పతనంతో రికార్డు స్థాయి కనిష్టాలకు పడిపోయింది. డాలర్ ఇండెక్స్ 0.30 శాతం పెరిగి 109.8 వద్ద కొనసాగింది. చైనా కరెన్సీ యువాన్ కూడా 0.50 శాతం తగ్గింది. చైనా, మెక్సికో, కెనడాలపై ట్రంప్ సుంకాలు.. అంతర్జాతీయ అనిశ్చితి నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు పెరిగిపోతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ 0.73 శాతం పెరిగి బ్యారెల్‌పై 76.22 డాలర్ల వద్ద ఉంది. ఇలా దిగుమతి బిల్లు భారమై దేశానికి ఆర్థిక లోటు తీవ్రమవుతోంది. భారత స్టాక్ మార్కెట్ సూచీలు కూడా సోమవారం సెషన్లో తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. అంతర్జాతీయ అనిశ్చితి సహా క్రూడాయిల్ ధరలు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై ప్రకటనలు మన కరెన్సీపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. రూపాయి ఇలానే పతనం అయితే, నిత్యావసర వస్తువుల ధరలు అంటే ముందుగా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దీనిని తగ్గించడానికి మళ్లీ ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచాల్సి వస్తుంది. స్టాక్ మార్కెట్లు దెబ్బతింటాయి. దిగుమతులు ఖరీదైపోతాయి.


## గ్రామీ వేడుకల్లో షాకింగ్ ఘటన.. దుస్తులు తీసేసి ఫొటోలకు ఫోజులిచ్చిన ర్యాపర్ భార్య




**వాషింగ్టన్- నవభూమి:**సంగీత రంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే గ్రామీ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరుగుతోంది. లాస్ ఏంజెల్స్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకకు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న గాయనీ గాయకులు, మ్యూజిక్ డైరెక్టర్లు హాజరై సందడి చేస్తున్నారు. రెడ్ కార్పెట్‌పై నడుస్తూ ఫొటోలకు ఫోజులిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వేడుకలో షాకింగ్ ఘటన ఒకటి చోటు చేసుకుంది. అమెరికన్ ర్యాప్ సింగర్ భార్య ఫొటోషూట్‌లో దుస్తులు తీసేయడం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. ఆమె చేసిన పనికి అక్కడున్న వారంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు.


గ్రామీ వేడుకలకు అమెరికన్ ర్యాపర్ కాన్యే వెస్ట్ 2025లో బెస్ట్ ర్యాప్ సాంగ్‌కు నామినేట్ అయ్యాడు. ఈ సందర్భంగా ఫంక్షన్‌కు తన భార్య, మోడల్ బియాంకా సెన్సోరీతో కలిసి వచ్చారు. అవార్డ్ ఫంక్షన్‌లోకి రాగానే రెడ్ కార్పెట్‌పై నడుస్తూ వెళ్లారు. ఇంతలో బియాంకా ఉన్నట్టుంటి తన దుస్తులు తీసేసీ న్యూడ్‌గా ఫొటోలకు ఫోజులిచ్చారు. దీంతో అక్కడున్న వారంతా షాక్ అయ్యారు. నిర్వాహకులు వెంటనే ఆ జంటను అక్కడి నుంచి బయటకు పంపించేశారు. అయితే, బియాంక ఎందుకు అలా ప్రవర్తించారో తెలియరాలేదు.

## అమెరికా మాజీ అధ్యక్షుడికి గ్రామీ అవార్డు




**వాషింగ్టన్- నవభూమి:**సంగీత రంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే గ్రామీ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరుగుతోంది. లాస్ ఏంజెల్స్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకకు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న గాయనీ గాయకులు, మ్యూజిక్ డైరెక్టర్లు హాజరై సందడి చేస్తున్నారు. రెడ్ కార్పెట్‌పై నడుస్తూ ఫొటోలకు ఫోజులిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఇక ఈ వేడుకల్లో అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ కు గ్రామీ పురస్కారం వరించింది. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత అయిన జిమ్మీ కార్టర్ (100) గతేడాది డిసెంబర్ 30న కన్నుమూసిన విషయం తెలిసిందే. మరణానంతరం ఆయనకు ఈ పురస్కారం వరించింది. ఆయన రచించిన 'ది లాస్ట్ సండేస్ ఇన్ ప్లేన్స్'కు బెస్ట్ ఆడియోబుక్ నెరేషన్ విభాగంలో అవార్డు లభించింది. ఈ అవార్డును ఆయన మనవడు జేసన్ కార్టర్ అందుకున్నారు. జిమ్మీ కార్టర్ అమెరికాకు 39వ అధ్యక్షుడిగా పని చేశారు. తన పదవీకాలంలో ప్రపంచ శాంతి కోసం ఆయన కృషి చేశారు. 1979లో ఈజిప్ట్, ఇజ్రాయెల్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించారు. చైనాతో దౌత్యపరమైన సంబంధాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు అమెరికా విదేశాంగ విధానంలో మానవ హక్కులకు ప్రాధాన్యం కల్పించారు. 1980 ఎన్నికల్లో ఆయన ఓడిన తర్వాత పూర్తిస్థాయిలో ప్రపంచ శాంతికి కృషి చేశారు. దీంతో 2002లో ఆయనకు నోబెల్ శాంతి బహుమతి లభించింది.

## రన్‌వేపై టేకాఫ్ అవుతుండగా విమానంలో చెలరేగిన మంటలు.. తర్వాత ఏం జరిగిందంటే?



**వాషింగ్టన్- నవభూమి:** అగ్రరాజ్యం అమెరికాలో వరుసగా విమాన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత వారం మూడు రోజుల వ్యవధిలో రెండు విమాన ప్రమాదాలు జరుగగా.. తాజాగా మరో విమానానికి తృటిలో ప్రమాదం తప్పింది. రన్‌వేపై టేకాఫ్ అవుతుండగా విమానంలో మంటలు చెలరేగాయి. అయితే అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను అందులో నుంచి దించేశారు. ప్రయాణికులు క్షేమంగా బయటపటడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కుచెందిన 1382 విమానం అమెరికాలోని హ్యూస్టన్ నుంచి న్యూయార్క్ వెళ్తున్నది. ఈ క్రమంలో హ్యూస్టన్‌లోని జార్జిబుష్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రన్‌వేపై టేకాఫ్ అవుతున్నది. ఒక్కసారిగా దాని రెక్కలలో ఒకదాని నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన విమాన సిబ్బంది ప్రయాణికులను అందులోనుంచి దించేశారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని హ్యూస్టన్ ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు వెల్లడించారు. ఆ సమయంలో విమానంలో 104 మంది ప్రయాణికులు ఉన్నారని, అంతా క్షేమంగానే బయటపడ్డారని చెప్పారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. అందులో పలువు ప్యాసింజర్లు తమను ఇక్కడి నుంచి బయటకు తీసుకెళ్లండి అంటూ కేకలు వేయడం గమనించవచ్చు. కాగా, విమానం ఇంజిన్‌లో సమస్యలు తలెత్తడం వల్లే మంటలు చెలరేగాయని ఫెడరల్ ఏవిషయన్ అధికారులు వెల్లడించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్ మంగళవారం 04 । ఫిబ్రవరి । 2025



## లావణ్య-రాజ్ తరుణ్ కేసులో వ్యక్తి అరెస్ట్.. ఎవరంటే

చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించిన లావణ్య రాజ్ తరుణ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నార్సింగ్ పోలీసులు లావణ్య సమర్పించిన ఆధారాల మేరకు ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇంతకు ముందే ప్రముఖ కేసులో ఈ వ్యక్తి అరెస్ట్ కావడం గమనార్హం. కాగా, ఈ వ్యక్తి రాజ్ తరుణ్, లావణ్య విడిపోవడానికి ప్రధాన కారణమని లావణ్య తెలిపింది. ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు ఏం చేశాడంటే..మస్తాన్ సాయి.. గచ్చిబౌలి, వరలక్ష్మి టిఫిన్ సెంటర్ డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితులలో ఒకడిగా అరెస్టైన వ్యక్తి. ఇప్పుడు లావణ్య, రాజ్ తరుణ్ కేసులో మరోసారి నార్సింగ్ పోలీసుల చేతికి చిక్కాడు. ఈ కేసు గురించి పోలీసుల వద్ద లావణ్య ప్రస్తావిస్తూ.. రాజ్ తరుణ్‌తో విడిపోవడానికి మస్తాన్ సాయి ప్రధాన కారణమని తెలిపింది. పలువురు అమ్మాయిల ప్రైవేట్ వీడియోలు రికార్డ్ చేసినట్లు మస్తాన్ పై ఆరోపణలు వచ్చాయి. అనంతరం వారిని బ్లాక్ మెయిల్ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే లావణ్యకు సంబంధించిన ప్రైవేట్ వీడియోలను మస్తాన్ రికార్డ్ చేశాడు. దీంతో పోలీసులు మస్తాన్ సాయిని అదుపులోకి తీసుకున్నారు. మస్తాన్ సాయి వద్ద 200పైగా వీడియోలను పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.ఏం జరిగిందంటే..“పదకొండేళ్లగా రాజ్ తరుణ్ నాతో ఉంటున్నాడు. ఏడేళ్లు ఇద్దరం కలిసి సంసారం చేశాం. అతనంటే నాకు ప్రాణం. అతనిప్పుడు నన్ను వదిలేసి మాల్వీ మల్హోత్రాతో రిలేషన్ మెయింటైన్ చేస్తున్నాడు.. నా రాజ్ నాకు కావాలి” అంటూ లావణ్య అప్పట్లో మీడియా ముందుకు వచ్చింది.





నిధి అగర్వాల్ కెరీర్ లో నెమ్మదిగా సాగుతోన్న సంగతి తెలిసిందే. చెప్పుకోవడానికి చేతిలో ‘హరి హర వీరమల్లు’, ‘రాజాసాబ్’ లాంటి అగ్ర హీరోల చిత్రాలున్నా? వాటి రిలీజ్ విషయానికి వచ్చే సరికే ఏం చెప్పాలో తెలియని పరిస్థితి. సంవత్సరాలుగా సినిమాలు సెట్స్ లో షూటింగ్ దశలోనే ఉన్నాయి. ఆ ప్రాజెక్ట్ లపై నిధి చాలా ఆశలు పెట్టుకుంది. వాటితో సక్సెస్ అందుకుని బిజీ భామగా మారాలని చూస్తోంది. మరి ఈ ప్రయత్నం ఎంత వరకూ సక్సెస్ అవుతుందో చూడాలి. రెండు సినిమాలపై అంచనాలైతే భారీగా ఉన్నాయి. సక్సెస్ అయితే నిధి కి కలిసొచ్చే అవకాశాలు ఎక్కువ గానే ఉన్నాయి. ఆ సంగతి పక్కన బెడితే తాజాగా నిధి అగర్వాల్ కి ఇడ్లీ అంటే ఎంత ఇష్టమో ఎంత ఇష్టమో బయటకు వచ్చింది. ఆహార పదార్థాల్లో ఏది ఇష్టం అంటే? అమ్మడు వెంటనే ఇడ్లీ అని సమాధానం ఇచ్చింది. ఇడ్లీ ఉదయమే కాదు..మధ్యాహ్నం లంచ్‌లో ...రాత్రి డిన్నర్ లో పెట్టినా ఇష్టంగా ఆరగిస్తుందిట. ఇంట్లో ఇడ్లీ ఉంటే ఇంకే పదార్థాలు అవసరం లేదుట. మూడు పూటలు ఇడ్లీ తినేసి సంతోషంగా ఉంటానంటోంది. సాధారణంగా ఇడ్లీ అంటే చాలా మంది ఇష్టదరు. కానీ నిధి అగర్వాల్ మాత్రం అలాంటి వాళ్లకు భిన్నం అంటోంది. ఇడ్లీ ఆరోగ్యానికి

## నేను ఇడ్లీ బ్యూటీని..

మంచిదంటోంది. ఇడ్లీ ఎక్కడ చూసినా నోరూరిపోతుందిట. ఇడ్లీ తర్వాత ఫ్రెంచ్ ఫ్రైస్ వీక్ నెస్‌గా చెప్పుకొచ్చింది. డైటింగ్ వల్ల వాటికి దూరంగా ఉండాల్సి వచ్చినప్పుడు చాలా బాధపడుతుందిట. అని ఆత్రంగా ఎదురు చూస్తోందిట. అలాగని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయనంటోంది. తాను తీసుకోవాల్సిన ఆరోగ్య పరమైన జాగ్రత్తలు తప్పని సరిగా తీసుకుంటానని తెలిపింది. నిధి ఇడ్లీ ఇష్టపడినట్లే కీర్తి సురేష్ దోశెలను ఇష్టపడుతుంది. వంద రకాల బ్రేక్ పాస్ట్ లు ముందు పెట్టినా దోశె తిన్నంతగా ఇంకేమీ తినని గతంలో తెలిపింది. మరి అలాంటి ఇడ్లీ-దోశె భామలు ఇంకెంత మంది ఉన్నారో. తిండి విషయంలో ఈ భామ మొహమాటం లేకుండా చెప్పేసింది.


## లేడీ డాన్‌గా సీనియర్ బ్యూటీ!



బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషీ ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న సంగతి తెలిసిందే. ఎలాంటి పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయగల నటి. యాక్షన్ , థ్రిల్లర్, ఎమోషనల్ డ్రామా ఇలా రకరకాల బ్యాక్ డ్రాప్‌లో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించింది. నటనతో విమర్శకుల ప్రశంసలందు కుంది. నటిగా తానో బ్రాండ్ అని బాలీవుడ్‌లో ఎప్పుడో ముద్ర వేసింది. హాలీవుడ్‌లో సైతం అమ్మడు సత్తా చాటింది. పోషించింది చిన్న రోల్ అయినా? డెబ్యూతోనే ప్రశంసలందుకుంది. తాజాగా హ్యూమా ఖురేష్ మరో ప్రయోగానికి రెడీ అయింది. ‘ఢిల్లీ క్రైమ్’ సిరీస్ తో విలనీగా ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతోంది. ‘ఢిల్లీ క్రైమ్’ సిరీస్ మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడా సిరీస్ నుంచి థర్డ్ పార్ట్ మొదలవుతుంది. దీనిలో భాగంగా హ్యూమా ఖురేషీని విలన్ పాత్రలో నటించే అవకాశం వచ్చింది. రిచీ మెహతా విలన్ పాత్రకు హ్యూమా అంగీకరిస్తుందా? లేదా? అన్న సందేహంతోనే వెళ్లింది.కానీ పాత్ర విన్న వెంటనే హ్యూమా ఒప్పుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఇందులో నేరస్తుల ఆకట్టించే డీసీపీ వర్తిక చతుర్వేదిని హ్యూమా ఢీ కొట్ట బోతుంది. ఆ రెండు పాత్రలు నువ్వా? నేనా? అన్న రేంజ్ లో సాగుతాయని సమాచారం. అంతే సహజంగానూ ఆ పాత్రలు ఉంటాయని సిరీస్ వర్గాలంటున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన నిజ జీవిత సంఘటనలు ఆధారంగా ఢిల్లీ క్రైమ్ మొదలైంది. ఇప్పటి వరకూ రిలీజ్ అయిన రెండు భాగాలు మంచి విజయం సాధించాయి. ఈ నేపథ్యంలో మూడవ భాగాన్ని తెరపైకి తెస్తున్నారు. షెపాలీ షా, రసికా దుగ్గల్, రాజేష్ తైలాంగ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇదే సిరీస్ లో మరికొంత మంది బాలీవుడ్ లో ఫేమస్ అయిన నటీనటులు, సింగర్లను కూడా భాగం చేయాలనుకుంటున్నారుట. ఆ వివరాలు త్వరలో బయటకు వస్తాయి. ఇంకా సిరీస్ లో చాలా మంది కొత్త వాళ్లు యాడ్ అవుతారని తెలుస్తోంది.

## అలనాటి అందాల తార జీవితంలో బోల్డ్ బ్యూటీ!

బాలీవుడ్‌కు గ్లామర్ అద్దిన నటి..హీరోయిన్‌కు అదా నేర్పిన భామ పర్వీన్ బాబి. వెండి తెరపై పర్వీన్ విసిరిన చూపులను..ఒలికించిన నవ్వులను ఏరికోవడానికి అప్పట్లో యువత థియేటర్లకు పరుగులు పెట్టేది. అప్పటి బాలీవుడ్ ఇండస్ట్రీలోనూ పర్వీన్ ఆరాధకులు తక్కువేం కాదు. అటిట్యూడ్.. ఫ్లూయెంట్ ఇంగ్లీష్.. కంప్లీట్ క్లారిటీతో పర్వీన్ బాబి ఉత్తుంగ తరంగం మోడలింగ్ నుంచి బాలీవుడ్‌కి అడుగు పెట్టింది. తొలి సినిమా ఫ్లాప్. మొదలైన లావణ్య ‘సతీ లీలావతి’ ప్రయాణం కానీ నిర్మాతలు ఆమె కోసం క్యూ కట్టేవారు. కాల్షీట్ల కోసం పోటీ పడేవారు. పర్వీన్ బాబి అందం అలాంటింది మరి.



ఆమె రాకతో బాలీవుడ్‌కి కొత్త శోభ తోడైంది. నటిగా ఓ వెలుగు వెలిగింది. అలాగే ప్రేమాయణాలు నడపడంలోనూ అంతే సంచలమైంది. అప్పట్లోనే లివ్ ఇన్ రిలేషన్ షిప్‌లు నెరిపిన నటి. విదేశీ పత్రికలు సైతం పర్వీన్ గురించి ఎన్నో సంచలన కథనాలు ప్రచురించాయి. అలా వరల్డ్ అంతా కూడా ఫేమస్ అయింది. 70-80వ దశకంలో బాలీవుడ్‌నే ఏలిన నటి. అలాంటి సంచలన నటి జీవిత కథ ఇప్పుడు వెండి తెరకు ఎక్కబోతుంది. కొంత కాలంగా పర్వీన్ బయోపిక్ తెరకెక్కుతోందంటూ ప్రచారం జరుగుతోంది. కానీ అందులో వాస్తవం కనిపించలేదు. అయితే ఇప్పుడామె కథను సినిమాగా కాకుండా వెబ్ సిరీస్ గా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఆమె పాత్రలో నటించడానికి బాలీవుడ్ యువ సంచలనం త్రిప్తీ డిమ్రీని ఎంపిక చేసారు. ఆ ఛాన్స్ ఆమెకే వరించింది. పర్వీన్ బాబి పీచర్లు కొన్ని త్రిప్తీలో ఉన్నాయనే కాన్ఫిడెన్స్‌తో షోనాలి ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. ప్రసుతం యూత్ ఫుల్ బ్యూటీగానూ త్రిప్తీ డిమ్రీ సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. అలా ఆ రెండు క్వాలిటీలో త్రిప్తి ఈ లెజెండ్ జీవితంలో నటించే ఛాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ స్క్రిప్ట్ దశలో ఉంది. మరికొద్ది రోజుల్లో షూటింగ్ ప్రారంభమతుందని సమాచారం.

## ముంబైలో అడుగుపెడుతున్న కుంభమేళా సెన్సేషన్ మోనాలిసా



మహాకుంభమేళా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రయాగ్ రాజ్-యూపీలో స్వామీజీలు, అఘోరీలు, భక్తజన కోటిని మీడియా హైలైట్ చేసింది. అయితే ఈ సంవత్సరం మహాకుంభోత్సవం ఇతర కారణాలతోను మార్మోగింది. ఇండోర్‌కు చెందిన 16 ఏళ్ల పూసల దండల సేల్స్ గర్ల్ మోనాలిసా భోంస్లే తన అందచందాలు, ఆకర్షణ కారణంగా సంచలనంగా మారింది. పూసల దండల అమ్మాయి ఓవర్ నైట్ సెలబ్రిటీగా మారింది. మోనాలిసా బోయ్స్ కలల రాణిగా గుండెల్లో నిదురించింది. తనతో సెల్ఫీలు, ఫోటోల కోసం జనం ఎగబడ్డారు. దీంతో అర్థాంతరంగా కుంభమేళాలో తన వ్యాపారాన్ని వదిలేసి ఇండోర్‌కి వెళ్లాల్సి వచ్చింది. తమ జీవనోపాధి సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది మోనాలిసా.. ఆమె కుటుంబం. ఇక మోనాలిసా కుటుంబంలో తన సోదరీమణుల అందచందాల గురించి మీడియా ఆరాలు తీసింది. ప్రస్తుతం మోనాలిసా ప్రధాన మీడియా, యూట్యూబ్ చానెళ్ల ఇంటర్వ్యూలతో పెద్ద సెలబ్రిటీ హోదాను ఆస్వాధిస్తోంది. ఇంతలోనే పది రోజుల్లో 10 కోట్లు ఆర్జించింది అంటూ మోనాలిసాపై ప్రచారం సాగడం.. దానిని మోనాలిసా ఖండించడం తెలిసిన విషయాలే. అనూహ్యంగా సెలబ్రిటీ కావడం తన జీవనోపాధికి గండి కొట్టిందని మోనాలిసా ఆవేదన చెందిన క్రమంలోనే తనకు సినిమా అవకాశాలు వచ్చాయని కూడా కథనాలొచ్చాయి. టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు రాజమౌళి కూడా మోనాలిసాకు ఆఫర్ ఇచ్చారని సోషల్ మీడియాల్లో కథనాలొచ్చాయి. అలాగే ఈ నేచురల్ బ్యూటీకి ముంబై పరిశ్రమ ఆహ్వానం పలుకుతోందని ప్రచారం సాగింది. ఇటీవల దర్శకుడు సనోజ్ మిశ్రా మోనాలిసాకు తన సినిమాలో ఒక పాత్రను ఆఫర్ చేశారని కథనాలొచ్చాయి. సనోజ్ మిశ్రా .. ది డైరీ ఆఫ్ వెస్ట్ బెంగాల్, రామ్ కీ జన్మభూమి వంటి చిత్రాలను తెరకెక్కించారు. ది డైరీ ఆఫ్ మణిపూర్ చిత్రంలో నటించాల్సిందిగా మోనాలిసాకు అతడు ఆఫర్ ఇచ్చారని, అయితే మోనాలిసా దీనికి స్పందించలేదని కూడా కథనాలొచ్చాయి. ఇంతలోనే మోనాలిసా తన ఇన్ స్టా వేదికగా ఒక పోస్టర్‌ని షేర్ చేసి, ఆసక్తికర వ్యాఖ్యను జోడించారు. దాని ప్రకారం....ఈరోజు పోస్టర్ బయట, రేపు పోస్టర్ లోపల, ఇది కాలచక్రం.. త్వరలో ముంబైలో కలుద్దాం - మోనాలిసా- అని రాసి ఉంది. పుష్పరాజ్ అల్లు అర్జున్ కనిపిస్తున్న పోస్టర్ వెలుపల మోనాలిసా ఫోటో దిగి కనిపిస్తోంది. బహుశా పోస్టర్‌లో కనిపిస్తానని మోనాలిసా ఆశాభావం వ్యక్తం చేసింది. మొట్టమొదటిసారి మహా కుంభమేళాలో రుద్రాక్ష మాలను అమ్ముతూ మోనాలిసా భోంస్లే కనిపించింది.




## తెలంగాణ కా షాన్ త్రిష.. భారత క్రికెట్‌లో మారుమోగుతున్న భద్రాచలం అమ్మాయి పేరు!



**భద్రాచలం-నవభూమి:** గొంగడి త్రిష..ప్రస్తుత భారత క్రికెట్‌లో మారుమోగుతున్న తెలంగాణ అమ్మాయి పేరు! ఊహ తెలియని వయసులోనే క్రికెట్ బ్యాట్ చేతపట్టిన ఈ భద్రాచలం చిన్నది అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేస్తున్నది. మలేషియా వేదికగా జరిగిన ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌ను విజేతగా నిలువడంలో త్రిషాది కీలక పాత్ర. ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయని నైజంతో బరిలోకి దిగే త్రిష.. తాను ఎదుర్కొన్న తొలి బంతి నుంచే ఎదురుదాడికి దిగడంలో దిట్ట అని చెప్పొచ్చు. మెగాటోర్నీలో ఏడు మ్యాచ్‌లాడిన ఈ యువ క్రికెటర్ 77.25 సగటుతో 309 పరుగులు సాధించింది.వెస్టిండీస్‌తో మొదలై దక్షిణాఫ్రికాతో మ్యాచ్ వరకు త్రిష తనదైన శైలిలో ప్రతీ పోరులో సత్తాచాటింది. ఈ క్రమంలో ప్రత్యర్థులు నిర్దేశించిన స్వల్ప లక్ష్యఛేదనలోనూ తన మార్క్ బ్యాటింగ్‌తో జట్టును ముందుండి నడిపించింది. ఆడుతున్నది పేస్ అయినా.. స్పిన్ అయినా కళాత్మక షాట్లకు తోడు పవర్‌ఫుల్ హిట్టింగ్‌తో పరుగులు కొల్లగొట్టింది. స్కాట్లాండ్‌తో సూపర్‌సిక్స్ పోరులో అజేయ సెంచరీ(110)తో కదంతొక్కింది. బౌలర్లను చెడుగుడు ఆడుకుంటూ మెగాటోర్నీ చరిత్రలో రికార్డు సెంచరీని తన పేరిట లిఖించుకుంది. ఇంగ్లండ్‌తో సెమీస్‌కు తోడు ఫైనల్లో సఫారీలపై సూపర్‌ఫామ్ కనబరుస్తూ భారత్‌కు రెండో ప్రపంచకప్‌ను అందించిన త్రిష..తెలంగాణ కా షాన్ అనడంలో అతిశయోక్తి లేదేమో!

## ఇంగ్లండ్, టీం ఇండియా మధ్య చివరి టీ20..



**ముంబై-నవభూమి:** బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇంగ్లండ్, టీం ఇండియా మధ్య ముంబైలోని వాంఖడే స్టేడియంలో ( ఆదివారం జరిగిన చివరి-ఐదో టీ20 మ్యాచ్‌కు హాజరయ్యారు. తన మామ, ఇన్ఫోసిస్ చీఫ్ నారాయణమూర్తి తో కలిసి మ్యాచ్ వీక్షించారు. ఈ సందర్భంగా ఆటగాళ్లతో సరదాగా ముచ్చటించి సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సునాక్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ప్రస్తుతం ఆ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

## రూ.5 కోట్ల నజరానా



**న్యూఢిల్లీ-నవభూమి:** మలేషియా వేదికగా జరిగిన ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత మహిళల జట్టుకు బీసీసీఐ నగదు ప్రోత్సాహం ప్రకటించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఘన విజయంతో వరుసగా రెండోసారి ప్రపంచకప్ టైటిల్ దక్కించుకున్న టీమ్ ఇండియాలో ప్లేయర్లతో పాటు సహాయక సిబ్బందికి 5 కోట్ల నజరానా ఇస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. ‘టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టుకు అభినందనలు. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో టైటిల్‌ను తిరిగి దక్కించుకున్నారు. ఈ చిరస్మరణీయ విజయానికి గుర్తింపుగా బీసీసీఐ 5 కోట్ల నగదు ప్రోత్సాహం ప్రకించింది. చీఫ్ కోచ్ నూషిన్ అల్ ఖదీర్, కెప్టెన్ నికీ ప్రసాద్‌కు శుభాకాంక్షలు. మెగాటోర్నీలో అపజయమెరుగకుండా ప్రపంచ విజేతగా నిలువడం గర్వకారణం’ అని బోర్డు పేర్కొంది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**